www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 7-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 302

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: చవితి ఉ.6:53, పంచమి తె. 6:33 వరకు, నక్షత్రం: మఖ ఉ.11:56 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.8:05-9:43, దుర్ముహూర్తం: ఉ.11:59-12:43, అమృతఘడియలు: ఉ.9:34-11:08, తె.5:52 మొదలు, రాహుకాలం: మ.12:00-1:44, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 5:51 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బ్లో ఔట్ బావి వద్ద మంటలను అదుపుచేసేందుకు వాటర్ అంబ్రెల్లా ద్వారా నీటిని వెదజల్లుతున్న ప్రత్యేక బృందాలు

అదుపులోకి బ్లో ఔట్!

- మూడు వైపుల నుంచి నీళ్లు వెదజల్లడంతో తగ్గుముఖం పడుతున్న మంటలు
- తీవ్రంగా శ్రమిస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది, అధికారులు
- ఢిల్లీ, ముంబై, డెహ్రాడూన్ నుంచి నిపుణులు రాక
- 4 రోజుల్లో మంటలు నిలువరించే అవకాశం
- వెల్ క్యాపింగ్‌కు వారం రోజులు పట్టొచ్చు: కలెక్టర్
- విద్యుత్ పునరుద్ధరణ.. ఇళ్లకు బాధితులు

14

అన్నీ తప్పులా?

రీ సర్వే, పాస్‌పుస్తకాల్లో లోపాలపై సీఎం సీరియస్

అసలు తప్పులెందుకొస్తున్నాయ్!?

- అన్నీ పక్కాగా చేస్తే సమస్యలెందుకొస్తాయ్?
- రీ సర్వేలో అభ్యంతరాలను పరిశీలించండి
- రైతుల సమక్షంలోనే సర్వే జరగాలి
- క్షేత్రస్థాయికి వెళ్లి పక్కాగా పర్యవేక్షించండి
- కీలకాంశాలపై రైతులకు స్పష్టత ఇవ్వండి
- గ్రామసభల్లో రైతుల డేటా నిర్ధారించాకే పాస్ పుస్తకాల పంపిణీ
- రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం
- వారికి జవాబుదారీగా ఉండాల్సిందే
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనాల్లోని అంశాలపై సమీక్ష
- 9న మండపేటకు సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యలు ఎందుకొస్తున్నాయి? ఇందుకు కారణమేవరు? పాసు పుస్తకాల జారీలో కీలకమైన అంశాల్లో తప్పులు రావడమేమిటి? ఇవన్నీ ముందే చూసుకోవాలి కదా!?" అంటూ రెవెన్యూ వర్గాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. జగన్ హయాంలో జరిగిన రీసర్వేలో తప్పుల తడకలు, వాటిని సరిదిద్దకుండానే ఇప్పుడు పాస్ పుస్తకాలు జారీ చేయడం, ఇతర కీలక అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో...

మిగతా 14వ పేజీలో...



ఐటీ ఇన్‌ఫ్రా కనెక్ట్ పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం. పక్కన మంత్రులు నారాయణ, భరత్, లోకేశ్, అనగాని, అచ్చెన్న, కేశవ్, జనార్దన్, గొట్టిపాటి, సుభాశ్, సీఎస్ విజయానంద్, ఐటీ కార్యదర్శి భాస్కర్

సమష్టి కృషితో సత్ఫలితాలు!

- బ్రాండ్ ఇమేజ్ పునరుద్ధరించుకున్నాం
- గత ఏడాది అధికారులంతా బాగా పనిచేశారు
- పెట్టుబడులు భారీగా రాబట్టారు
- ఈ ఏడాదీ ఇదే స్ఫూర్తితో పనిచేయాలి
- చిన్న తప్పు కూడా జరగకూడదు
- మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి
- విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చాం
- ట్రూడౌన్‌కు నాంది పలికాం 13
- సూర్యలంక బీచ్ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- 14వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం వెల్లడి
- మరో రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఓకే
- వీటితో 11,753 ఉద్యోగాలకు అవకాశం

భూ రికార్డుల్లో తప్పులు జగన్ పాపమే!

ఇప్పటికీ అవి వెంటాడుతున్నాయి 11



- నయానో, భయానో సిబ్బందిని అనుకూలంగా మార్చుకుని ఇష్టానుసారం రీసర్వే
- దాని వల్లే రైతులకు అన్యాయం.. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తున్నాం
- 6,688 గ్రామాల్లో సభలు పెడితే 7.50 లక్షల ఫిర్యాదులొచ్చాయి
- కొలతల్లో తేడాలుంటే రైతులు మళ్లీ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచన



తిరుమల కొండమీద ఒక్కరోజు వసతి కోసం నానా తిప్పలు పడాల్సిందే! సిఫారసు మీద అతిథి గృహంలో గది దొరికితే అదొక అదృష్టమే! ఇక... తామే స్వయంగా కొండ మీద గెస్ట్ హౌస్ నిర్మించడం ఇప్పుడున్న నిబంధనల ప్రకారం 'అసాధ్యం'! అవకాశమిస్తే... శ్రీవారికి కోట్లకొద్దీ విరాళమిచ్చి మరీ గెస్ట్‌హౌస్‌లు నిర్మించి అప్పగించేందుకు ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు! కానీ... ఎందరికో అసాధ్యమైన ఈ విషయం టీటీడీ బోర్డు సభ్యుడు, ప్రస్తుతం టీడీపీలో ఉన్న జంగా కృష్ణమూర్తికి సాధ్యమైంది! ఏమిటి ఆయన 'ప్రత్యేకత'? అన్ని నిబంధనలు పెట్టి ఆయనకు మాత్రం కొండమీద అతిథి గృహ నిర్మాణం కోసం స్థలాన్ని ఎందుకు కేటాయిస్తున్నట్లు? దీని వెనుక ఉన్నదెవరు? 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం... 14లో

ఏడు కొండలపై ఏమిటిది?

మరో అడ్డగోలు తీర్మానం చేసిన టీటీడీ బోర్డు

పాలకమండలి సభ్యుడు జంగాపై కొండంత ప్రేమ

కొత్త అతిథి గృహం నిర్మాణానికి స్థలం కేటాయింపు

- వైఎస్, జగన్ హయాంలోనూ ఆయనకు అవకాశాలు
- తగిన డిపాజిట్ చెల్లించకుండా వదిలేసిన జంగా
- తర్వాత మళ్లీ కోరుకున్నా ససేమిరా అన్న టీటీడీ
- 'గ్లోబల్ ట్రస్టు'ను తెరపైకి తెచ్చిన కృష్ణమూర్తి
- ట్రస్టు పేరిట స్థలం అస్సలు కుదరదని తేల్చిన బోర్డు
- వైసీపీ హయాంలోనే ఆయనకు చుక్కెదురు
- కూటమి అధికారంలోకి రాగానే మళ్లీ బోర్డులో చోటు
- మరోసారి స్థలం కోసం పావులు కదిపిన జంగా
- 'ప్రత్యేక కేసు' అంటూ పాలకమండలి ఆమోదం
- భానుప్రకాశ్ వ్యతిరేకించినా ముందుకే
- చైర్మన్ ప్రత్యేక ఆసక్తిపై అనుమానాలు

నిబంధనలు కఠినమే.. కానీ

నిబంధనల ప్రకారం.. తిరుమలలో కొత్తగా అతిథి గృహాల నిర్మాణానికి స్థలాలు కేటాయించడం కుదరదు. అయితే... పాత వైపోయిన అతిథి గృహాల స్థానంలో, అక్కడే పునరుద్ధరణకు మాత్రం 'వేలం' ద్వారా అవకాశమిస్తారు. అంటే.. టీటీడీకి అత్యధిక విరాళం చెల్లించేందుకు ముందుకు వచ్చే వారికి రెనొవేషన్ అవకాశం లభిస్తుంది.



'ఆవకాయ్' పిలుస్తోంది..

రారండోయ్!

- బెజవాడలో రేపటి నుంచి 3 రోజుల పాటు ఉత్సవాలు
- తెలుగు సినిమా, సంస్కృతి, సాహిత్యంపై విస్తృత చర్చలు
- ప్రారంభోత్సవానికి సీఎం, డిప్యూటీ సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి

ఆంధ్రులకు పెద్ద పండగ సంక్రాంతి! ఆహార సంస్కృతిలో ఆవకాయకు పెద్దపీట! ఆ పండగనూ, ఈ పచ్చడినీ కలిపి... ఈ సంక్రాంతి వేడుకలకు 'ఆవకాయ్' పేరు పెట్టేశారు. గురువారం నుంచి బెజవాడలో ప్రత్యేక సాంస్కృతిక, సాహిత్య, సినీ సంబరాలు నిర్వహిస్తున్నారు. 12



వై'భో'గ'మే!

- సముద్రం ఒడ్డున.. పచ్చని అందాల చెంతన.. ఆధునిక హంగులు 'భోగాపురం' సొంతం
- అలల మీదుగా ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్
- ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభూతి 12
- అంతర్గత నిర్మాణాల డిజైన్లలో తెలుగుదనం

అలా అలా కదులుతూ తీరాన్ని తాకుతున్న బంగాళాఖాతం అలలు! అరకు లోయతోపాటు కనుచూపు మేర పచ్చగా పరుచుకున్న తూర్పు కనుమలు! భోగాపురంలో విమానం రన్‌వేను తాకేముందు నింగి నుంచే ఈ రెండు సుందర దృశ్యాలు కనువిందు చేస్తాయి.



ఏ డీపీఆర్‌నూ పరిశీలించం

కృష్ణా ట్రైబ్యునల్-2 పంపకాలు జరగనందునే!

- బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు వచ్చేవరకూ బచావత్ తీర్పే అమలు
- కేంద్రానికి తేల్చిచెప్పిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు
- తెలంగాణ కొత్త ప్రాజెక్టులపై ఏపీ ప్రభుత్వ ఫిర్యాదుకు స్పందన

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపకాలు జరగనందున ఆ బేసిన్ పరిధిలో ఏ ప్రాజెక్టు డీపీఆర్‌నూ మదింపు చేసే అవకాశాల్లేవని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. ప్రాజెక్టుల వారీగా, రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరుగుతున్నందున డీపీఆర్‌లను పరిశీలించే అవకాశాలు లేనేలేవని తేల్చి చెప్పింది. రాష్ట్రాలవారీగా నీటి కేటాయింపులు లేకపోయినా.. రాష్ట్ర విభజన చట్టం-2014ను ఉల్లంఘించి ప్రాజెక్టుల సామర్థ్యాలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌లు సిద్ధం చేసిందని, ముందుకెళ్లకుండా దానిని నిలువరించాలని కేంద్ర జలశక్తి శాఖ, కృష్ణా బోర్డుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిర్యాదు చేసిన

మిగతా 14వ పేజీలో...

గ్యాస్ చాంబర్‌లా ఢిల్లీ

వాయు కాలుష్యంతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరి

- ఆస్తమా, న్యుమోనియా రోగులకు నిత్యం నరకం
- శ్వాస సమస్యలతో ఆస్పత్రులకు పెద్దఎత్తున ప్రజలు
- పొగమంచుతో విమానాల రాకపోకలు ఆలస్యం
- వాహనాలు, పారిశ్రామిక ఉద్గారాలు, నిర్మాణ ధూళి, సమీప రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనమే కారణాలు
- బీజింగ్‌లో పాతికేళ్ల క్రితం ఇదే సమస్యతో ఇబ్బందులు
- చైనా సర్కారు చర్యలతో పదేళ్లలో పరిస్థితి మెరుగు
- అవే విధానాలను ఢిల్లీలోనూ పాటించాలి: నిపుణులు
- ప్రజలకు కారు సామాజిక హోదాగా మారింది
- ఢిల్లీ కాలుష్యంపై విచారణలో సీజేఐ వ్యాఖ్యలు

రెండడుగుల దూరంలో ఏముందో కనిపించనంత దట్టంగా కమ్మేసిన పొగమంచు.. గాలిలో ప్రమాణాలకు మించి ప్రమాదకరమైన విషవాయువులు.. పులిమీద పుట్రలా, ఇంటా బయటా, అణువణువునా వ్యాపించి ఉన్న మొండి బ్యాక్టీరియా.. ఇదీ దేశ రాజధాని ఢిల్లీ ప్రస్తుత పరిస్థితి! అప్పుడెప్పుడో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యూదులను చంపేందుకు నాజీ నియంత

మిగతా 2వ పేజీలో...



ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో ముఖానికి మాస్కులు ధరించి అసెంబ్లీకి చేరుకున్న ఆప్ ఎమ్మెల్యేలు

సోనియాకు అస్వస్థత



శ్వాసకోశ సమస్యలతో ఢిల్లీ ఆస్పత్రిలో చేరిక 2

అమరావతికి పర్యాటక శోభ!

- కృష్ణా తీరంలో మెరీనా వాటర్ ఫ్రంట్ అభివృద్ధి
- వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు
- ఖతార్ మోడల్ తరహాలో స్పోర్ట్స్ సిటీకి అధ్యయనం
- సీఆర్డీఏ, ఏడీసీఎల్ ఆర్థిక బలోపేతంపై దృష్టి
- సీఆర్డీఏ భేటీలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఒకవైపు జిగేల్ జిగేల్‌మనే భవనాలతో రాజధాని నగరం! మరోవైపు.. కృష్ణా నదీ తీరంలో రకరకాల విన్యాసాలతో విహారం! ఇలా అమరావతికి ప్రత్యేక పర్యాటక శోభ తేవాలని సీఎం ఆదేశించారు. 'మెరీనా వాటర్ ఫ్రంట్'ను అభివృద్ధి చేయాలన్నారు. 13

నేటి పరిస్థితికి కేంద్ర కమిటీ వైఫల్యమే కారణం

- సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదు
- గణపతి, తిరుపతి ఎక్కడున్నారో తెలియదు
- నేను లొంగిపోలేదు.. పోలీసులు పట్టుకున్నారు.. 'ఆంధ్రజ్యోతి'తో బర్సే దేవా 11



రవితో పోలీసుల కుమ్మక్కు!

- కేసును బలహీనపరచడంలో భాగస్వామ్యం
- టీటీడీ మా సూచనలను పరిగణించలేదు 14
- టేబుళ్ల ఏర్పాటుపై నివేదికలో ప్రస్తావనే లేదు
- 'అమానవీయ రీతి' తనిఖీలను నిలువరించాలి
- లేదంటే పరకామణిలో భక్తుల సేవలు ఆపేస్తాం
- హైకోర్టు హెచ్చరిక.. విచారణ రేపటికి వాయిదా



సంక్రాంతికి బస్సుల్లేవ్! 12

- పండగ ప్రయాణికులకు ఏపీఎస్ఆర్టీసీ షాక్
- హైదరాబాద్ నుంచి ఏపీకి 240 బస్సులే
- రాష్ట్రం లోపల నడిచే బస్సులూ 'స్పెషలే'నట
- మభ్యపెట్టే ప్రకటన విడుదల చేసిన ఆర్టీసీ
- గత అనుభవాల నుంచి పాఠం నేర్వని తీరు
- ఇదే అవకాశంగా ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ

దమ్ముంటే మదురోలా నన్నూ పట్టుకో!

- ట్రంప్‌కు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో సవాల్
- గతంలో ఇలాగే ట్రంప్‌ను సవాల్ చేసిన మదురో!



న్యూఢిల్లీ, జనవరి 6: వెనెజువెలా అధ్యక్షుడు మదురో తరహాలో తనను పట్టుకొమ్మని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో సవాల్ చేశారు. 'ట్రంప్.. రా నన్ను పట్టుకో. ఇక్కడ నీ కోసం వేచి చూస్తున్నా..' అని పేర్కొన్నారు. "అమెరికా మాపై బాంబులు వేస్తే.. మా దేశంలోని రైతులంతా పర్వతాల్లో గెరిల్లా పోరాటయోధులుగా మారుతారు. దేశమంతా ప్రేమించే, గౌరవించే అధ్యక్షుడిని వారు బంధిస్తే.. ప్రజలు తమలోని చిరుతపులిని నిద్రలేపుతారు. నేను మళ్లీ ఆయుధం పట్టబోనని గతంలో ప్రమాణం చేశాను. కానీ నా దేశం కోసం మరోసారి ఆయుధాలు చేపట్టడానికి సిద్ధం" అని గుస్తావో పెట్రో ట్వీట్ చేశారు. గుస్తావో పెట్రో ఒకప్పుడు కమ్యూనిస్టు గెరిల్లా విభాగం నేత 1990వ దశకంలో ఆయన ఆయుధం వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. క్రమంగా ఎదిగి కొలంబియాకు అధ్యక్షుడు అయ్యారు. కాగా, మదురో కూడా కొన్ని నెలల క్రితం దమ్ముంటే తనను పట్టుకోవాలని ట్రంప్‌కు సవాలు చేయడం గమనార్హం.

అక్కడ పిజ్జా ఆర్డర్లు పెరిగితే.. అమెరికా ఎక్కడో దాడి చేస్తున్నట్టే!

న్యూఢిల్లీ, జనవరి 6: అదో పిజ్జా ఔట్‌లెట్.. పేరు 'పిజ్జాటో పిజ్జా' ఆర్డర్ చేసినకొద్దీ రకరకాల పిజ్జాలను వెంటనే సిద్ధం చేసి, వేడి వేడిగా అందిస్తుంది. గత శుక్రవారం అర్ధరాత్రి ఒకటిన్నర తర్వాత ఉన్నట్టుండి పిజ్జాల కోసం వందలకొద్దీ ఆర్డర్లు రావడం మొదలైంది. అదే సమయంలో వెనెజువెలాలో అమెరికా ఆపరేషన్ జరుగుతోంది. డెల్టాఫోర్స్, నైట్ స్టాకర్స్ దళాలు ఆ దేశ రాజధాని కారకస్‌లోకి చొచ్చుకెళ్లి అధ్యక్షుడు మదురోను ఎత్తుకొచ్చేశాయి. ఆ కాసేపటికే పిజ్జాల ఆర్డర్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. ఆ పిజ్జాల ఔట్‌లెట్ ఉన్నది అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్‌కు సమీపంలో కావడం గమనార్హం. అమెరికా దాడులకు, పిజ్జాల ఆర్డర్లకు సంబంధం ఏమిటనిపిస్తోందా? పిజ్జాల కోసం ఆర్డర్లు పెరిగినప్పుడల్లా అమెరికా ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ఏదో దేశంపైనో, ప్రాంతంలోనో దాడులు చేస్తూ ఉంటుందట. దీన్ని 'పెంటగాన్ పిజ్జా థియరీ' అని కూడా పిలుస్తారు. గతంలో ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై అమెరికా దాడుల నుంచి ఇటీవల ఇరాన్‌పై దాడి, తాజాగా వెనెజువెలా ఆపరేషన్ దాకా ఇలా పిజ్జాల ఆర్డర్లు భారీగా వచ్చాయని చెబుతారు. నిజానికి అమెరికా సైనిక ఆపరేషన్ల సమయంలో పెంటగాన్‌లో పనిచేసే వందలాది మంది అధికారులు అక్కడే ఉంటారు. అలాంటప్పుడు వారి కోసం పిజ్జాలు ఆర్డర్ చేస్తారని, అందువల్లే దాడుల సమయంలో పిజ్జాల ఆర్డర్లు పెరుగుతాయని అంటున్నారు.

మదురో లాగే మోదీనీ ఎత్తుకుపోతారా: చవాన్



న్యూఢిల్లీ, జనవరి 6: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అపహరించినట్టే, ప్రధాని మోదీని కూడా ట్రంప్ ఎత్తుకుపోతాడా అంటూ కాంగ్రెస్ నేత, మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది. "వెనెజువెలాకు జరిగిందే భారత్ విషయంలోనూ జరగనుందా? ప్రధానిని ట్రంప్ ఎత్తుకుపోతారా?" అని చవాన్ సోషల్ మీడియా పోస్టులో ప్రశ్నించారు. దీనికి 'మెదడు చలించిందా?' అంటూ చవాన్‌పై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఒక అణ్వస్త్ర దేశానికి వెనెజువెలాతో పోలికా అంటూ.. చవాన్ వ్యాఖ్యలను పరిహాసం చేస్తూ మీడియా కథనాలు ప్రసారం చేసింది. చవాన్ తీరును మాజీ రక్షణ, పోలీసు ఉన్నతాధికారులు కూడా తప్పుబడుతున్నారు.

కాల పరీక్షకు నిలిచిన భారతీయ భాషలు

- ఢిల్లీలో 55 సాహిత్య గ్రంథాలు ఆవిష్కరించిన ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భారతీయ భాషలను అంతమొందించేందుకు అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ, అవి కాల పరీక్షకు నిలిచాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా భాషల్లో ప్రచురించిన 55 సాహిత్య గ్రంథాలను ఆయన మంగళవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. వీటిలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రచురించిన 8 గ్రంథాలు, సైగల భాషలో తీసుకొచ్చిన తమిళ గ్రంథం 'తిరుక్కురల్' కూడా ఉన్నాయి.

ఇవీ ఆ గ్రంథాలు.. తొలిసారి ప్రచురించిన మూడు గ్రంథాలు.. కంచి వీరశరభకవి రచించిన 'హరిశ్చందోపాఖ్యానము', దూర్జటి వెంకటరాయ కవి రచించిన 'రత్నావళి పరిణయము', నుదురుపాటి వెంకన్న రచించిన 'మల్లు పురాణము'లతోపాటు తెలుగులో విశిష్ట కవితా ప్రక్రియ చిత్ర కవిత్వంపై వైద్యం వేంకటేశ్వరచార్యులు రచించిన 'చిత్రకవిత్వ దర్పణం', తెలుగులో తొలి చందో గ్రంథం 'కవిజనాశ్రయము' గ్రంథానికి ఆచార్య వెంకటేశ్వర్లు రాసిన వ్యాఖ్యాన గ్రంథం, ఇదే గ్రంథానికి ఆచార్య ఆర్వీఎస్ సుందరం చేసిన ఆంగ్ల అనువాదం, వినుకొండ వల్లభరాయుడు రచించిన 'క్రీడాభిరామము' గ్రంథానికి ఆచార్య ఎస్.జయప్రకాశ్ చేసిన తమిళానువాదం, తాళ్లపాక చిన తిరుమలాచార్యుడు రాసిన 'సంకీర్తన లక్షణము' గ్రంథానికి డాక్టర్ గీతానావల్ చేసిన కన్నడ అనువాదం, ప్రసిద్ధ తమిళ సాహిత్య గ్రంథం 'శిలప్పదిగారం' తెలుగు అనువాదం, 'సింహాసన ద్వాత్రింశిక, వాల్మీకి చరిత్ర, సుభద్రాకల్యాణం, భోజరాజీయము, శ్రీ వేంకటాచల మహాత్మ్యము, దశకుమారచరిత్ర, విక్రమార్క చరిత్ర తదితర కావ్యాలకు వ్యాఖ్యాన గ్రంథాలను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు.

ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తులకు బ్రాండింగ్ !

- మహిళా సంఘాలకు సుస్థిర ఆదాయమే లక్ష్యం: సీఎం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు తయారు చేస్తున్న 23వేలకు పైగా ఉత్పత్తులను దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు బ్రాండ్ బాగా ఉపకరిస్తుందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సెర్ఫ్, మెప్మా విభాగాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. 'వ్యవస్థీకృతంగా ఈ ఉత్పత్తులు విక్రయించేందుకు వినూత్నంగా, విభిన్నంగా బ్రాండింగ్ ఉండాలి. అరకు కాఫీ తరహాలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో బ్రాండ్ రూపొందిస్తే.. ఉత్పత్తులకు మరింత విలువ పెరుగుతుంది. ఈ విధానం ద్వారా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం పేర్కొన్నారు. పశుసంవర్ధకంతో పాటు సేవల రంగంలోనూ మహిళా సంఘాలు రాణించాలని ఆకాంక్షించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో 852 ప్రాజెక్టులు


- 17 లక్షల కోట్లతో కేంద్రం భారీ ప్రణాళిక
- రాష్ట్రాల్లో సింహభాగం ఏపీకే

న్యూఢిల్లీ, జనవరి 6: వచ్చే మూడేళ్లలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో 852 ప్రాజెక్టులు చేపట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. దీనికోసం రూ.17లక్షల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం వెల్లడించింది. 2025-26 బడ్జెట్‌లో ప్రతిపాదించిన మేరకు ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేసింది. ఇందులో 232 ప్రాజెక్టులను రూ.13.15లక్షల కోట్లతో కేంద్ర మౌలిక సదుపాయాల శాఖ చేపట్టనుంది. రూ.3.84లక్షల కోట్లతో 620 ప్రాజెక్టులను 20 రాష్ట్రాలు, యూటీలు అమలు చేస్తాయి. కేంద్రం వాటా కింద 108 ప్రాజెక్టులను కేంద్ర రహదారులశాఖ రూ.8.76 కోట్లతో చేపడుతుంది. విద్యుత్ శాఖ 46 ప్రాజెక్టులను రూ.3.4కోట్లతో, రైల్వేశాఖ 13ప్రాజెక్టులను రూ.30,904 కోట్లతో, నీటి వనరులు, నదుల అభివృద్ధి శాఖ 29 ప్రాజెక్టులను రూ. 12,254 కోట్లతో, పెట్రోలియం శాఖ ఓ ప్రాజెక్టును రూ. 8,743 కోట్లతో, పరిశ్రమల ప్రోత్సాహక శాఖ 2 ప్రాజెక్టులను రూ. 6,646 కోట్లతో, పౌర విమానయాన శాఖ 11 ప్రాజెక్టులను రూ. 2,262 కోట్లతో పీపీపీ విధానంలో చేపట్టనున్నాయి. వీటిలో రూ.1.16లక్షల కోట్లతో ఏపీలో 270 ప్రాజెక్టులు చేపడతారు. తమిళనాడులో 70 ప్రాజెక్టులకు గాను రూ. 87,640 కోట్లను కేటాయించారు.

అమెరికా.. ఆ 3 దేశాలు!

కొలంబియా, మెక్సికో, క్యూబాలపై గురి ఎందుకు?

- వెనెజువెలా తరహాలో ఈ మూడు దేశాలపైనా చర్యలు చేపడతామని హెచ్చరించిన ట్రంప్



న్యూఢిల్లీ, జనవరి 6: భారీగా చమురు వనరులున్న వెనెజువెలాలో చొరబడి ఆ దేశ అధ్యక్షుడిని డ్రగ్స్ సరఫరా ఆరోపణలతో ఎత్తుకెళ్లిన అమెరికా.. మరో మూడు దేశాలనూ లక్ష్యంగా చేసుకుంది. డ్రగ్స్ అక్రమ రవాణా ఆపకపోతే.. కొలంబియా, మెక్సికో, క్యూబా దేశాల పాలకులకూ ఇదే గతి పడుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు కూడా. డ్రగ్స్ మాట ఎలా ఉన్నా.. వెనెజువెలాలో చమురును చేజిక్కించుకోవడమే ట్రంప్ లక్ష్యమనేది అందరూ చెబుతున్నదే. మరి కొలంబియా, మెక్సికో, క్యూబాలకు ట్రంప్ హెచ్చరికల వెనుక అసలు కారణాలేంటి? ఆ దేశాలతో అమెరికాకు ఉన్న సమస్యలు, పరస్పర సంబంధాలు, ఇతర అంశాలు ఏమిటనే దానిపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అమెరికా ఉద్దేశాల వెనుక డ్రగ్స్‌తోపాటు అక్రమ వలసలు, సిద్ధాంతాలు, సహజ వనరులు, ఆ ప్రాంతాలపై వ్యూహాత్మక ఆధిపత్యం వంటి అంశాలెన్నో ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

మొదటి నుంచీ క్యూబా శత్రుదేశమే!

కమ్యూనిస్టు దేశమైన క్యూబా సహజంగానే సిద్ధాంత పరంగా అమెరికాకు వైరి దేశం. సోవియట్ యూనియన్ కాలం నుంచీ రష్యాకు క్యూబా మిత్ర దేశం. దానికితోడు చైనాలతోనూ సత్సంబంధాలు ఉండటంతో క్యూబాపై అమెరికా చాలా కాలం ఆంక్షలు కొనసాగించింది. ఎలాగైనా క్యూబాను తమ చెప్పుచేతల్లోకి తీసుకోవాలని ప్రయత్నించింది. క్యూబాపై ఉగ్రవాద దేశం ముద్రవేసింది. ఆ దేశ అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రోను పదవి నుంచి దింపేయడానికి పలుమార్లు ప్రయత్నించి, విఫలమైంది. 2018లో ట్రంప్ అధ్యక్షుడయ్యాక క్యూబాను ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా ప్రకటించారు. వెనెజువెలా నుంచి వద్దన్నా చమురు కొంటోందంటూ ఆంక్షలను కఠినతరం చేశారు.

కొలంబియా.. బ్రిక్స్ వైపు మళ్లడం

కొలంబియా దేశానికి ప్రపంచ డ్రగ్స్ రాజధానిగా పేరుంది. ప్రపంచంలో అత్యధికంగా కొకైన్ తయారయ్యేది అక్కడే. కానీ ఈ దేశాన్ని ట్రంప్ లక్ష్యంగా చేసుకోవడానికి వెనుక కారణాలు మాత్రం వేరే. నిజానికి మొదట్లో అమెరికాకు కొలంబియా మిత్రదేశంగా ఉంది. 2012లో ఈ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా కుదిరింది. కొలంబియా వాణిజ్యంలో 34శాతం అమెరికాతోనే జరుగుతుంది. ఆ దేశంలో డ్రగ్స్ కట్టడి కోసం అమెరికా భారీగా ఆర్థిక సహాయం కూడా అందించింది. 2021 నాటి లెక్కల ప్రకారం అమెరికాలో 16 లక్షల మంది కొలంబియన్లు వివిధ ఉద్యోగాలు, పనుల్లో ఉన్నారు. 2022లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కొలంబియాకు నాటోయేతర సన్నిహిత మిత్ర దేశం హోదా కూడా ఇచ్చారు. కానీ కమ్యూనిస్టు భావాలున్న గుస్తావో పెట్రో కొలంబియా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక అమెరికాతో దూరం పెరగడం మొదలైంది. అమెరికా డ్రగ్స్ వ్యతిరేక విధానాల అమలుకు గుస్తావో పెట్రో నిరాకరించారు. అదే సమయంలో భారత్, రష్యా, చైనాల ఆధ్వర్యంలోని బ్రిక్స్ ప్లస్ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపారు. నాటోకు పోటీగా బ్రిక్స్ కూటమి తయారయ్యేలా ఉందంటూ అమెరికా ఇప్పటికే కారాలు మిరియాలు నూరుతోంది. ఈ క్రమంలో కొలంబియాపై కన్నెర్ర చేసింది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. ట్రంప్ కొలంబియాకు ఆర్థిక సాయాన్ని నిలిపివేయడంతోపాటు సుంకాలనూ విధించారు. కరీబియన్ ప్రాంతంలో అమెరికా యుద్ధ నౌకలను మోహరించి, ఆధిపత్యాన్ని ప్రదర్శించడాన్ని కొలంబియా తప్పుబట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా వెనెజువెలా తరహాలో చర్యలు చేపడతామనీ హెచ్చరించారు.

మెక్సికో.. వలసల సమస్య..

అమెరికా, మెక్సికో ఇరుగుపొరుగు దేశాలే. ఇరు దేశాల మధ్య 3,145 కిలోమీటర్ల సుదీర్ఘ సరిహద్దు ఉంది. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఎప్పుడూ ఒడిదుడుకులే. కానీ 2020లో అమెరికా, మెక్సికో, కెనడాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంతో అమెరికాకు మెక్సికో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా మారింది. 2023లో ఈ దేశాల మధ్య వాణిజ్యం రూ.72 లక్షల కోట్లు (799 బిలియన్ డాలర్లు) కావడం గమనార్హం. అయినా మెక్సికో నుంచి అమెరికాలోకి అక్రమ వలసలు, ప్రమాదకర ఫెంటానిల్ సహా డ్రగ్స్ అక్రమ రవాణా, అమెరికాలో నేరాలు చేసే క్రిమినల్ గ్యాంగ్‌లకు మెక్సికో స్థావరంగా ఉండటం వంటివి సమస్యాత్మకంగా మారాయి. ట్రంప్ అక్రమ వలసలు, డ్రగ్స్ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకని అమెరికా, మెక్సికో సరిహద్దులో గోడ కట్టేపని కూడా మొదలుపెట్టారు. మెక్సికోపై సుంకాలు కూడా విధించారు. మెక్సికోలో డ్రగ్స్ ముఠాల స్థావరాలపై అమెరికా దళాలు దాడులకు దిగుతాయని ప్రకటించారు.

అమెరికా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటే 'నాటో' కథ ముగిసినట్లే!

- డెన్మార్క్ ప్రధాని సంచలన వ్యాఖ్యలు



బెర్లిన్, జనవరి 6: అమెరికా గ్రీన్‌లాండ్‌ను బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే, అది 'నాటో' కూటమి అంతానికి దారితీస్తుందని డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్ స్పష్టం చేశారు. ఒక సభ్య దేశంపై మరో సభ్య దేశమే దాడికి దిగితే ప్రపంచ భద్రతా వ్యవస్థే కుప్పకూలుతుందని ఆమె హెచ్చరించారు. "అమెరికా ఒకవేళ నాటోలోని తోటి దేశంపై సైనిక దాడికి దిగితే, అంతటితో అంతా ముగిసినట్లే. రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుంచి మనకు రక్షణగా ఉన్న నాటో కూటమి ఆ క్షణమే కనుమరుగవుతుంది" అని మెటె పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు ఒక ప్రాంతం గురించి మాత్రమే కాకుండా, అంతర్జాతీయ శాంతి ఒప్పందాలనే ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. "మరో 20 రోజుల్లో గ్రీన్‌లాండ్ విషయం తేలుస్తా" అన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. డెన్మార్క్ వాదనకు ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, పోలాండ్, స్పెయిన్, బ్రిటన్ దేశాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ సహా పలువురు ఐరోపా నేతలు మంగళవారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తూ.. గ్రీన్‌లాండ్ ఎవరి సొత్తు కాదని, అక్కడి ఖనిజ సంపద ఆ భూభాగం ప్రజలకే చెందుతుందని తేల్చి చెప్పారు.

లోకం తీరు




బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి హత్య

- రాత్రి వేళ దుకాణం మూసి ఇంటికి వెళ్తుండగా దాడి చేసిన దుండగులు
- డిసెంబరు నుంచి ఇప్పటి వరకూ ఏడుగురు హిందువులు బలి

ఢాకా, జనవరి 6: బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువుల ప్రాణాలు బలిగొంటున్న ఘటనలు ఆగటం లేదు. సోమవారం రాత్రి మరో హిందువును పొట్టనపెట్టుకున్నారు. మృతుడు 40 ఏళ్ల వయసున్న మోనీ చక్రవర్తి ఓ కిరాణా కొట్టు యజమాని. దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో రాత్రి 11 గంటలకు కొందరు దుండగులు ఆయన మీద పదునైన ఆయుధంతో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన మోనీని పోలీసులు సమీపంలోని ఆస్పత్రికి తరలించినప్పటికీ.. ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటన పాలాష్ ఉపజిలాలోని చార్‌సింధూర్ బజార్‌లో జరిగింది. మోనీ తండ్రి మదన్ ఠాకూర్.. షిబ్‌పూర్ ఉపజిలాకు చెందిన సదాచార్ యూనియన్ సభ్యుడని పోలీసులు తెలిపారు. కాగా, సోమవారం రాణా ప్రతాప్ భైరాగి అనే జర్నలిస్టు కూడా హత్యకు గురైన విషయం తెలిసిందే. అంతకుముందు కొకొన్ చంద్రదాస్, అమృత్ మండల్, దీపుచంద్రదాస్ తదితరులు మూకదాడుల్లో మరణించారు. సోమవారం ఓ హిందూ వితంతువు మీద ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. హిందువుల నివాసాల మీద కూడా దాడులు జరుగుతున్నాయి. విద్యార్థుల తిరుగుబాటుతో 2024 ఆగస్టులో షేక్ హసీనా ప్రధాని పదవిని వీడి భారత్‌కు పారిపోయిన అనంతరం.. బంగ్లాదేశ్‌లో హిందువుల మీద దాడులు మొదలయ్యాయి. ఈ ఘటనల్లో ఇప్పటి వరకూ ఏడుగురు హిందువులు మరణించారు.

కాంగ్రెస్ నేత సురేశ్ కల్మాడీ మృతి



న్యూఢిల్లీ, జనవరి 6: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ(81) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పుణెలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 3.30గంటలకు చనిపోయారు. సురేశ్ కల్మాడీ పీవీ ప్రభుత్వంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 1996-2011 మధ్యలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా, ఆ తర్వాత కామన్వెల్త్ క్రీడల నిర్వాహక కమిటీ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కల్మాడీ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భారత్‌లో ప్రతిష్ఠాత్మక ఆఫ్రో ఆసియా గేమ్స్(2003), కామన్వెల్త్ యూత్ గేమ్స్(2008), కామన్వెల్త్ గేమ్స్(2010), ఆసియాన్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలను(1989,2013) నిర్వహించారు. ఆ సమయంలోనే కామన్వెల్త్ క్రీడల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. కల్మాడీని అరెస్టు కూడా చేశారు. అయితే, తర్వాత ఈడీ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చింది. కల్మాడీ అంతకుముందు 1964-1972మధ్యలో వాయుసేనలో పైలట్‌గా పనిచేశారు. కల్మాడీ 1944లో మద్రాసులో జన్మించారు. 1980ల్లో రాజకీయాల్లోకి వచ్చారు. 4సార్లు రాజ్యసభకు, 3సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారను.

మోదీకి సమాధి తవ్వుతాం!

జేఎన్‌యూలో కొందరు విద్యార్థుల నినాదాలు

న్యూఢిల్లీ, జనవరి 6: జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో కొందరు విద్యార్థులు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు వ్యతిరేకంగా అభ్యంతరకర నినాదాలు చేశారు. 2020లో ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేతలు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఓ కార్యక్రమంలో కొందరు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంతో పాటు మోదీ, షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'మోదీ, అమిత్ షాలకు సమాధులు తవ్వుతాం' అంటూ వివాదాస్పద నినాదాలు చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

గ్యాస్‌చాంబర్‌లా ఢిల్లీ!

(మొదటి పేజీ తరువాయి)

హిట్లర్ గ్యాస్ చాంబర్లను వాడేవాడని చరిత్ర చెబుతోంది. ఇప్పుడు ఢిల్లీ నగరమే ఈ వాయుకాలుష్యంతో, యాంటీబయాటిక్ మందులకు లొంగని సూపర్‌బగ్స్‌తో.. ప్రమాదకరమైన గ్యాస్‌చాంబర్‌లా మారి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మరీముఖ్యంగా.. ఆస్తమా, న్యూమోనియా వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఈ వాతావరణం అక్షరాలా నరకం చూపిస్తోంది. గొంతు మంట, ఊపిరి తీసుకోలేక పోవడం వంటి సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీలో విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. ఏటా చలికాలం రాగానే ఢిల్లీని తీవ్రంగా ఇబ్బంది పెట్టే సమస్య ఇది. ఈ సీజన్‌లో సగటు ఢిల్లీవాసి పీల్చే ఊపిరిలో ఎంత కాలుష్యం ఉంటుందంటే.. రోజుకు 33-50సిగరెట్లు తాగినదాంతో సమానమని అంచనా. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వాయునాణ్యత సూచీ (ఏక్యూఐ).. 0 నుంచి 50 మధ్య ఉంటే మంచిది. 51-100 వరకూ.. పర్వాలేదు. 101-150 మధ్యలో ఉంటే..వృద్ధులు, పిల్లలకు ఇబ్బంది. 151-200 వరకూ ఉంటే ఆ గాలి అనారోగ్యకరమైనది. 201-300 వరకూ అత్యంత అనారోగ్యకరం. 301 దాటితే అత్యవసర పరిస్థితి కింద లెక్క. ఢిల్లీలోని మెజారిటీ ప్రాంతాల్లో దాదాపు అన్ని రోజులు ఏక్యూఐ 300కు పైనే నమోదవుతోంది. డిసెంబరులో ఒక దశలో ఏకంగా 432, 461కి చేరింది.

ఆ రెండే ఆదర్శం..

రెండున్నర దశాబ్దాల క్రితం బీజింగ్‌లో ఇదే సమస్యతో బాధపడ్డ చైనాను అనుసరించాలని ఢిల్లీ ఎనర్జీ అండ్ రీసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్‌లోని 'సెంటర్ ఫర్ ఎయిర్ క్వాలిటీ రిసెర్చ్'కు చెందిన సురేశ్ రామసుబ్రమణ్య అయ్యర్ వంటి నిపుణులు సలహా ఇస్తున్నారు. అప్పట్లో బీజింగ్.. ఈ భూమ్మీదే అత్యంత దట్టమైన పొగమంచు, కాలుష్యంతో నిండిపోయిన నగరంగా ఉండేది. కాలుష్యాన్ని తగ్గించడానికి అధికారులు వాహన ఉద్గారాలపై, నిర్మాణపనులపై కఠిన ఆంక్షలు విధించారు. పాత, కాలంచెల్లిన వాహనాలు రోడ్లపైకి రాకుండా నిషేధించారు. ప్రజారవాణాను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెచ్చారు. పచ్చదనం పెంచారు. ఆ చర్యలు ఫలించడంతో 2010 నాటికి బీజింగ్‌లో గాలి నాణ్యత అద్భుతంగా మెరుగుపడింది. అలాగే.. సూరత్‌లోని పారిశ్రామికవాడల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా వాడిన 'పార్టిక్యులేట్ మ్యాటర్ ఎమిషన్స్ ట్రేడింగ్' విధానాన్ని.. ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలకూ వర్తింపజేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఆ విధానంలో భాగంగా..గుజరాత్ ప్రభుత్వం సూరత్‌లోని ప్రతి పరిశ్రమకూ కాలుష్య ఉద్గారాలపై ఒక పరిమితి విధించింది. ఏదైనా ఒక పరిశ్రమ ఆ పరిమితిలోపే కాలుష్యకారకాలను విడుదల చేస్తే ఆ పరిశ్రమకు ప్రభుత్వం కొన్ని క్రెడిట్ పాయింట్లు ఇస్తుంది. దీంతో, సూరత్‌లో కాలుష్యం 20-30% దాకా తగ్గినట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది.

సోనియాగాంధీకి అస్వస్థత

- ఢిల్లీ కాలుష్య ప్రభావమే కారణమన్న వైద్యులు!

న్యూఢిల్లీ, జనవరి 6: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో సోమవారం రాత్రి ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 79ఏళ్ల సోనియాకు దీర్ఘకాలిక దగ్గు సమస్య ఉండడంతో పాటు ఢిల్లీలో ఉన్న వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పుడు చలి తీవ్రత కూడా తోడవడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఒక్కసారిగా తిరగబెట్టాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఛాతీ వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆందోళన అవసరంలేదని ఆస్పత్రి చైర్మన్ చెప్పారు.

కాలుష్య నియంత్రణలో సీఏక్యూఎం విఫలం

- ఢిల్లీలో వాయు కాలుష్యంపై విచారణలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 6: దేశ రాజధాని ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యంపై ఏర్పాటైన కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం).. విధి నిర్వహణలో విఫలమైందంటూ అసహనం వ్యక్తం చేసింది. కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందుగా.. కాలుష్యానికి కారణాలను గుర్తించాలని పేర్కొంది. ఢిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పెరుగుతున్న వాయు కాలుష్యానికి బస్సులు, ట్రక్కులు కారణమని చెప్పడం సులువేనని, అయితే వాటిని నిలిపివేస్తే ప్రజలు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. తాము తీసుకుంటున్న చర్యలపై రెండు నెలల్లో వివరాలు సమర్పిస్తామని సీఏక్యూఎం తెలపగా.. ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కమిషన్ తీరు చూస్తుంటే త్వరగా సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన కనిపించడంలేదని వ్యాఖ్యానించింది. రెండు వారాల్లోగా నిపుణులతో సమావేశం నిర్వహించాలని సీఏక్యూఎంను ఆదేశించింది. ముందుగా కాలుష్య సమస్యకు కారణాలను గుర్తించాలని, ఆపై వాటిని ఎదుర్కొనేందుకు పరిష్కారాలను కనుగొని తమకు నివేదిక సమర్పించాలని నిర్దేశించింది. విచారణ సందర్భంగా.. ప్రజలు బహుళ సంఖ్యలో కార్లు కలిగి ఉండకుండా చేస్తే వాయు కాలుష్యం సమస్యను పరిష్కరించవచ్చన్న సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనకు జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. ప్రస్తుత సమాజంలో ప్రజలకు కారు ఒక సామాజిక హోదాగా మారిందని, ప్రతి ఒక్కరూ కారు కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా డబ్బు దాచుకుంటున్నారని అన్నారు. ధనవంతులు కూడా కొంత త్యాగం చేయాలని, హై ఎండ్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని సూచించారు.

ఆ స్తంభంపై దీపం వెలిగించొచ్చు!

- 'తిరుప్పరంకుండ్రం' కేసులో మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు

చెన్నై, జనవరి 6(ఆంధ్రజ్యోతి)/న్యూఢిల్లీ: తమిళనాడులోని మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే విషయంలో మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. కొండపై ఉండే స్తంభంపై దీపం వెలిగించొచ్చని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను జస్టిస్ జీ జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌ల ధర్మాసనం సమర్థించింది. దేవస్థాన ప్రతినిధులు మాత్రమే కార్తీక మాసంలో అక్కడ దీపం వెలిగించాలని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని ఆదేశించింది. కొండపైనున్న దీప స్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ రవికుమార్ అనే హిందూమున్నని కార్యకర్త పిటిషన్‌పై జస్టిస్ స్వామినాధన్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును ధర్మాసనం తోసిపుచ్చింది. తిరుప్పరంకుండ్రం కొండపై స్తంభం ఉన్న ప్రాంతం సుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందినదేనని స్పష్టం చేసింది. అక్కడ దీపం వెలిగించడం ఆగమ శాస్త్రాల ప్రకారం నిషేధమనే వాదనకు అప్పీల్‌దారులు బలమైన ఆధారాలు సమర్పించలేకపోయారని పేర్కొంది. ఈ సందర్భంగా డీఎంకే ప్రభుత్వ తీరును న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. రాతి స్తంభం ఆ కొండపైనున్న దర్గాకు చెందిందన్న ప్రభుత్వ వాదన సరికాదని, ఆ స్తంభంపై దీపం వెలిగించడం వలన ప్రజాశాంతికి భంగం కలుగుతుందనే వాదన 'హాస్యాస్పదం' అని పేర్కొంది. కొండపై దీపం వెలిగించడం అక్కడి ఆచారం కాదని ప్రభుత్వం కానీ, ఆలయ యాజమాన్యం గానీ చెప్పడం లేదని తెలిపింది. 'సంవత్సరంలో ఒక్క నిర్దిష్ట రోజున ఆలయ ప్రతినిధులను దీపం వెలిగించడానికి అనుమతిస్తే.. శాంతి భద్రతలకు భంగం కలుగుతుందనే వాదన హాస్యాస్పదంగా ఉంది. అలాంటి అలజడికి ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తే తప్ప అది జరగదు. తమ రాజకీయ అజెండా కోసం ఏ ప్రభుత్వమూ ఆ స్థాయికి దిగజారకూడదని ఆశిస్తున్నాం' అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం!

రాష్ట్ర మంత్రి ఎస్.రఘుపతి విలేకరులతో మాట్లాడుతూ.. కోర్టు తీర్పును తప్పుబట్టారు. తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్నారు. వందేళ్ల చరిత్రను పరిశీలిస్తే ఇప్పటివరకు లేని సంప్రదాయాన్ని బలవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మరోవైపు, హైకోర్టు తీర్పును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై స్వాగతించారు. తాజా తీర్పు డీఎంకే ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని పేర్కొన్నారు.



తిరుప్పరంకుండ్రం ఆలయం, రాతిస్తంభం

శ్రీశైలంలో 12 నుంచి సంక్రాంతి ఉత్సవాలు

శ్రీశైలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 12వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమై 18వ తేదీన ముగుస్తాయని ఆలయ పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏడు రోజులపాటు పంచాహ్నిక దీక్షలతో స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. 12వతేదీ ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభమై సాయంత్రం ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపట ఆవిష్కరణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. 13 నుంచి వాహనసేవలు ప్రారంభమై 15 వతేది సంక్రాంతి రోజున లీలా కల్యాణం జరుగుతుంది.

ఫిబ్రవరి 8 నుంచి 15 వరకే శ్రీశైలం కాలినడక భక్తులకు అనుమతి

- పులుల గణన నేపథ్యంలో అటవీశాఖ ఆంక్షలు

ఆత్మకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నల్లమలలోని నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో జరుగుతున్న అఖిల భారత పులుల గణన-2026 నేపథ్యంలో శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు అటవీశాఖ పలు ఆంక్షలు విధించింది. ఆత్మకూరు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేశ్ అప్పారావు మంగళవారం మాట్లాడుతూ.. మహాశివరాత్రిని పురస్కరించుకుని నల్లమల అటవీ మార్గం మీదుగా భక్తులు కాలినడకన వెళ్లనున్న నేపథ్యంలో పులుల గణన ప్రక్రియకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు తాత్కాలికంగాఆంక్షలను విధిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెంకటాపురం నుంచి పాదయాత్రగా వెళ్లే భక్తులను ఫిబ్రవరి 8 నుంచి 15 వరకు మాత్రమే అనుమతిస్తామని వెల్లడించారు. మిగతా రోజుల్లో దోర్నాల మీదుగా రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వైసీపీ దోపిడీకి అడ్డాలుగా మైనింగ్, ఎక్సైజ్



- ప్రజలకు ఇసుక ఇవ్వకుండా జగన్ ఇబ్బంది పెడితే... చంద్రబాబు ఉచిత ఇసుకతో వారికి అండగా ఉన్నారు
- రాష్ట్రంలో 25.21 లక్షల టన్నుల ఇసుక వినియోగం
- అందులో 10.98 లక్షల టన్నులు గోదావరి ఇసుకే
- మరిన్ని ర్యాంపులు సిద్ధం చేస్తున్నాం
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 1.50 కోట్ల టన్నుల ఇసుక డ్రెడ్జింగ్‌కు ప్రయత్నాలు
- ఎంఆర్‌పీకే మద్యం... బెల్టుకు ససేమిరా
- 35% నుంచి 40% డిజిటల్ పేమెంట్లే: మంత్రి కొల్లు

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం మైనింగ్, ఎక్సైజ్ శాఖలను... ముఖ్యంగా ఇసుకను దోపిడీకి అడ్డాగా మార్చింది. రూ.3,300 కోట్లు అవినీతికి పాల్పడింది' అని మంత్రి కొల్లు రవీంద్ర విరుచుకుపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో మైనింగ్, ఎక్సైజ్ శాఖల పనితీరుపై సమీక్షించిన అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'అన్నీ డిజిటల్ పేమెంట్లే చేయాలని ఈరోజు ఆదేశించాం. ఇప్పటికే 35 నుంచి 40 శాతం జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో శత శాతం జరిగేటట్టు చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో ఎక్కడా లిక్కర్ ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మకూడదు. బెల్ట్ షాపులు కూడా పెట్టకూడదు. మొలకలచెరువు, ఇబ్రహీంపట్నం సంఘటన నేపథ్యంలో సురక్ష యాప్ తీసుకొచ్చాం. లిక్కర్ బాటిల్‌ను అందులో స్కాన్ చేస్తే దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిసిపోతాయి. రూ.99కే మంచి క్వాలిటీ బ్రాండ్లు అందుబాటులో ఉండడం వల్ల బీరు అమ్మకాలు పడిపోయాయి. కాకినాడలో అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు చేశాం. ఇక్కడ లిక్కర్‌కు సంబంధించి 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. సారా నిరోధించడంలో నవోదయంతో 100 శాతం విజయవంతమయ్యాం. ఇక్కడ 14 పీడీ కేసులు పెట్టాం. ఇంకా ఎవరైనా సారా తయారీకి ప్రయత్నిస్తే మరింత కఠినంగా వ్యవహరిస్తాం. గతం నుంచి సారా తయారీపై ఆధారపడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపిస్తున్నాం. ఇప్పటికే పశ్చిమగోదావరిలో మొదలు పెట్టాం. త్వరలో మిగతా చోట్ల కూడా అమలు చేయనున్నాం. గత వైసీపీ ప్రభుత్వం గంజాయిని ఆదాయ మార్గంగా మార్చుకుంటే మేం ఈగల్ టీమ్‌ను పెట్టి గంజాయి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదు. వైసీపీ ఇసుక దోపిడీ చేసి, ప్రజలకు ఇసుక లేకుండా చేసి, భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేసింది. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదాయం కూడా లెక్కచేయకుండా ఉచిత ఇసుక విధానం తెచ్చి, కార్మికులకు, ప్రజలకు అండగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది 25.21 లక్షల టన్నుల ఇసుక వినియోగిస్తే అందులో 10.98 లక్షల టన్నుల ఇసుక గోదావరిదే. ఇసుక ర్యాంపులను పెంచుతున్నాం. డీసిల్టేషన్, ఓపెన్ ర్యాంపులు, పట్టా భూముల్లో కూడా ఇసుక తీస్తున్నాం. ఇంకా ఎక్కడ వీలైతే అక్కడ ఇసుక తీయడానికి సిద్ధంగా ఉన్నాం. ఉచిత ఇసుక వల్ల విశాఖలో ప్రస్తుతం టన్ను రూ.500 నుంచి రూ.700కే లభ్యమవుతుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక మేటలు తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందనే ఆలోచనతో ఇరిగేషన్ అధికారులు అక్కడ 1.50 కోట్ల టన్నుల ఇసుక తీయడానికి ప్రతిపాదించారు. దీనిని డ్రెడ్జింగ్ చేసే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే అమరావతి నిర్మాణం కోసం కృష్ణా నదిలో డ్రెడ్జింగ్ చేస్తున్నాం. రోడ్డు మెటల్, క్రిటికల్, మైనర్ మినరల్ వంటి వాటిని గుర్తిస్తున్నాం. ఎప్పటికప్పుడే అనుమతులు ఇస్తూ అవినీతికి తావు లేకుండా చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంచుతున్నాం. గతంలో కేసుల్లో ఉన్న వాటికి రూ.కోట్లు ఫైన్ వేసి, పరిష్కరిస్తున్నాం. వైసీపీది పనికిమాలిన బుద్ధి. వాళ్లు మారరు. బతుకులు మారవు. తప్పుడు కేసులతో మా వాళ్లను రాజమండ్రి జైలులో పెట్టి ఆనందించారు. ప్రజలు చీకొట్టినా, నీచ రాజకీయాలు మానడం లేదు. ఇక వాళ్ల ఆటలు సాగనిచ్చేది లేదు' అని మంత్రి రవీంద్ర హెచ్చరించారు.

టీవీకే అధినేత విజయ్‌కు సీబీఐ సమన్లు

- తొక్కిసలాట కేసులో 12న విచారణకు రావాలని నిర్దేశం



చెన్నై, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట కేసులో ఈనెల 12న విచారణకు హాజరుకావాలని టీవీకే పార్టీ అధ్యక్షుడు, తమిళ నటుడు విజయ్‌కు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో ఆయనను విచారించనుంది. గతేడాది సెప్టెంబరు 27న తమిళనాడులోని కరూర్ నగరంలో విజయ్ నిర్వహించిన సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించగా, 60 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై తొలుత తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) విచారణ చేపట్టింది. అయితే, స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టీవీకే పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ కేసును కోర్టు సీబీఐకి అప్పగించింది. అలాగే, దర్యాప్తును పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. సీబీఐ అధికారులు ఇప్పటికే 200 మందికిపైగా ప్రత్యక్ష సాక్షులను విచారించారు. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, సంయుక్త కార్యదర్శి నిర్మల్ కుమార్, ప్రచార కార్యదర్శి ఆదవ్ అర్జున్, కరూర్ వెస్ట్ జిల్లా కార్యదర్శి మదియళగన్‌లను కూడా విచారించారు. విజయ్ ప్రచారం చేపట్టిన వ్యాన్‌లోని సీసీ టీవీ ఫుటేజీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు విజయ్‌ను కూడా విచారించిన తర్వాత చార్జిషీటు దాఖలు చేసే అంశంలో నిర్ణయం తీసుకోనున్నట్టు సీబీఐ అధికారులు తెలిపారు.

'మన శంకరవరప్రసాద్ గారు' టికెట్ రూ.1.11లక్షలు!

- ప్రీమియర్ షోకు అమలాపురంలో వేలంపాట .. దక్కించుకున్న అభిమాని

అమలాపురంటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ప్రీమియర్ షో టికెట్ కొనుగోలు చేసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. ఈనెల 12న విడుదల కానున్న ఈ చిత్రం ప్రీమియర్ షో మొదటి టికెట్‌కు మంగళవారం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీవెంకటరమణ థియేటర్ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. గతంలో ఎన్నడూలేని విధంగా మొదటి టిక్కెట్‌ను రూ.1.11లక్షలకు బీజేపీ సీనియర్ నాయకుడు, మెగా అభిమాని మోకా వెంకట సుబ్బారావు దక్కించుకున్నారు. .

నరసాపురంలో రూ.1.02 లక్షలు

నరసాపురం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి) : 'మన శంకర వరప్రసాద్ గారు' ప్రీమియర్ షో టికెట్‌కు మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్‌లో వేలం పాట నిర్వహించగా... మండలంలోని లక్ష్మణేశ్వరానికి చెందిన గణేశ్ రూ.1.02 లక్షలకు దక్కించుకున్నారు.

9 నుంచి ఆన్‌లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్లు

- నెలరోజులు ప్రయోగాత్మకంగా పరిశీలన

తిరుమల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్ ద్వారా కేటాయిస్తున్న శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లను ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా కేటాయించనున్నారు. నెల రోజులు ప్రయోగాత్మకంగా పరిశీలించాక తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం తిరుమలలోని అన్నమయ్య భవనం ముందున్న కౌంటర్ ద్వారా ప్రతిరోజు ఆఫ్‌లైన్ విధానంలో 800 టికెట్లు, రేణిగుంట ఎయిర్‌పోర్టులో 200, అడ్వాన్స్ బుకింగ్ విధానంలో (మూడునెలల ముందుగా) 500 చొప్పున శ్రీవాణి టికెట్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమలలో కరెంట్ బుకింగ్‌ను రద్దు చేసి ఆన్‌లైన్‌లో ఏరోజుకారోజు కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. ఆన్‌లైన్‌లో టికెట్లు పొందిన భక్తులు అదేరోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టు చేయాలి. ఒక కుటుంబానికి 1 ప్లస్ 3 చొప్పున మొత్తం నలుగురు బుక్ చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇక, మూడు నెలల ముందు విడుదల చేసే 500 శ్రీవాణి దర్శన టికెట్ల కోటాపై మూడు నెలల తర్వాత సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని టీటీడీ వెల్లడించింది. ఎయిర్‌పోర్టు కోటా యథావిధిగా కొనసాగనుంది.

రేపు అర్ధరాత్రి వైకుంఠద్వారాలు మూసివేత

- ఏడు రోజుల్లో 5.42 లక్షల మందికి శ్రీవారి దర్శనం
- రూ.28.69 కోట్లు హుండీ ఆదాయం

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని వైకుంఠ ద్వారాలను గురువారం అర్ధరాత్రి మూసివేయనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబరు 30వ తేదీ నుంచి 10 రోజుల పాటు వైకుంఠద్వార దర్శనాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 8వ తేదీ అర్ధరాత్రి ఏకాంత సేవ సమయంలో వైకుంఠద్వారాలు మూసివేయనున్నారు. 9వ తేదీ నుంచి యథావిధిగా ప్రత్యేక దర్శనాలన్నీ తిరిగి ప్రారంభంకానున్నాయి. ఇక, గడిచిన ఏడు రోజుల్లో 5.42 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా, రూ.28.69 కోట్లు హుండీ కానుకలుగా లభించాయి. ఆదివారం, సోమవారాలతో పోల్చితే మంగళవారం తిరుమలలో రద్దీ పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 15 గంటల సమయం పడుతోంది. చివరి రెండురోజులు రద్దీ అధికంగా ఉండొచ్చని టీటీడీ అంచనా వేస్తోంది.

బోర్లు తవ్వి.. అప్పుల పాలు..

- ఇద్దరు రైతుల ఆత్మహత్య

కొత్తచెరువు, రామగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లాలో సేద్యపు అప్పులు ఒకే రోజు ఇద్దరు రైతుల ఉసురు తీశాయి. కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన పెద్దన్న(55) ఉరి వేసుకోగా, రామగిరి మండలం నసనకోట గ్రామానికి చెందిన జగదీశ్వర రెడ్డి(50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దన్న, అతని తమ్ముడికి కలిపి మూడు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు ఐదు ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. ఇద్దరూ కలిసి వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసేవారు. సొంత పొలంలో బోరులో నీరు అడుగంటడంతో రూ.5 లక్షలు అప్పు చేసి బోరు బావులను తవ్వించారు. చుక్క నీరు పడకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. అప్పులు రూ.10 లక్షలు దాటాయి. దిక్కుతోచని స్థితిలో పెద్దన్న మంగళవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. నసనకోట రైతు జగదీశ్వర రెడ్డికి అర ఎకరం పొలం ఉండేది. అందులో వరి సాగు చేసేవాడు. బోరు బావిలో నీరు తగ్గడంతో రూ.5 లక్షలు అప్పు చేసి రెండు బోరు బావులు తవ్వించాడు. నీరు పడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చేందుకు ఉన్న కాస్త పొలాన్ని అమ్మేశాడు. అయినా మరో రూ.లక్షన్నర దాకా అప్పు మిగలడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

సిగరెట్లపై పన్నుల పెంపును పునః సమీక్షించాలి

- పొగాకు బోర్డు చైర్మన్, ఈడీలకు రైతుల వినతి

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సిగరెట్లపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన ఎక్సైజ్ పన్నులను పునఃసమీక్షించాలని ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన ఎఫ్‌సీవీ(ఫ్లూ-క్యూర్డ్ వర్జీనియా) పొగాకు రైతులు డిమాండ్ చేశారు. ఈ పన్ను పెంపు కొనసాగితే వేలాది మంది రైతుల జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులోని పొగాకు బోర్డు చైర్మన్ యస్వంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీకి రైతులు వినతిపత్రాలు సమర్పించారు. అకస్మాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల చట్టబద్ధమైన సిగరెట్ విక్రయాలు తగ్గిపోతాయని, దాంతో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు భారీగా పడిపోతాయని రైతు నాయకులు పేర్కొన్నారు.

నీటి వాటాలపై రాజీలేని పోరు

- ఎక్కువ నిధులు అక్కర్లేకుండానే ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తి: మాధవ్
- భోగాపురం విమానాశ్రయానికి అంకురార్పణ చేసిందెవరో ప్రజలకు తెలుసు
- ప్రతి సోమవారం 'జనతా వారధి'
- బీజేపీ ఎమ్మెల్యేల కార్యాలయాల్లో ప్రతి శుక్రవారం 'వారధి': బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నీటి వాటాలు, హక్కులపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. మంగళవారం విశాఖలో ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వివిధ నదుల్లో రాష్ట్ర నీటి వాటాల విషయంలో బీజేపీ తప్పనిసరిగా తన పాత్ర పోషిస్తుందని చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వివక్షకు గురయ్యాయన్నారు. పోలవరం జీవనాడి ప్రాజెక్టు అని, గోదావరి నీరు శ్రీకాకుళం జిల్లాలోని వంశధారలో కలపాలనే లక్ష్యం కోసం పోరాటం చేస్తుందని చెప్పారు. విశాఖపట్నానికి భారీ పరిశ్రమలు వస్తున్నందున నీటి అవసరం చాలా ఉందని.. పోలవరం ఎడమ కాలువ పనులు త్వరితంగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేజ్-1, ఫేజ్-2 పనులపై కూడా దృష్టి పెడతామని.. ఎక్కువ నిధులు అవసరం లేకుండానే ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసే అవకాశం ఉందని చెప్పారు. రాయలసీమకు 200 టీఎంసీల నీరు కావాలని, అక్కడ కూడా భారీ పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. కృష్ణా నది నుంచి మహారాష్ట్ర, కర్ణాటక ఎక్కువ నీటిని వాడుకుంటున్నాయని, మిగులు జలాల్లో ఏపీకి వాటా ఇవ్వాల్సి ఉందన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం తామే నిర్మించామంటూ జగన్ ప్రచారం చేసుకోవడంపై స్పందిస్తూ.. అది ఎవరి ఆలోచన వల్ల అంకురార్పణ జరిగిందో, ఎవరు భూసేకరణ చేసి, శంకుస్థాపన చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. 2014-19 మధ్య ఎన్‌డీఏ ప్రభుత్వంలోనే అది వచ్చిందని స్పష్టంచేశారు. భారత్, అమెరికా దేశాల మధ్య ప్రస్తుత సంబంధాల నేపథ్యంలో గూగుల్ విశాఖలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా ఒత్తిడి చేస్తోందా అని అడుగగా.. అది వాస్తవమేనని.. కాకపోతే గూగుల్ డేటా సెంటర్ అవసరాలు భారత్ కంటే అమెరికాకే ఎక్కువగా ఉన్నందున ఆ ప్రాజెక్టు ఆగదని మాధవ్ స్పష్టంచేశారు. ప్రజల సమస్యలు మరింత త్వరితంగా పరిష్కారం కావడానికి బీజేపీ ప్రతి సోమవారం 'జనతా వారధి' కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాలకు బీజేపీ కార్యకర్తలు వెళ్లి ప్రజల సమస్యలపై అర్జీలు అందిస్తారన్నారు. ఈ నెల 9న విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడల్లో బీజేపీ ఎమ్మెల్యేల కార్యాలయాల్లో 'వారధి' కార్యక్రమం ప్రారంభిస్తున్నామని.. ఇది ప్రతి శుక్రవారం ఉంటుందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు చేరువ కాలేదని, దానిపై ఇంకా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని మాధవ్ చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి, పక్కన చాంద్‌బీ

విజయవంతంగా మోచేతి కీలు మార్పిడి శస్త్రచికిత్స

- రాష్ట్రంలో తొలిసారిగా.. సాయిభాస్కర్ హాస్పిటల్స్ వైద్యుల ఘనత

గుంటూరు మెడికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలిసారిగా మోచేతి కీలు మార్పిడి (ఎల్‌బో రీప్లేస్‌మెంట్) ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి అరుదైన ఘనత సాధించారు గుంటూరుకు చెందిన సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్యులు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ఆపరేషన్ వివరాలను వివరించారు. గుంటూరు పొట్టి శ్రీరాములునగర్‌కు చెందిన చాంద్ బీ (67) అనే మహిళ రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతుండగా, ఏడు సంవత్సరాల కిందట రెండు మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. కొంతకాలంగా మోచేతి కదలికలు క్షీణిస్తూ రావడంతో రోజువారి కార్యకలాపాల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. దీంతో మోచేతి కీలు మార్పిడి తప్పనిసరి అయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మోచేతి కీలు మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు. మూడు వారాలకే పూర్తిస్థాయిలో పనులు నిర్వహించుకునే స్థాయికి చాంద్‌బి వచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా రోబోటిక్ తుంటి మార్పిడి ఆపరేషన్లను ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో త్వరలోనే యాంకిల్ (మడమ) రీప్లేస్మెంట్ సర్జరీ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని డాక్టర్ నరేంద్ర రెడ్డి తెలిపారు. నిరుపేదలకు మోచేతి కీలు మార్పిడి ఆపరేషన్లు ఆర్థిక భారం కాకూడదన్న ఉద్దేశంతో... గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రోగి చాందిబి మాట్లాడుతూ ఆపరేషన్ అనంతరం పూర్తిస్థాయిలో మోచేతి కదలికలను తిరిగొచ్చాయని, తనకు తానుగా భోజనం చేస్తున్నానని చెప్పారు.

భార్యాభర్తల కేసులో.... లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ

- హత్యాయత్నం సెక్షన్ ఉందంటూ బెదిరింపు
- ఏసీబీకి అడ్డంగా దొరికిన వైనం



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్ఐ కిరణ్‌బాబు

కర్నూలు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భర్తపై భార్య చేసిన ఫిర్యాదును అడ్డం పెట్టుకుని... హత్యాయత్నం కేసు ఉందని బెదిరించి, లంచం డిమాండ్ చేసిన ఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన మేరకు వివరాలు...కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం యనగండ్ల గ్రామానికి చెందిన శివనాగిరెడ్డికి కల్లూరుకు చెందిన భారతితో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. శివనాగిరెడ్డి హైదరాబాదులో ఓ ప్రైవేటు మార్కెటింగ్ కంపెనీలో పని చేస్తుంటారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పంచాయితీ పోలీస్ స్టేషన్ దాకా చేరింది. భార్య మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, 'ఈ కేసులో చాలా సెక్షన్లు ఉన్నాయి.. అందులో హత్యాయత్నం సెక్షన్ కూడా నమోదైంది. దీని కింద మీ ఇంటిల్లిపాదిని రిమాండ్‌కు పంపించాల్సి ఉంటుంది. ఆ సెక్షన్లన్నీ నాన్ బెయిలబుల్..' అంటూ ఈ కేసు విచారణ అధికారి అయిన ఎస్ఐ కిరణ్ కుమార్ శివనాగిరెడ్డిని బెదిరించారు. ప్రధానంగా ఉన్న హత్యాయత్నం సెక్షన్ తొలగిస్తానని, అందుకు రూ.60వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు నిందితుడు శివనాగిరెడ్డికి ఇష్టం లేకపోవడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బందోబస్తు నిమిత్తం వెళ్లిన ఎస్ఐ కిరణ్‌బాబు మంగళవారం స్టేషన్‌కు రాలేదు. శివనాగిరెడ్డి ఎస్ఐకి ఫోన్ చేయగా.. తన ఇంటికి రావాలని సూచించారు. కర్నూలు నగరంలోని అధీనా స్కూల్ సమీపంలో ఎస్ఐ కిరణ్ ఉంటున్న నివాసానికి బాధితుడు వెళ్లి, రూ.30వేలు లంచం ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐపై కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

న్యాయభంగం

బెయిల్ కాదు, జైలే.. సుప్రీంకోర్టు తేల్చేసింది. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ పట్ల న్యాయస్థానం ఇంతకఠినంగా ఉండటం, బెయిల్ నిరాకరించడం హక్కుల ప్రేమికుల నుంచి న్యాయకోవిదుల వరకూ అందరినీ ఆశ్చర్యపరిచింది. మిగతా ఐదుగురికీ కఠినషరతులతోనైనా బెయిల్ వచ్చినందుకు ఉమర్ సంతోషిస్తున్నాడు. ఇక జైలే నా జీవితం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు నిరాశ కాదు. ఈ సర్వస్వతంత్ర, సర్వసత్తాక, ప్రజాస్వామ్యదేశంలో వ్యవస్థలు ఎంత స్వతంత్రంగా ఉన్నాయన్న అవగాహన అది.

సుప్రీంకోర్టుకు మిగతావారికంటే వీరిద్దరూ ప్రమాదకారులనిపించింది. ప్రణాళికాబద్ధంగా, ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా జనసమీకరణ చేసి, అల్లర్లకు మార్గనిర్దేశనం చేశారన్న ప్రాసిక్యూషన్ వాదనను కోర్టు తన బెయిల్ నిరాకరణకు ఆధారంగా చూపింది. ఏడాది తరువాత కొత్తగా బెయిల్ దరఖాస్తు చేసుకోవచ్చునని అంతపెద్ద కుట్రదారులకూ కోర్టు వెసులుబాటు ఇచ్చింది. ఏడాదిలోగా సాక్షుల వ్యవహారం ముగింపునకు వస్తుందనో, లేదా ఏడాది తరువాత బెయిల్ ఇవ్వగల అవకాశాలు కొత్తగా పెరుగుతాయనో కోర్టు అనుకుంటోందా? బెయిల్ దక్కడానికి వారు జైల్లో గడిపిన ఈ ఐదేళ్ళకాలం రాజ్యాంగపరంగా కనీసార్హతగా సరిపోదా, అందుకు మరో ఏడాది గడువు ఏమైనా ఉందా? తెలియదు. మళ్ళీ రండి చూద్దాం అన్నంతమాత్రాన అదేమాట మళ్ళీ మళ్ళీ అనరన్న నమ్మకమేమీ లేదు. అందుకే ఉమర్ తన జీవిత భాగస్వామితో ఆ మాటన్నాడు.

‘ఊపా’ మోపిన నిందితులందరినీ ఏకరీతిన చూడకుండా, బెయిల్ అంశాన్ని సామూహికంగా నిర్ణయించకుండా వీరిద్దరినీ వేరుపెట్టి సుప్రీంకోర్టు విభిన్నంగా వ్యవహరించడం న్యాయకోవిదులను సైతం ఆశ్చర్యపరిచింది. బెయిల్ దశలో సుదీర్ఘ విచారణలు, ఆధారాల తవ్వకాలు అంతగా అక్కరలేదని, నేరం తీవ్రతని ఉపరితలంలో గ్రహించి, సులభంగా బెయిల్ ఇవ్వాలన్నది సర్వోన్నత న్యాయస్థానం గతంలో పలుమార్లు నొక్కివక్కాణించిన న్యాయం. ఇప్పుడు అదే కోర్టు ఐదేళ్ళపాటు విచారణ లేకుండా జైల్లో మగ్గినంతమాత్రాన బెయిల్ ఇవ్వాలన్న నియమం ఏమీ లేదు పొమ్మన్నది. విచారణ ముందుకు సాగకపోవడం రాజ్యాంగ నియమాలు, విలువల ఉల్లంఘనగా కాక, ఒక సాంకేతిక తప్పిదంగా కోర్టు భావిస్తున్నట్టుంది. సెప్టెంబరులో ఢిల్లీ హైకోర్టు నిందితులపట్ల కఠినంగా వ్యవహరించినప్పుడు, ఉమర్ భాగస్వామి ఎంతో నమ్మకంగా తమకు ఇక సుప్రీంకోర్టే దిక్కని అన్నారు. బెయిల్ నియమం, జైలు మినహాయింపు అనే సూత్రం ఊపా వంటి కఠిన చట్టాలకు, ఉగ్రవాద కేసులకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసి, కొందరికి బెయిల్ కూడా ఇచ్చింది. నేర స్వభావంతో నిమిత్తం లేకుండా నిందితుడి బెయిల్ హక్కును కాపాడవలసిందేనని నొక్కివక్కాణించింది. అందువల్ల, ఈ కేసులో నిందితులు అనుభవించిన ఐదేళ్ళ ముందస్తు జైలుశిక్షకు కోర్టు మనసు కరుగుతుందని అనుకున్నారు. కానీ, ‘ఊపా’లో బెయిల్ ఎంత కష్టమో తెలుసా అని సుప్రీంకోర్టు ఇప్పుడు మళ్ళీ కొత్త పల్లవి అందుకుంటోంది.

సమీపకాలంలో విచారణ పూర్తికాబోదన్న నిజం తెలిసికూడా న్యాయస్థానాలు నిందితుల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిందితులు దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనీ, సంఘవిద్రోహశక్తులనీ ప్రభుత్వ వ్యవస్థలన్నీ ఏకమాటగా వాదిస్తున్నప్పుడు, మిగతావారంతా నమ్ముతున్నప్పుడు ఆ సత్యాన్ని రుజువుచేసే ప్రక్రియ ఇంకా ఆరంభం కాకపోవడం ఆశ్చర్యం. ఐదేళ్ళుగా విచారణ జరపకుండా, బెయిల్ మంజూరు చేయకుండా, దోషులుగా నిరూపించకుండా, నేరనిర్ధారణకు ముందే శిక్షలు అనుభవించేట్టుగా చేయడంలో ప్రభుత్వం పై చేయి సాధించింది. దిగువకోర్టులో ఎదురుదెబ్బలు అటుంచితే, సుప్రీంకోర్టులో పలు రకాల కారణాలతో ఒకే ఏడాదిలో పదిహేనుసార్లు ఉమర్ బెయిల్ పిటిషన్ పరిశీలనకు దూరంగా ఉండిపోయిన చరిత్ర ఉంది. చివరకు, తనకు తానుగా ఆయన ఆ అభ్యర్థనను ఉపసంహరించుకొని, ఇతరత్రా వాదనలతో, కారణాలతో మళ్ళీ దిగువ నుంచి పోరాటం మొదలుపెట్టి, ఇదిగో ఇప్పుడు మళ్ళీ పెద్దకోర్టు చేతిలోనే ఎదురుదెబ్బ తిన్నాడు. బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు ఇప్పటికైనా, నిర్దిష్టకాలపరిమితిలోగా విచారణ ముగిసేట్టుగా చర్యలు తీసుకోవాలి.

అమెరికా ఆధిపత్యానికి తలొగ్గడమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్ |

‘నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి’ అని మహాకవి శ్రీశ్రీ ఏనాడో ఘోషించారు. సామ్రాజ్యవాదం కొనసాగుతున్నంతకాలం ప్రపంచ చరిత్రలో ఆ నగ్న సత్యం స్థిరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. గత వారం వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని అర్ధరాత్రి పూట అమెరికా దళాలు అపహరించి తమ దేశానికి తరలించిన తీరు ఎవరికైనా ఒళ్లు గగుర్పొడిపించేసే ఘట్టం. ఇది వెనెజువెలాపై యుద్ధం కాదని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆ దేశాధ్యక్షుడిపై అమెరికా చట్టాల ప్రకారం చేపట్టిన చర్య మాత్రమేనని, ఆ దేశాన్ని ఆక్రమించుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో, అమెరికా చమురు కంపెనీలు వెనెజువెలాలో ప్రవేశించి వందల కోట్ల డాలర్లతో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాయని కూడా ఆ పెద్ద మనిషి ప్రకటించారు. రాజకీయ సుస్థిరత నెలకొనేవరకు వెనెజువెలాను తామే నడిపిస్తామని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. నిజానికి గత ఆగస్టు నుంచీ అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు వెనెజువెలా చుట్టూ మోహరిస్తూ విధ్వంసక దాడులు చేస్తూనే ఉన్నాయి. అయినా గత వారాంతంలో వెనెజువెలాకు వ్యతిరేకంగా తాము చేసింది యుద్ధం కాదని ట్రంప్ నిస్సిగ్గుగా ప్రకటించారు.

వెనెజువెలా చమురు నిల్వలపై దృష్టి పెట్టినందువల్లే అమెరికా ఆ దేశాధ్యక్షుడిని అపహరించిందన్న విషయం ప్రపంచంలో ఎవరూ కాదనలేని వాస్తవం. చమురు తవ్వకాలను ప్రభుత్వ రంగంలో నిర్వహించడమే కాకుండా ఆ సహజ సంపదను డాలర్ ధరలకు కాకుండా ఇతర దేశాలకు, ముఖ్యంగా చైనాకు విక్రయించుకోవడాన్ని అమెరికా సహించలేకపోయింది. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తమ పెట్రోలియం ఉత్పత్తులను డాలర్ ధరలకు కాకుండా యూరోలకు అమ్ముకున్నప్పుడు కూడా అమెరికా ఇదే విధంగా వ్యవహరించింది. 2003లో ఇరాక్ ను ఆక్రమించిన తర్వాత అమెరికా తొలుత చేసిన పని ఇరాకీ చమురును మళ్లీ డాలర్లకు అమ్ముకోవడమే. నిజానికి ఇరాక్ రసాయన ఆయుధాలు తయారు చేస్తున్నదన్న నెపంతో అమెరికా ఆ దేశాన్ని దురాక్రమించింది. అయితే ఇరాక్‌లో మూకుమ్మడి మారణాయుధాలు ఉన్నట్టు ప్రపంచానికి రుజువుచేయలేకపోయింది. డాలర్‌కు బదులు ప్రత్యామ్నాయ కరెన్సీ గురించి యోచించినందువల్లే మానవత్వ పరిరక్షణ పేరుతో లిబియా అధినేత గడాఫీని ఊచకోత కోసి ఆ దేశాన్ని సర్వనాశనం చేసేంతవరకూ అమెరికా ఊరుకోలేదు. వెనెజువెలా కూడా డాలర్‌తో నిమిత్తం లేకుండా రకరకాల కరెన్సీల్లో, బార్టర్ పద్ధతుల్లో చమురు అమ్మడం ప్రారంభించింది. చైనాకు ఆ దేశ కరెన్సీ యువాన్‌లోనే చమురు అమ్మింది. దీనితో మాదకద్రవ్యాల ఉగ్రవాదం, నియంతృత్వం, ప్రజాస్వామ్యం పేరుతో అమెరికా వెనెజువెలా అధ్యక్షుడిని అపహరించింది.

నిజానికి ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు డాలర్ ఆర్థిక శృంఖలాల నుంచి విముక్తి పొందాలని ఆలోచిస్తున్నాయి. భారత్ ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసి రూపాయి ధరకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. అయితే తాము సాంకేతిక సర్దుబాట్లు మాత్రమే చేసుకున్నామని, డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడం లేదని న్యూఢిల్లీ సర్దిచెబుతోంది. డాలర్ ఆధిపత్యం కూలిపోవడాన్ని అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. డాలర్ ఆధిక్యతను తగ్గించే ఏ అంతర్జాతీయ చట్టాలను, సార్వభౌమాధికారాలను అమెరికా సహించదు. తమ ఆర్థిక ఆధిపత్యాన్ని ఆమోదించినంతమేరకే అమెరికాకు ఏ దేశంతోనైనా స్నేహం. లేకపోతే ఇరాన్, లిబియా, వెనెజువెలా లాగా క్రూరమైన అణిచివేతలకు గురి కావల్సివస్తుంది. ఆంక్షలు, తిరుగుబాట్లు, సైనిక చర్యలు చేపడతామన్న హెచ్చరికలతో వెనెజువెలాలో అల్లకల్లోలం సృష్టించిన తర్వాతే అమెరికా గత శనివారం అర్ధరాత్రి రంగంలోకి దిగింది. చైనా రాయబారితో వెనెజువెలా అధ్యక్షుడు మదురో చర్చలు జరిపి ఆ దేశంతో తమకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రకటించిన మూడుగంటల్లోనే అమెరికా సైనిక దళాలు ఆయనను అపహరించి తమ దేశానికి తీసుకువెళ్లాయి.

అసలు ఒక దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదో లేదో, అక్కడ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో నిర్ధారించే హక్కు అమెరికాకు ఎక్కడిది? నిజానికి ఎన్ని అప్రజాస్వామిక, నియంతృత్వ దేశాలతో అమెరికా సంబంధాలు కొనసాగించడం లేదు? అమెరికా న్యాయస్థానాలే ప్రపంచ కోర్టుల్లాగా వ్యవహరించడం సబబేనా? ప్రపంచ దేశాల మధ్య శాంతిని సంరక్షించడం ఐక్యరాజ్యసమితి విధ్యుక్త ధర్మం. మరి వెనెజువెలాపై అమెరికా ఆగడాన్ని ఆపలేకపోయినప్పుడు సంస్థ ఉనికికి ఏమైనా అర్థం ఉన్నదా? ఒక దేశ పాలకులను ఆ దేశ ప్రజలే నిర్ణయించాలన్న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ఒడంబడికకు అర్థం ఏమైనా ఉన్నదా? అమెరికా ఎప్పుడూ ఈ నిబంధనలను పాటించలేదు. 1989లో పనామా అధ్యక్షుడు నొరెగాను బుష్ ప్రభుత్వం ఇదే విధంగా బంధించి తమ దేశానికి తీసుకువెళ్లింది. ప్రపంచంలో అనేక దేశాల్లో నాయకత్వ మార్పులకు, విధ్వంసకాండలకు పూనుకున్న అమెరికా ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు నేర్పుతూ ఉంటుంది. 2011లో సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో పాకిస్థాన్ వెళ్లిన బృందానికి అమెరికా విశ్వరూపం కనిపించింది. ఆ దేశంలో సీఐఏ ఏజెంట్ రేమండ్ డేవిస్ తన కారు వెనుక వస్తున్న ఇద్దరు పాకిస్థానీ యువకులను అనుమానించి ఉత్తి పుణ్యాన కాల్చి చంపాడు. ప్రజలు తీవ్ర నిరసన తెలిపేసరికి అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. క్షణాల్లో అమెరికా ప్రత్యేక విమానం లాహోర్‌లో దిగింది. లాహోర్ జైలులోనే విచారణ జరిపించి అతడిని విడుదల చేశారు. ఆ యువకుల కుటుంబ సభ్యులకు బ్లడ్ మనీ చెల్లించి అమెరికాలో ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేశారు. అదే ప్రత్యేక విమానంలో రేమండ్ డేవిస్‌తో పాటు వారిని కూడా అమెరికాకు తీసుకువెళ్లారు. పాక్ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లో నిరసన తెలిపినా చేసేదేమీలేకపోయింది. రావల్పిండికి కూతవేటు దూరంలో ఉన్న అబోటాబాద్‌లో తల దాచుకున్న బిన్‌లాడెన్‌ను అమెరికా సైన్యాలు ఎలా హతమార్చాయో అందరికీ తెలిసిందే. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అపహరించేందుకు సహకరించిన ముగ్గురు వెనెజువెలా అధికారులను కూడా అమెరికాకు రాచమర్యాదలతో తరలించినట్లు వార్తలు వస్తున్నాయి. 1984లో భోపాల్‌లో యూనియన్ కార్బైడ్‌లో విషవాయువు లీక్ అయి వేలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా ఆ సంస్థ చైర్మన్, అమెరికన్ దేశస్థుడు వారెన్ ఆండర్సన్ స్వదేశానికి సురక్షితంగా పారిపోయేందుకు మన ప్రభుత్వమే వీలు కల్పించింది. భారత న్యాయస్థానం ఆండర్సన్‌ను నేరస్థుడుగా ప్రకటించినప్పటికీ ఆయన నిర్దోషి అని అమెరికా వాదిస్తోంది. ఆండర్సన్‌ను భారత్‌కు పంపించేందుకు ససేమిరా అంటోంది. మన న్యాయస్థానాలను ఎవరు లెక్కచేస్తారు?

వెనెజువెలా అధ్యక్షుడిని కళ్లకు గంతలు కట్టి, చేతులకు సంకెళ్లు వేసి ఒక జంతువులా అమెరికా బంధించి తీసుకువెళ్లిన ఘటన యావత్ప్రపంచ ప్రజలను నివ్వెరపరిచింది. భారతదేశం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. యూరోపియన్ దేశాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ట్రంప్‌ను వ్యక్తిగతంగా కానీ, అమెరికా సైనిక చర్యను కానీ తప్పుపట్టేందుకు మనం వెనుకాడవలిసి వస్తోంది. ఒక దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడం సరైనది కాదని మనం చెప్పలేకపోతున్నాం. మన విదేశాంగ శాఖ ప్రతినిధి మదురో అపహరణ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసి మిన్నకుండిపోయారు. ట్రంప్ మన దేశం పట్ల వ్యవహరిస్తున్న తీరు దృష్ట్యా ఆయనను శత్రువుగా చేసుకునేందుకు భారత్ ఏ మాత్రం సిద్ధంగా లేదు. అమెరికాతో మన ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా దిగజారిపోకూడదన్న ఉద్దేశంతో భారత్ వ్యవహరిస్తోంది. అమెరికా ఇప్పటికే మన దేశంపై 50శాతం టారిఫ్‌లను విధించింది. జౌళి ఉత్పత్తులు, ఆభరణాలు, ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాల ఎగుమతులకు భారీ నష్టాలు వాటిల్లుతున్నాయి. వాణిజ్య లోటు తీవ్రంగా పెరిగిపోతోంది. అమెరికాతో జరుగుతున్న వర్తక చర్చలు ఎప్పటికి కొలిక్కి వస్తాయో తెలియని పరిస్థితి ఉన్నది.

భారత రాయబారి వినయ్ క్వాత్రా గత నెలలో తనతో సమావేశమయ్యారని, రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించామని, టారిఫ్‌ను తగ్గించేందుకు ట్రంప్‌ను ఒప్పించాలని బతిమిలాడారని ట్రంప్ కుడిభుజం, అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం సోమవారం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేఖరులకు చెప్పారు. ఆయన ప్రక్కనే ఉన్న ట్రంప్ స్పందిస్తూ రష్యా నుంచి చమురును కొనుగోలుచేయడం పూర్తిగా ఆపకపోతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని హెచ్చరించారు. ‘భారత్ నన్ను సంతోషపెట్టాలనుకుంటోంది. మోదీ మంచివాడే. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు– నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. రష్యా చమురు అంశంపై సహాయపడకపోతే టారిఫ్‌లను పెంచవచ్చు..’ అని ట్రంప్ చెప్పారు. వెనెజువెలాపై దాడి జరిపిన తర్వాత అమెరికా భారత్‌కు చేసిన హెచ్చరిక ఇది.

అమెరికా అధ్యక్షుడు అసలు మన ప్రధానమంత్రికి సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వాలి? ఆయన చెప్పినట్లు మనం ఎందుకు నడుచుకోవాలి? ఆయనను మోదీ ఎందుకు సంతోషపెట్టాలి? ప్రస్తుతానికి మౌనంగా ఉంటే ట్రంప్ మనను ప్రేమిస్తారనుకోవడం భ్రమ. ట్రంప్ వైఖరిపై కలవరపడుతున్న ప్రపంచ దేశాలతో ముఖ్యంగా ఇరుగు పొరుగు దేశాలతో కలిసి చర్చించే వాతావరణాన్ని ఏర్పర్చుకునేందుకు భారత్ ఎందుకు చొరవ తీసుకోకూడదు? యూరోపియన్ యూనియన్ దేశాల కంటే ఎంతో పెద్దదైన భారత దేశం ఈ ప్రపంచంలో ఎవరికీ భయపడదని, తన విదేశాంగ వ్యవహారాలు, ఆంతరంగిక భద్రత తానే నిర్ణయించుకోగలదని చెప్పే పరిస్థితులు రావాలి. అలీన విధానం, వ్యూహాత్మక స్వతంత్రత ఆధారంగా అంతర్జాతీయ వేదికలపై మనం తలెత్తుకోగలగాలి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> **యూరోపియన్ యూనియన్ దేశాలకంటే ఎంతో పెద్దదైన భారత్ ఈ ప్రపంచంలో ఎవరికీ భయపడదని, తన విదేశాంగ వ్యవహారాలు, ఆంతరంగిక భద్రత తానే నిర్ణయించుకోగలదని చెప్పే పరిస్థితులు రావాలి. అలీన విధానం, వ్యూహాత్మక స్వతంత్రత ఆధారంగా అంతర్జాతీయ వేదికలపై మనం తలెత్తుకోగలగాలి.**




అడవి.. ఆదివాసులు.. ఆక్సిజన్!

మధ్యప్రదేశ్ రాష్ట్ర తూర్పు ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా చేసిన పోరాట ఫలితంగా, 2000 సంవత్సరంలో నాటి కేంద్ర ప్రభుత్వం ‘ఛత్తీస్‌గఢ్’ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్ర దక్షిణ ప్రాంతంలో ఉన్న బస్తర్ జిల్లా ఒకప్పుడు దేశంలోనే అతిపెద్ద జిల్లా. నాటి ఈ ఉమ్మడి బస్తర్ దాదాపు 46,000 చ.కి.మీ వైశాల్యం కలిగివుండగా, మొత్తం దండకారణ్యం 92,300 చ.కి.మీ వైశాల్యం కలిగివుంది. అపారమైన అడవి, విశాలమైన కొండలు, పర్వతాలు, లోయలతో పాటు, ఇంద్రావతి, వెన్‌గంగ, శబరి, ప్రాణహిత, గోదావరి, మహానది వంటి జీవనదులు పారుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధికి కనీసం కృషి చేయలేదు.

ఈ ఆదివాసీ తెగల జీవన ప్రమాణాలయిన విద్య, వైద్యం, జీవన భృతి అభివృద్ధి పట్ల గత 75 ఏళ్లుగా భారత ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపలేదు. ఆదివాసులు జీవిస్తున్న అడవి మీద, లక్షల కోట్ల రూపాయల విలువైన పదకొండు రకాల ఖనిజ నిక్షేపాల వెలికితీతపై బహుళజాతి సంస్థలు, దేశీయ బడా పెట్టుబడిదారులు కన్నేశారు. కార్పొరేట్ సంస్థలు నాలుగు దశాబ్దాల క్రితమే ‘బైలదిల్లా’లో పాగా వేశాయి. గత 30 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం తయారు చేస్తున్న ‘ఖనిజ వెలికితీత పాలసీ’ల వల్ల– లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు రాజ్యాంగం, చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులకతీతంగా ఆదివాసుల జీవితాలను బడా పెట్టుబడిదారులు ఛిద్రం చేస్తున్నారు.

నాడు దేశంలో వలస పాలకులకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసిన స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఉత్తర, దక్షిణ, మధ్య భారతదేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో బిర్సాముండా (జార్ఖండ్), రాంజీ గోండు, కొమురం భీం (తెలంగాణ), అల్లూరి సీతారామరాజు (ఆంధ్రా)ల నాయకత్వంలో ఆదివాసీ ప్రజలు ‘అడవిపై హక్కు మాదే’నంటూ ఉద్యమించారు. ఆ క్రమంలోనే దండకారణ్యంలో కూడా బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా వచ్చిన ‘భూమ్ కాల్’ ఉద్యమానికి ‘గుండాదూర్’ అనే ఆదివాసీ నాయకుడు నాయకత్వం వహించారు. పైన చెప్పిన తెగల ప్రజలను ఐక్యం చేసి ‘అడవిపై హక్కు ఆదివాసులదే’నంటూ పోరాడిన వీరుడు గుండాదూర్. తన జీవితకాలమంతా ‘జల్–జంగిల్–జమీన్’ ఆదివాసులదేనని ప్రజలను ఐక్యంచేసి పోరాడిన ఆయన ఆదివాసీ ప్రజల ఆరాధ్యవీరుడయ్యాడు.

ఆ పోరాట చరిత్ర మళ్లీ 1980లో పునరావృతమైంది. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని ఆదివాసీలను సంఘటితం చేసి మూడు దశాబ్దాల పాటు గొప్ప పోరాటం కొనసాగించిన విప్లవోద్యమ నాయకులు ఆదివాసీ ప్రజల జీవితాల్లో భాగమయ్యారు, వారి జీవన ప్రమాణాలు పెంచారు. ప్రజల పట్ల నిబద్ధతతో వారు చేసిన విస్తృత నిర్మాణ కృషి వల్ల, ఆదివాసీ సమాజంలో అది ‘భౌతిక శక్తి’గా మారింది. ఇదే ప్రభుత్వాల వెన్నులో చలి పుట్టించింది. ఈ క్రమంలోనే ఆ ఉద్యమ అణచివేతను ఆరంభించారు. 1997లో సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ‘సమతా రవి వర్సెస్ ఆంధ్రప్రదేశ్’ కేసులో– “అయిదవ షెడ్యూల్ రాజ్యాంగ మౌలిక స్వరూపం. దీనిని మార్చేందుకు పార్లమెంట్‌కు కూడా అధికారం లేదు. ఆదివాసుల సమగ్ర జీవన విధానం అడవితో, అక్కడ లభించే వనరులతో ముడిపడి ఉన్న వారి ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవనాన్ని ప్రభుత్వాలు రక్షించాలి” అని సమగ్ర తీర్పునిచ్చింది. ఆ తీర్పునకు ప్రజల పోరాటాలు కూడా తోడై, బీడీ శర్మ, ఎస్.ఆర్ శంకరన్ వంటి నిబద్ధత కలిగిన ఉన్నతాధికారుల కృషి వల్ల నాటి కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంత గ్రామీణ పంచాయతీ విస్తరణ చట్టం, 1998 (PESA), ఆదివాసుల అటవీ హక్కుల రక్షణ చట్టం–2006 తెచ్చినా, అవి నిజమైన స్ఫూర్తితో అమలుకావడం లేదు. ఫలితంగా ఆదివాసుల అభివృద్ధి ‘ఎక్కడ వేసిన గొంగళి అక్కడే’ అన్న చందంగా ఉంది. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఇవ్వని ఈ ప్రభుత్వాలతో పాటు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ITDA) కూడా నామమాత్రంగా మిగిలింది.



ఈ పరిస్థితుల్లో అడవి మీద, అడవిలోని అపార ఖనిజ సంపద మీద కన్నేసిన కార్పొరేట్ సంస్థలు దండకారణ్యంలోని ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి ఆదివాసుల న్యాయమైన పోరాటంపై చట్టవ్యతిరేకంగా, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి. సైనిక బలగాలు దండకారణ్యంలో ఆదివాసులను చెట్లకు కట్టి కాల్చి చంపుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో 2004 నుంచి జనజాగరణ్ అభియాన్, సల్వాజుడుం, ఇతర ఆపరేషన్ల పేరు మీద ఆదివాసులను పెద్దసంఖ్యలో చంపి, ఇండ్లు తగలబెట్టి, పంట పొలాలను నాశనం చేసి, వేల సంఖ్యలో వారిని అడవి నుంచి తరిమి కొట్టారు. గత రెండు సంవత్సరాలుగా ‘కగార్’ పేరుతో విచ్చలవిడిగా నరమేధం కొనసాగిస్తూ అడవిలో ఆదివాసులు లేకుండా చేస్తున్నారు. అడవిని అంబానీకి, అదానీకి అప్పజెప్పేందుకే ఈ మారణకాండ కొనసాగిస్తున్నారు. అడవిలో పుట్టి, పెరిగి, శతాబ్దాల తరబడి అడవిని రక్షిస్తూ, సమాజానికి ప్రాణవాయువు అందిస్తున్న అడవి ఆదివాసులదా? లేక అంబానీ–అదానీలదా? వారి వారసులైన జిందాల్, మిట్టల్, బహుళజాతి సంస్థలదా? ఈ విషయం గురించి దేశ ప్రజలు ఆలోచించాలి.

‘కగార్’ యుద్ధం బారి నుంచి అడవిని, దానిని రక్షిస్తున్న ఆదివాసులను పౌర సమాజం కాపాడుకోలేకపోతే సమాజ భవిష్యత్తు అంధకారమే. ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాల అడవిని నాశనం చేయడం వల్ల, నేడు ఢిల్లీ ప్రజలు మాత్రమే ప్రాణవాయువు అందక ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఆదివాసుల మీద కొనసాగిస్తున్న నరమేధం వల్ల, రేపు అడవి బడా పెట్టుబడిదారుల చేతుల్లో ధ్వంసమై, ఢిల్లీ ప్రజలవలె దేశ ప్రజలకు కూడా ప్రాణవాయువు అందదు. ఇది నేటి కఠోర వాస్తవం.

• చిక్కుడు ప్రభాకర్
కన్వీనర్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక

ప్రపంచ దేశాలు ఖండించాల్సిన దుశ్చర్య

వెనెజువెలా దేశంపై దాడి చేసి, అధ్యక్షుడిని బందీ చెయ్యడం ద్వారా అమెరికా అంతర్జాతీయ న్యాయసూత్రాల్ని, మర్యాదల్ని, హక్కుల్ని అధిగమించింది. ఈ దురాక్రమణకు అధ్యక్షుడు ట్రంప్ అక్కడి కాంగ్రెస్ అనుమతి తీసుకోలేదు. ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీ కౌన్సిల్‌లో చర్చించలేదు. వెనెజువెలా అధ్యక్షుడిపై ఆరోపణలకు రుజువులు లేవు. ఆ సార్వభౌమ దేశం వల్ల అమెరికాకు జరిగే తక్షణ అపకారం, బెదిరింపులు కూడా ఏమీ లేవు, కుంటిసాకులు తప్ప. ఇది ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాల్సిన దుశ్చర్య.

ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలున్న దేశం వెనెజువెలా. రెండున్నర దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు ఆ నిల్వలపై అమెరికా కంపెనీలను పెత్తనం చేయనీయడం లేదు. డాలర్‌పై ఆధారపడడం లేదు. అక్కడి ప్రభుత్వం మారి, తమ మాట వినే పాలకులు వస్తే తప్ప, అమెరికా ప్రయోజనాలు నెరవేరవు. కాబట్టి వెనెజువెలా అధ్యక్షుడు మాదకద్రవ్యాల సరఫరా ప్రోత్సహిస్తున్నాడని, ట్రంప్ ఆరోపిస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఆ దేశంపై సైనిక దాడి చేసి, అధ్యక్షుడు మదురోను బందీ చేసి అమెరికా జైలుకి, కోర్టుకి తరలించారు. ఇలాగే గతంలో పనామా పట్ల అమెరికా వ్యవహరించింది. రానున్న రోజుల్లో కొలంబియా, క్యూబాల్ని కూడా ఇదే బాట పట్టిస్తామని ట్రంప్ హుంకరిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాల్ని ప్రమాదంలోకి నెట్టే అరాచక ధోరణి. స్పష్టమైన ఖండనలతో అంతర్జాతీయ సమాజం ప్రతిస్పందించకపోతే తీరని నష్టం తప్పదు. ఏ దేశానికి ఆ దేశం తన స్వలాభాపేక్షతో పక్కనున్న బలహీన దేశాల్ని, వనరుల్ని కబళిస్తే అశాంతి, అభద్రత రాజ్యమేలుతాయి. ట్రంప్ చేష్టల్ని నియంత్రించకపోతే అమెరికాతో సహా అన్ని దేశాలకీ నష్టమే.

– డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ

తురుష్కుల దండయాత్ర 2.0


బంగ్లాదేశ్ నేడొక హింసాగ్నిగుండం. ఈ అగ్నికి ఆజ్యం పోస్తున్నది... పాకిస్థాన్, చైనా, టర్కీ. 1971 నాటి విభజనకు భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలన్నది పాక్ లక్ష్యం. చైనా దానికి తోడయింది. జత కలసిన టర్కీ– అటు పాక్, ఇటు బంగ్లా... రెండు వైపుల నుంచీ భారత్‌పై విషం కక్కుతోంది. టర్కీ నాయకులు, అధికారులు, సైనిక ప్రతినిధులు ఇటీవల పాక్‌తో పాటు బంగ్లాలో తరచుగా పర్యటించడం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు సమకూర్చడం ద్వారా ఇండియాను ఇబ్బందులపాలు చేస్తున్నారు. ‘చికెన్ నెక్’ను తెగ్గోయడం ద్వారా భారత ఈశాన్య రాష్ట్రాలను కలిపేసుకుని ‘మహా బంగ్లాదేశ్’ ఏర్పాటు చేయాలన్నది కొంతమంది బంగ్లాదేశీ నాయకుల కల. అది నెరవేర్చే బాధ్యత తనదే అన్నట్లు టర్కీ దూకుడు ప్రదర్శిస్తున్నది.

కశ్మీర్ వేర్పాటువాదానికి మద్దతునిస్తున్న టర్కీ... ఇటీవలి ఎర్రకోట పేలుడుకు మార్గదర్శకత్వం వహించినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితులైన డాక్టర్ ఉమర్ మొహమ్మద్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనీ, డాక్టర్ ముజఫర్ రాథర్‌లకు టర్కీ రాజధాని అంకారాలోని సూత్రధారుల నుంచే ఆదేశాలు, నిర్దేశాలు అందినట్లు స్పష్టమైంది. 68 అనుమానాస్పద మొబైల్ నంబర్ల మూలాలు పాకిస్థాన్, టర్కీలలో బయటపడ్డాయి. ఈ ముగ్గురు ఉగ్ర డాక్టర్లు టర్కీలో 20 రోజుల దాకా మకాం వేసి, సిరియా టెర్రరిస్టు నాయకుల వద్ద శిక్షణ పొందారన్నది సమాచారం.

కశ్మీర్‌లో టెర్రరిస్టులను బలోపేతం చేసి, ఆ ప్రాంతాన్ని భారత్ నుంచి విడగొట్టడమే ప్రధాన లక్ష్యంగా టర్కీ ముందుకెళుతోందని సిరియన్ నేషనల్ ఆర్మీలో భాగమైన ఉగ్రవాద సంస్థ ‘సులేమాన్ షా బ్రిగేడ్’ చీఫ్ అబూ ఎంసా తెలిపినట్లు కుర్దిష్ వార్తా సంస్థ ఏఎన్ఎఫ్ ఆ మధ్య వెల్లడించింది. టర్కీ మద్దతు కలిగిన ‘హమాస్’ ఉగ్రవాద సంస్థ సభ్యులు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో టెర్రరిస్టు కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం ఇటీవలి ముచ్చటే. ఇక టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ అయితే ఐక్యరాజ్యసమితి మొదలుకొని ప్రతి అంతర్జాతీయ వేదికపైనా కశ్మీర్ సమస్యను లేవదీస్తూ, పాక్‌కు వంత పాడుతున్నారు.

ఒట్టోమన్ సామ్రాజ్యం పతనం అనంతరం సైనిక కమాండర్ ముస్తఫా కెమాల్ అతాతుర్క్ నాయకత్వంలో 1923 అక్టోబరులో ఏర్పాటైన టర్కీ రిపబ్లిక్– లౌకిక, ఉదారవాద, ప్రజాస్వామ్య విధానాలు, విలువలతో కూడుకొన్న దేశంగా ప్రస్థానం ప్రారంభించింది. ఇస్లామిక్ పిడికిలి నుంచి బయటపడి, ఆధునిక దేశంగా ముందడుగు వేసింది. అతాతుర్క్ 1925లో ‘హ్యాట్ రెవల్యూషన్’లో భాగంగా బుర్ఖా, హిజాబ్ వంటి మతపరమైన వస్త్రధారణను నిషేధించారు. ఇస్లామిక్ చట్టం స్థానే స్విస్ తరహా పౌరస్మృతి ప్రవేశపెట్టారు. కానీ, అతాతుర్క్ కృషి, తరువాతి కాలంలో మరుగుజ్జు నాయకుల పుణ్యమా అని బూడిదలో పోసిన పన్నీరే అయింది. ఇక, 2003లో ఎర్డోగాన్ టర్కీ ప్రధానమంత్రి అయ్యాక– తిరోగమనం వేగం పుంజుకొంది. సెక్యులర్, లిబరల్ పునాదులనే పెకిలించి, టర్కీలో మరో మతఛాందస ఒట్టోమన్ సామ్రాజ్యానికి శంకుస్థాపన జరిగింది. ఎర్డోగాన్ వచ్చీ రావడంతోనే ఇస్లామిక్ విద్య ప్రవేశపెట్టారు. కొత్తగా వేలాది మసీదులు నిర్మించారు. 2014లో దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యాక దేశాన్ని పూర్తిగా ఇస్లామీకరించడమే కాకుండా– పలు దేశాల్లో భారీ మసీదులు నిర్మించడం ద్వారా తన భావజాల విస్తరణ కాంక్షను చాటిచెప్పారు.

> **టర్కీ, పాకిస్థాన్‌లది గాఢమైన మ‘మతా’నుబంధం. ఉభయ దేశాలదీ ఛాందసవాద ఇస్లామిక్ పంథానే. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్‌కు మానవరహిత వైమానిక వ్యవస్థలు, కమికాజ్ డ్రోన్లను టర్కీ సమకూర్చింది. పాక్ సైనిక గూఢచార సంస్థతో పాటు బంగ్లాదేశ్‌లోని మతోన్మాద జమాతే ఇస్లామీతోనూ చేతులు కలిపి, భారత్‌కు సెగపెట్టే కుట్రలకు టర్కీ తెరదీస్తోంది.**



13వ శతాబ్దం మొదలుకొని 20వ శతాబ్దంలో మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమయ్యే దాకా ముస్లిం (ఉమ్మా) ప్రపంచానికి టర్కీ నాయకత్వం వహించింది. ఎర్డోగాన్ ఇప్పుడు ఆ దిశలోనే సాగిపోతున్నారు. ఈ కాలపు ఖలీఫాగా అవతరించి, తన తరహా ఇస్లామిక్ పిడివాద ఒట్టోమన్ సామ్రాజ్యం స్థాపించాలని ఆయన 1994లో ఇస్తాంబుల్ మేయర్ పదవికి పోటీ చేసినప్పుడే కంకణం కట్టుకున్నారు. 2016 నాటి తిరుగుబాటు కుట్రను దారుణంగా అణచివేసిన అనంతరం టర్కీలో సైన్యం, న్యాయ, విద్యా రంగాలు సహా సకల సంస్థలు, వ్యవస్థల్నీ ఇస్లామిక్ మతఛాందసులతో నింపివేసిన ఎర్డోగన్– తన లక్ష్య సాధనకు వీలుగా, భావజాల విస్తృతికి సైనిక, ఆర్థిక, దౌత్య మార్గాలను ఎంచుకొన్నారు. పశ్చిమ, మధ్య ఆసియాలతో పాటు బాల్కన్ (ఆగ్నేయ ఐరోపాలోని అల్బేనియా, బల్గేరియా, గ్రీస్, రొమానియా, సెర్బియా, స్లొవేనియా తదితర) దేశాలపై తొలుత దృష్టి కేంద్రీకరించారు. పూర్తిస్థాయి భావసారూప్యం కలిగిన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లనూ కలుపుకొని ఇప్పుడు భారత్ కుడి ఎడమల పక్కలో బల్లాలు దించే దుర్మార్గానికి తెగబడ్డారు.

టర్కీ, పాకిస్థాన్‌లది గాఢమైన మ‘మతా’నుబంధం. ఉభయ దేశాలదీ ఛాందసవాద ఇస్లామిక్ పంథానే. ఈ సోదర ప్రేమను మరింత బలోపేతం చేసుకొనే క్రమంలోనే ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్‌కు మానవరహిత వైమానిక వ్యవస్థలు, కమికాజ్ డ్రోన్లను టర్కీ సమకూర్చింది. టర్కీ వైమానిక పరిశ్రమ (టీఏఐ)లో పెద్ద సంఖ్యలో పాకిస్థానీ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. భారత్ ప్రధాన లక్ష్యంగా అయిదోతరం (కాన్) యుద్ధ విమానాలు సహా పలు ఆయుధ వ్యవస్థల్ని ఉభయ దేశాలు ఉమ్మడిగా తయారుచేస్తున్నాయి. అమెరికా నుంచి భారత ఆర్మీకి ఆఖరు విడతగా ఆరు అపాచీ హెలికాప్టర్లు చేరకుండా ఇటీవల టర్కీ అడ్డుకొంది. ఈ హెలికాప్టర్ల రవాణా విమానం యూకే నుంచి భారత్‌కు వచ్చేందుకు వీలుగా తన గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి నిరాకరించి టర్కీ తన కుళ్లుబుద్ధిని నిర్లజ్జగా చాటుకొంది. అణు సరఫరాదారుల బృందం (ఎన్ఎస్‌జీ)లో భారత్‌ను కాకుండా పాకిస్థాన్‌ను చేర్చుకోవాలని పట్టుపట్టింది. వేల మంది పాకిస్థానీ సైనికాధికారులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఎఫ్–16 యుద్ధ విమానాల ఆధునీకీకరణ విషయంలోనూ పాక్‌కు సహాయపడుతోంది. పాక్‌తో పాటు ఇటు బంగ్లాదేశ్‌నూ భారత్ పైకి టర్కీ ఉసిగొల్పుతోంది. పాక్ సైనిక గూఢచార సంస్థ (ఐఎస్ఐ)తో పాటు బంగ్లాదేశ్‌లోని మతోన్మాద జమాతే ఇస్లామీతోనూ చేతులు కలిపి భారత్‌కు సెగపెట్టే కుట్రలకు తెరదీస్తోంది. బైరక్తర్ టీబీ–2 డ్రోన్లు, టీఆర్‌జీ–300 రాకెట్ వ్యవస్థలు, మందుగుండు సామగ్రి, ఆధునిక రైఫిళ్లు, మిషిన్‌గన్‌లు, మందుపాతరలకు చెక్కు చెదరని ఒటోకార్ కోబ్రా–II వాహనాలతో పాటు కీలక సైనిక సాంకేతిక పరిజ్ఞానాలు, వ్యవస్థలతో బంగ్లాదేశ్ కోరలకు మరింత పదునుపెడుతోంది.

తాజా భౌగోళిక, రాజకీయ పరిస్థితుల్లో టర్కీ కుట్రలపై భారత్ ఆచితూచి స్పందించాల్సి ఉంటుంది. పదునైన దౌత్య వ్యూహమే కీలకం. ముఖ్యంగా టర్కీ శత్రుదేశాలతో రక్షణ, ఆర్థిక, సహాయ సహకారాలపై తక్షణం దృష్టి సారించాలి. విశ్వ వేదికలపై టర్కీ తీరును ఎండగట్టాలి. ఇస్లామిక్ మహాసామ్రాజ్య చక్రవర్తిత్వమే లక్ష్యంగా ఎర్డోగాన్ ఇప్పుడు దూకుడు ప్రదర్శిస్తున్నప్పటికీ– రాజకీయ, ఆర్థిక అవసరాలు ఎప్పటికైనా వెనక్కిలాగేవే. ఈ వాస్తవం తెలిసివచ్చేలా చేయగలిగితే– తురుష్కుల తాజా దండయాత్రను తిప్పికొట్టినట్లే!

■ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 7 జనవరి 2026





గుంటూరు జిల్లాలో..

నేటి నుంచి రెండో విడత భూసమీకరణ

గ్రామం	పట్టా	అసైన్డ్	ప్రభుత్వ	(ఎకరాల్లో)
పెదపరిమి	5,886.18	0	627.34	6,513
హరిశ్చంద్రాపురం	1,448.09	2.29	977.87	2,428
వడ్డమాను	1,763.29	4.72	168.86	1,937

- వడ్డమాను గ్రామంలో సమీకరణకు శ్రీకారం
- ఏడు గ్రామాలు.. 20,494 ఎకరాల సమీకరణ
- గ్రామాల వారీగా భూసమీకరణ నోటిఫికేషన్
- అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు

6

వినోదాల మేళా సారస్



8

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

● ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ● పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం ● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● ప్రారంభమైన సారస్ ప్రదర్శనలు ● ఈ నెల 18 వరకు నిర్వహణ ● రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

ఫిబ్రవరిలో.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో 17వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు గుంటూరు జాయింట్ కలెక్టర్ (జేసీ) అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగే ర్యాలీ ఏర్పాట్ల మీద మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పురుష అభ్యర్థులకు నిర్దేశించిన ర్యాలీ అని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ మాట్లాడుతూ అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లరికల్, స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ తదితర విభాగాలలో 10వ తరగతి, 8వ తరగతి విభాగాలలో అగ్నివీర్ రిక్రూట్మెంట్ జరుగుతుందన్నారు. మహిళల కు తమిళనాడు రాష్ట్రం వేలూరులో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రత్యేకంగా ర్యాలీ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వివిధ దశల లో జరుగుతుందని చెప్పారు. మొదటగా 1.60 కిలో మీటర్ల పరుగు, ఆ తర్వాత శారీరక పరీక్షలలో భాగంగా పుల్ అప్స్, జిగ్ జాగ్, 9 అడుగుల గుంతను దాటడం తదితర అంశాలలో పరీక్షించి అందులో ఎంపికైన వారికి ఎత్తు, బరువు తదితర శారీరక కొలతల పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. తర్వాత రోజున డ్రగ్, మెడికల్ పరీక్షలు నిర్వహించడం జరుగు తుందని వివరించారు. అభ్యర్థుల శరీరంపై ఎక్కడా ఐదు సెంటిమీటర్లు మించి టాటూలు ఉండరాదని, అయితే గిరిజన తెగలకు మాత్రం వారి ఆచారాల మేరకు వెసులుబాటు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం మౌలిక సదుపాయాలు కల్పనలో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ హనుమంతు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీహరి, డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ గుణశీల, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా తదితరులు

విద్యాజ్యోతితో.. ఉత్తమ ఫలితాలు

జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యాజ్యోతి పుస్తకాన్ని వినియోగించుకుని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్‌లోని సమావేశం మందిరంలో మంగళవారం విద్యాజ్యోతి పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యాజ్యోతి పుస్తకం విడుదల చేయటం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం ఎంతో ఆనందించదగ్గ విషయం అన్నారు. సీఈఓ వీర్ల జ్యోతిబసు మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడమే కాక ఉత్తమ క్రమశిక్షణ కలిగిన పిల్లలను కూడా తీర్చిదిద్దవచ్చన్నారు. డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ మాట్లాడుతూ ఎంతో శ్రమించి ఈ పుస్తకాన్ని తయారు చేయడం జరిగిందని వెల్లడించారు.

బియ్యానికి డబ్బులిస్తున్నారు

ఐవీఆర్ఎస్‌లో రేషన్ అక్రమాలు బహిర్గతం



- కార్డుదారుల నుంచి సమాచారం సేకరించిన అధికారులు
- తీసుకోని రేషన్‌లో 90 శాతం నమోదుపై అనుమానాలు
- సర్వే వివరాల ఆధారంగా అధికారుల రహస్య విచారణ

రేషన్‌లో బియ్యానికి బదులు డబ్బులు ఇస్తున్నారు.. మేము ఈ నెలలో బియ్యం తీసుకోలేదు.. అని కార్డుదారులు చెప్పారు. రేషన్ బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన సమాచారం ద్వారా ఈ విషయం తేలింది. అయితే 90 శాతానికి పైగా బియ్యం తీసుకున్నట్లు ఈ-పోస్ యంత్రాల్లో నమోదు అవుతుండటంతో కూటమి ప్రభుత్వంలోనూ రేషన్ అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు అర్థమవుతోంది. వైసీపీ హయాంలో రేషన్ బియ్యం దందా దాదాపుగా వ్యవస్థీకృతం కాగా ఇప్పటికీ అదే కొనసాగుతున్నట్లు ప్రభుత్వ సర్వేలో తేలింది. ఈ పరిస్థితుల్లో రేషన్ అక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఐవీఆర్ఎస్ సమాచారాన్ని జిల్లా అధికారులకు పంపి రేషన్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

గతంలో నియోజకవర్గాల వారీగా ఎక్కడికక్కడ వైసీపీ నేతలు రేషన్ దందా నడిపించి పేదల బియ్యంతో అక్రమార్జనకు రాచబాట వేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్ల నుంచే రేషన్ అక్రమాలపై దృష్టి పెట్టింది. దీంతో గత ప్రభుత్వంలో అడ్డగోలు దందా నడిపిన వారు జెండా మార్చి పబ్బం గడుపుకుంటున్నారు. అక్రమార్కులకు కొంత మంది పాలకపార్టీ నేతల సహకారంతో పాటు మామూళ్ల మత్తులో అధికారులతో రేషన్ దందా కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారులకు రేషన్ అందుతున్న విధానంపై ఐవీఆర్ఎస్ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం **(మిగతా 8వ పేజీలో)**

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పరివర్తన భవన్‌లో సౌకర్యాలపై అసహనం
- హాస్టల్ తనిఖీలో మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయస్వామి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి


గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత అంశాల్లో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి హెచ్చరించారు. మంగళవారం గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని సామాజిక పరివర్తన బాలికల కళాశాల వసతి గృహంలో మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం పై అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారు లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బంది, అధికారులపై విద్యార్థినులు పలు ఆరోపణలు చేసినట్లు సమాచారం. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని మంత్రి విద్యార్థినులకు సూచించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఉన్నారు.

హెల్మెట్ లేకుంటే.. హెచ్చరిక -1

వాహనదారుల వాట్సాప్‌కు సందేశం

- కూడళ్లలో సీసీ కెమేరాల ద్వారా గుర్తింపు
- ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచన

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలి.. అని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే అనేకమంది హెల్మెట్‌ధారణను పట్టించుకోవడంలేదు. ఈ క్రమంలో కొరడా ఝుళిపించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గుంటూరులోని వేర్వేరు కూడళ్లలో అమర్చిన సీసీ కెమేరాల ద్వారా ఎవరైతే హెల్మెట్ ధరించకుండా వాహనాన్ని డ్రైవింగ్ చేస్తున్నారో వారి ఫోన్ వాట్సాప్‌కు సందేశాలు పంపిస్తున్నది. రహదారి భద్రత హెచ్చరిక సంఖ్య.1 అని పేర్కొంటూ ప్రియమైన శ్రీ/శ్రీమతి.. గారికి మీ వాహనం నంబరు. -- ఫలాన జంక్షన్ వద్ద తేదీ, సమయంలో ట్రాఫిక్ ఉల్లంఘనలో గుర్తించబడింది.. ఉల్లంఘన: నో హెల్మెట్. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి జారీ చేయ బడిన రహదారి భద్రత సూచన. ఇలాంటి ప్రవర్తన ఇతర రహదారి ప్రయాణికులు ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుంది. మోటార్ వెహికల్స్ చట్టం ప్రకారం ఇది నిబంధనలకు విరుద్ధం. భవిష్యత్తులో ఇలాంటి చర్యలను నివారించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిందిగా సూచించబడుతుంది. దీనిని చివరి హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి ఉల్లంఘనలు కొనసాగితే చట్ట ప్రకారం జరిమానా /చలాన్ విధించబడుతుంది. ఇట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్న సందేశం వాట్సాప్‌లకు వస్తోంది.దీంతో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు కొనుగోలు చేస్తున్నారు.



వేడుకగా గంధ మహోత్సవం

మస్తానయ్య దర్గా ఉరుసు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని శ్రీహజరత్ కాలేమస్తాన్‌షా అవులియా (మస్తానయ్య దర్గా) 134వ ఉరుసు మహోత్సవాలు మంగళ వారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారి సమాధిపై గంధ మహోత్సవం కార్యక్రమం వేడుకగా జరిగింది. బాబా వారి గంధాన్ని కన్నావారితోట దర్గా, సంగ డిగుంట ఫ్యాక్టరీ వద్ద ఉన్న దర్గా మీదగా ఊరేగింపు నిర్వహిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు గంధ మహోత్సవంలో పాల్గొ న్నారు. అనంతరం మేళతాళాలతో విద్యుత్ దీపకాంతుల నడు మ నగరంలో ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులను చెల్లించారు. ప్రజాప్రతినిధులు చద్దరును సమర్పించారు. ఉరుసు సందర్భంగా అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గంధం పంపిణీ, దీపారాధన నిర్వహిస్తున్నట్లు దర్గా వంశ పారం పర్య ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.



పూజలు చేస్తున్న రావి రామ్మోహనరావు



గొంతెండుతోంది..!

● కోటప్పకొండలో నీరు లేక వన్యప్రాణుల విలవిల

యార్డును అగ్రపథంలో నిలపాలి

● యార్డు చైర్మన్‌కు మంత్రి నారా లోకేశ్ సూచన

తీపిగా లాభాలు

● చెరుకు పంటపై ఆసక్తి చూపుతున్న రైతులు 8

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

● నేటి ప్రారంభ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరు

పేకాట క్లబ్‌పై పోలీసుల దాడులు

● సత్తెనపల్లిలో 46 మంది జూదరుల అరెస్టు 6

మిర్చి.. మిలమిల

- తేజ మినహా అన్ని రకాల ధరలు పెరుగుదల
- కొత్త పంట తక్కువగా వస్తున్నందునే అంటున్న ట్రేడర్లు
- దేవనూరు డీలక్స్ క్వింటాల్ రూ.20,500కు కొనుగోలు



గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నుంచి మిర్చి కొత్త పంట తక్కువగా వస్తుండటం.. కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న మిర్చి నిల్వలను అమ్మాలంటే కొత్త కాయలను వాటితో మిక్సింగ్ చేయాల్సి ఉండటం.. తదితర కారణాలతో ప్రస్తుతం వివిధ రకాల మిర్చి ధరలు గుంటూరు మిర్చియార్డులో పెరిగాయి. గత రెండేళ్లలో లేని విధంగా ఒకటి, రెండు రకాలు క్వింటాల్ ధర రూ.20 వేలను దాటాయి. విదేశాలకు ఎగుమతి అయ్యే ఒక్క తేజ రకం మినహా అన్ని రకాల మిర్చి ధరలు ఈ వారం ప్రారంభం నుంచి పెరిగాయి. ఎగుమతి లేకపోయినా కారం తయారీ కోసం చాలామంది ట్రేడర్లు మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోజుకు 50 వేలకు పైగా మిర్చి టిక్కీల కొనుగోళ్లు జరుగు తున్నాయి. ఏటా ఈ పాటికే కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి మిర్చి రోజుకు 25 వేల టిక్కీల(ఒక్కో టిక్కీ 40 కేజీలు) వరకు గుంటూరు మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చేవారు. అయితే ప్రస్తు తం 15 వేల టిక్కీలకు మించి రావడం లేదు. ఖరీఫ్ ఆఖరులో తుఫాన్ కారణంగా పంట దెబ్బతినడంతో దిగుబడి తక్కువగా వస్తున్నది. గుంటూరు, ప్రత్తిపాడు ఏఎంసీల పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న పాత సరుకు(30 లక్షల టిక్కీలు) విక్రయం జరగాలంటే కొత్త మిర్చితో కలిపేందుకు ప్రస్తుతం మిక్సింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కారణంగా రెండు రోజుల నుంచి యార్డులో కొనుగోళ్లు పెరిగాయి. నంబరు.334, నంబరు.5, 341, సూపర్ 10, బ్యాడిగి, సింజెం టా బ్యాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిరపకాయల ధరలు దాదాపుగా రూ. 2 వేలకు పైగా పెరిగాయి. కొన్ని రకాలైతే క్వింటాల్‌కు రూ.3 వేల వరకు కూడా పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. ముఖ్యంగా దేవనూరు డీలక్స్ వెరైటీ మిర్చి క్వింటాల్ ధర గరిష్ఠంగా రూ.20,500కు చేరింది. ఈ నెలాఖరు వరకు కొత్త పంట కొద్దికొద్దిగానే వచ్చే అవకాశం ఉన్నందున ధరలు తగ్గవని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష

మిర్చి సీజన్‌పై బుధవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, ఎక్స్‌పోర్టర్లు, మార్కెటింగ్ అధికారులతో పాటు వేమెన్, రైతు సంఘాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. రైతుకు ఇబ్బంది లేకుండా ధర, సౌకర్యాలపై ఏమేమి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించనున్నారు.

మంగళగిరికి.. యూజీడీ

డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.1673 కోట్లు మంజూరు చేస్తూ జీవో
- నెరవేరనున్న మంత్రి నారా లోకేశ్ హామీ

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న మురుగు నీటి సమస్యకు మంత్రి నారా లోకేశ్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించనుంది. పట్టణంలో ప్రధాన డ్రెయిన్లతో పాటు శివార్లలో అవుట్ ఫాల్ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో జేఎన్ఎన్ఎంయూఆర్ఎం పథకం కింద సుమారు రూ.32 కోట్లతో సమగ్ర మురుగు పారుదల వ్యవస్థను అస్తవ్యస్తంగా నిర్మించడంతో ప్రజల వెతలు తీరకపోగా మరింత పెరిగాయి. జేఎన్ఎన్‌యూఆర్ఎం నిధులైతే కరిగిపోయాయే కానీ మురుగు సమస్యకు మాత్రం మోక్షం లభించలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు మంగళగిరిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.1673.51 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది.



పర్యావరణ పరిరక్షణతో..

నివాస గృహాల నుంచి వ్యర్థాలను మురుగు నీటిలోకి పంపి దుర్గంధం వ్యాపించకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, నదీ పరీవాహక చట్టాల అమలు కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. రెండు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో 20 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు(ఎస్‌టీపీ), 18 పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. పైపులైన్ల ద్వారా మురుగు నీటిని సమీపంలోని కాల్వలు, చెరువుల్లోకి మళ్లిస్తారు. వీలైనంత త్వరలోనే భూగర్భ డ్రెయినేజీ పనులను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎంతో కాలంగా వేధిస్తున్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంత్రి లోకేశ్ తీసుకుంటున్న చొరవపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలి

● గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య



ముగ్గురు రాజుల గురించి వివరిస్తున్న గుంటూరు ఆర్‌సీఎం పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య

పెదకూరపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన శాంతి, సమాధానం, ప్రేమ, ఐక్యత మార్గాన్ని అనుసరించాలని గుంటూరు ఆర్‌సీఎం పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని పాటిబండ్లలో మంగళవారం ముగ్గురు రాజుల మహోత్సవం, ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో నిర్వహించిన సమష్టి దివ్య పూజాబలిలో పీఠాధిపతి భాగ్యయ్య మాట్లాడుతూ, అందరూ దైవ చింతనతో మెలగాలని అన్నారు. అనంతరం పూర్ణకుంభంతో భక్తులకు ఆశీస్సులు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మత గురువులు, కన్యా స్త్రీలు దివ్య పూజాబలిలో పాల్గొన్నారు. సాయంత్రం చర్చిలో భక్తులు క్యాండిల్స్ వెలిగించి సమర్పించారు. తేరు ఊరేగింపునకు ముందు బాణసంచా కాల్పులతో, బ్యాండ్ వాయిద్యాలతో పుర వీధుల్లో తేరును ఊరేగించారు. కాగా పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య తదితరులు ఉన్నారు.

ఫైరింగ్‌లో పట్టు సాధించాలి

● ఏపీఎస్పీ కమాండెంట్ నగేష్‌బాబు



బెటాలియన్ సిబ్బందికి సూచనలిస్తున్న కమాండెంట్ నగేష్‌బాబు

మంగళగిరి సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పోలీసుశాఖలో చేరిన సిబ్బంది ఆయుధాల వాడకం, ఫైరింగ్‌లో పట్టు సాధించి మంచి నిష్ణాతులుగా ఎదగాలని మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలం కమాండెంట్ కే.నగేష్‌బాబు సూచించారు. ఇటీవల పోలీసు కానిస్టేబుళ్ల నియామకంలో ఎంపికైన 153 మంది అభ్యర్థులు శిక్షణ నిమిత్తం గత డిసెంబరులో మంగళగిరి బెటాలియన్‌కు విచ్చేశారు. శిక్షణలో భాగంగా మంగళవారం బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న కమాండెంట్ నగేష్‌బాబు ఆయుధ పూజ నిర్వహించి ఆయుధాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫైరింగ్‌లో ఏ చిన్న తప్పిదం జరిగినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వెపన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, ఆయుధాన్ని ఎక్కడ పడితే అక్కడ వదిలివేయకుండా భద్రంగా ఉంచాలని సూచించారు. పోలీసు శాఖలో రాణించాలంటే ఫిట్‌నెస్‌తోపాటు ఫైరింగ్ బాగా నేర్చుకుంటే కాన్ఫిడెన్స్ పెరుగుతుందని చెప్పారు. ఫైరింగ్‌లో హోల్డింగ్, ఎయిమ్, ట్రిగ్గర్ ఆపరేషన్‌లో మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీటీసీ వైస్‌ప్రిన్సిపాల్ డి.ఆశీర్వాదం, ట్రైనింగ్ సెంటర్ అసిస్టెంట్ కమాండెంట్ వి.హనుమంతు, ఆర్ఐ సత్యనారాయణ, శిక్షకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత భూసమీకరణ

● వడ్డమాను, ఎండ్రాయి గ్రామాల్లో సమీకరణకు శ్రీకారం
● ఏడు గ్రామాలు.. 20,494 ఎకరాల సమీకరణ
● గ్రామాల వారీగా భూసమీకరణ నోటిఫికేషన్
● అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు

తుళ్లూరు, అమరావతి, గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి విస్తరణ, అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రెండో విడత భూసమీకరణకు సీఆర్డీఏ శ్రీకారం చుట్టింది. మలివిడత భూసమీకరణకు మంగళవారం నోటిఫికేషన్లు జారీ చేయనుంది. గతంలో 9.14 నోటిఫికేషన్ జారీ చేయగా, ఈసారి గ్రామాల వారీగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నది. మంత్రి పొంగూరి నారాయణ మంగళవారం ఉదయం వడ్డమానులో భూసమీకరణ కార్యాలయాన్ని లాంచనంగా ప్రారంభిస్తారు. అనంతరం భూ సమీకరణ ప్రక్రియ చేపడతారు. మధ్యాహ్నం నుంచి అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలో భూసమీకరణ చేపడతారు. తుళ్లూరు మండలంలో పెదపరిమి పెద్ద రెవెన్యూ(5600 ఎకరాలు) కావడంతో రెండు ల్యాండు పూలింగ్ యూనిట్ కార్యాలయాలను అద్దెకు తీసుకున్నారు. వడ్డమాను, హరిశ్చంద్రపురం, గ్రామాలలో కార్యాలయాలు సిద్ధం చేశారు. పల్నాడు జిల్లా అమరావతి మండలంలో కర్లపూడి, పెదమద్దూరు, వైకుంఠపురం, ఎండ్రాయి గ్రామాల్లో యూనిట్ కార్యాలయాలను సీఆర్డీఏ అధికారులు సిద్ధం చేశారు. బుధవారం వడ్డమాను, పెదపరిమిలో ఆయా కార్యాలయాలను అధికారికంగా ప్రారంభించనున్నారు. కాగా భూసమీకరణ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత 30 రోజుల వరకు అభ్యంతరాల కోసం గడువు కల్పించారు. రైతుల్లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆలోగా తెలియజేయవచ్చని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. భూములిచ్చిన రైతులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కష్టాలు పడినప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చాక వారి సమస్యలు పరిష్కరించడంలో చూపిన చొరవ, చిత్తశుద్ధి కారణంగా మలివిడత భూసమీకరణ విషయంలో రైతుల్లో నమ్మకం కనిపిస్తోంది. దీంతో అన్ని గ్రామాల్లో మెజారిటీ రైతులు భూసమీకరణకు ఆమోదం తెలిపారు. దీంతో పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని 4 గ్రామాల్లో 9,616 ఎకరాలు, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని 3 గ్రామాల్లో 10,494 ఎకరాలు భూసమీకరణ చేయనున్నారు. మొత్తం 24,494 ఎకరాల భూసమీకరణ చేస్తుండగా అందులో 16,666.57 ఎకరాలు రైతుల పట్టా భూమి, 104.01 ఎకరాలు అసైన్డ్ భూమి, 3,828.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా అమరావతి విస్తరణకు వినియోగించుకోనున్నారు.

నాడు నేలపాడు.. నేడు వడ్డమానులో

తొలివిడత భూసమీకరణ ప్రక్రియ ప్రారంభమైన 2015 జనవరి 2కి సరిగ్గా పదకొండేళ్ల తర్వాత రెండో విడత భూసమీకరణ జరగనున్నది. తొలివిడతలో 29 గ్రామాల నుంచి 33,800 ఎకరాల భూమిని సమీకరించగా, మలివిడతలో గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని ఏడు గ్రామాల నుంచి 20,494 ఎకరాలను సమీకరించనున్నది. నాడు తొలిరోజు తుళ్లూరు మండలం నేలపాడులో భూసమీకరణ చేయగా, ఇప్పుడు కూడా అదే మండలంలోని వడ్డమాను గ్రామంలో భూసమీకరణ చేయనున్నారు. ఈ గ్రామంలో మొత్తం 1,937 ఎకరాల భూమిని సేకరించనున్నారు.

మత్తు విక్రయదారులను సమాజం బహిష్కరించాలి

● హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ● నారాకోడూరులో వ్యసన విముక్తి కేంద్రం ప్రారంభం



వ్యసన విముక్తి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ

చేబ్రోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా చేస్తున్న విక్రయదారులను సమాజం నుంచి పూర్తిగా బహిష్కరించాలని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని గాయత్రి శక్తిపీఠంలో వ్యసన విముక్తి శిక్షణ కేంద్రాన్ని మంగళవారం బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో ఉన్నత విద్యావంతులు కూడా మాదక ద్రవ్యాలకు బానిసలై తమ కుటుంబాలను, సమాజాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ, వ్యసనాలకు బానిసైన వారిని విముక్తి చేసేందుకు గాయత్రి శక్తిపీఠంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. విద్యా, వైద్యం ప్రధాన అంశాలుగా సమాజం కోసం గాయత్రి శక్తిపీఠం నిర్వాహకులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వ్యసన విముక్తి కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గుండవరం రోడ్డు నుంచి గాయత్రి శక్తి పీఠానికి వెళ్లే రహదారిని విస్తరించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపి పరిష్కరిస్తామని ప్రకటించారు. అనంతరం కుటుంబంలో తల్లిదండ్రులు కోల్పోయిన వంద మంది చిన్నారులకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రి శక్తిపీఠం పరివార్ సభ్యులు అశ్వని సుబ్బారావు, చంద్రశేఖరరావు, పార్థసారథి పాల్గొన్నారు.

ఈ గవర్నెన్స్‌పై అధికారులకు శిక్షణ

● గుంటూరు జిల్లా పరిషత్‌లో కార్యక్రమం ● పలు మండలాల ప్రభుత్వ ఉద్యోగుల హాజరు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సిబ్బందికి ఈ గవర్నెన్స్‌పై శిక్షణ కార్యక్రమం మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్‌లోని ఏసీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, విశిష్ట అతిథిగా సీఈవో వీర్ల జ్యోతి బసు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలానికనుగుణంగా నేడు ఉపయోగిస్తున్న సాంకేతిక పరికరాలను ప్రతి ఒక్కరు నేర్చుకొని విధి నిర్వహణలో అమలు చేయాలని కోరారు. తద్వారా ప్రజలకు సులభమైన రీతిలో అత్యంత వేగంగా కచ్చితమైన సేవలు అం దించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి జిల్లాస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో జనవరి 1 నుంచి ఈ ఆఫీసు ద్వారానే ఫైల్స్ రన్ చేయాలని ప్రభుత్వాదేశాలు ఉన్నాయని, దీనికి అనుగుణంగా అందరూ ఈ విషయాలపై తర్ఫీదు పొందాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అకౌంట్స్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్ పాల్ అచ్చంపేట, అమరావతి, బొల్లాపల్లి, దుగ్గిరాల, కారంపూడి, మాచ వరం, పొన్నూరు, మాచర్ల, నిజాంపట్నం, పెదకాకాని, అమృతలూరు మండలాల నుంచి సిబ్బంది పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా కె.శ్రీనివాస రావు, కె.అనురాధ, డి.రవీంద్ర బాబు, ఏ.శృతి తదితరులు వ్యవహరిం చారు. సపోర్టింగ్ సిబ్బందిగా శిరీష రాణి, మేఘన, కరీముద్దీన్, శ్రీనివా సరావు, డి.నాగేశ్వరరావు, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు

విద్యార్థులే దేశానికి నిజమైన సంపద

● జిందాల్ మేనేజర్ ఎంవీ చారి ● విజ్ఞాన్‌లో ముగిసిన ఎకోవిజన్ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జిందాల్ మేనేజర్ ఎంవీ చారి

గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులే దేశానికి అసలైన సంపదని గుంటూరు లిమిటెడ్ జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఎంవి చారి పేర్కొన్నారు. యువత శక్తిని సద్వినియోగం చేసుకుంటే భారతదేశం త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం ఎకోవిజన్ ఇన్నోవేటివ్ పాత్‌వేస్ టు సస్టేయినబుల్ ఎనర్జీ జాతీయస్థాయి ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలక మని అన్నారు. ముఖ్యంగా సస్టేయినబుల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. పట్టణాల్లో ప్రతిరోజు ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి విద్యుత్ శక్తిగా మార్పు చేస్తే శుభ్రమైన పర్యావరణంతో పాటు స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంవీ చారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ సునీల్ కె.మైటీ, సీఎస్ఐఆర్ ఐఐసీటీ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్ఎస్ ప్రకాశం, ఎన్ఐటీ తాడేపల్లిగూడెం సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.భరణిదరన్, ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొ ఫెసర్ డాక్టర్ పంకజ్ పతక్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు మరమ్మతులు



అమరావతి, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): పల్నాడు జిల్లాలోని అమరావ తిలో గల ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు రూ1.86 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. ప్రాజెక్టు లోపలి భాగంలో లీకులు ఏర్పడి వర్షపునీరు లీకవుతోంది. అలాగే బుద్ధుని భుజం, మోకాళ్లపై పగుళ్లు వచ్చాయి. డిజిటల్ స్క్రీన్ నిరుపయోగంగా పడి ఉండటంతో పాటు విగ్రహంపై మరకలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో టూరిజం అధికారులు పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించి మరమ్మతులు చేపట్టారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరం గ్రామంలో పోలీసులు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని మాచవరం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 40 బస్తాల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అమృతలూరు మండలం బోడపాడు గ్రామానికి చెందిన కొండూరు సునీల్, ప్యాపర్రు గ్రామానికి చెందిన బుల్లెద్దు శ్రీనివాసరావు, బుల్లెద్దు సుధీర్, మాచవరం గ్రామానికి చెందిన లింగ భద్రరావు, పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రేషన్ డీలర్ వీరకుమార్, మాచవరం రేషన్ డీలర్లు నళిని, ఆనంద కుమారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బొగ్గు వ్యాగన్‌లో మంటలు

● తెనాలి రైల్వేస్టేషన్‌లో ఘటన

తెనాలి క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్‌లో సైడ్ ట్రాక్‌లో నిలిపి ఉంచిన బొగ్గు వ్యాగన్ నుంచి మంటలు చెలరేగాయి. సోమవారం ఈ ఘటన జరిగింది. బొగ్గు వ్యాగన్ నుంచి మంటలు రావడం గుర్తించిన రైల్వే సిబ్బంది తెనాలి ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ వ్యాగన్ గత నెల 19నే తెనాలి స్టేషన్‌కు రాగా సాంకేతిక సమస్యలతో సైడ్ ట్రాక్‌లో ఉంచారు. ఈ గూడ్స్ కృష్ణపట్టణం నుంచి మహారాష్ట్రకు వెళుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.15 నుంచి 20 వేల విలువైన నష్టం వాటిల్లి ఉండొచ్చని పేర్కొన్నారు.

కన్నతల్లిని కడతేర్చిన కుమారుడు

● మద్యం మానాలని మందలించినందుకు ఘాతుకం



పోలీసుల అదుపులో నిందితుడు

పొన్నూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మాని వ్యసనాలకు దూరంగా ఉండి, భార్యా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పినందుకు ఓ కుమారుడు తన కన్న తల్లిని కడతేర్చాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొండముది గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, కొండముది గ్రామానికి చెందిన కొమ్ము జయమ్మ ఈ నెల 3వ తేదీన అనుమానాస్పద రీతిలో హత్యకు గురైంది. జయమ్మను గుర్తు తెలియని వ్యక్తులు బంగారం కోసం హత్య చేశారని కుమారుడు నాగరాజు ఆరోపించాడు. నాగరాజు కదలికలపై అనుమానం వచ్చిన బంధువులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు జయమ్మను కొడుకు నాగరాజే హతమార్చాడని నిర్ధారించారు. తాగుడుకు బానిసైన నాగరాజును తన ప్రవర్తన మార్చుకోమ్మని జయమ్మ మందలించడంతో మంచం కోడుతో ఆమె తలపై బలంగా మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. జయమ్మ మృతి వార్తను ఎవరికీ చెప్పకుండా నాగరాజు ఇంటికి తాళం వేసి వెళ్లి సాయంత్రం తిరిగొచ్చి గుర్తు తెలియని వ్యక్తులు తన తల్లిని బంగారం కోసం హత్య చేశారని పెడబొబ్బలు పెట్టాడు. జయమ్మ మృతి విషయంపై అనుమానించిన బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. విచారణలో తల్లిని నాగరాజే హత్య చేశాడని నిర్ధారించి అతణ్ని అరెస్టు చేశామని సీఐ కృష్ణయ్య తెలిపారు.

పేకాట క్లబ్‌పై పోలీసుల దాడులు

● సత్తెనపల్లిలో 46 మంది జూదరుల అరెస్టు

సత్తెనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ది సత్తెనపల్లి క్లబ్‌పై మంగళవారం పోలీసులు దాడి చేసి 46 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి లక్ష 50వేల నగదు, 37 సెల్ ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఉన్న క్లబ్‌పై పోలీసులు దాడులు చేసి జూదరులను అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అరెస్టు చేసిన వారిలో వివిధ పార్టీలకు చెందిన నేతలు కూడా ఉన్నారని సమాచారం.

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

● నేటి ప్రారంభ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరు
● కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ

ఏఎన్‌యూ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) రసాయనశాస్త్ర విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ స్టడీస్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరగనుంది. బుధ, గురువారాలలో "ఆచార్య నాగార్జునుడి ఆల్కెమికల్ వారసత్వం, సంప్రదాయిక ఆధునిక దృక్పథాలు అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని కన్వీనర్ ప్రొఫెసర్ దిట్టకవి రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారని, విశిష్ట అతిథులుగా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మంత శ్రీనివాసులు, గౌరవ అతిథులుగా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం పాల్గొంటారన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడులో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన సౌజన్య (23)కు ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బోలె పరమేశ్వరరావుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది కాలం నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సౌజన్య ఇంట్లో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ప్రత్తిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 559 అడుగులు ఉంది. ఇది 230.52 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,688 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,429 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 38,585 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

18, 19 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులకు సొంత ఊళ్లకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే ప్రజల సౌకర్యార్థం ఈ నెల 18, 19వ తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 08513 విశాఖపట్టణం-చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీన రాత్రి 11 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుందని, రైలు నంబరు 08514 చర్లపల్లి-విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 19న మధ్యాహ్నం 3.30కు బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుందన్నారు.

జిల్లా పరిషత్ సాధారణ సమావేశం వాయిదా

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరగాల్సిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సాధారణ సమావేశం వాయిదా పడినట్లు సీఈవో వీర్ల జ్యోతి బసు వెల్లడించారు. అదే రోజున జరగాల్సిన స్థాయి సంఘం 1,7 సమావేశం కూడా వాయిదా వేసినట్లు తెలిపారు. ఆ రోజున సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన ఉన్నందు వల్ల జిల్లా పరిషత్ సమావేశం వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు ఏర్పాటు చేసేది త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	57,298
అమ్మకాలు	55,205
నిల్వ	11,903

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	19000
నెంబరు. 5	13500	18000
273	---	----
341	13500	19000
4884	----	----
సూపర్ 10	13500	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11500	15000
షార్క్-1	-----	----
బ్యాడిగి	13000	18000
దేవనూరు డీలక్స్	13500	20500
ఆర్మూరు	11000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	12000	18000
నెంబరు. 5	13000	17500
273	----	----
341	13000	18000
4884	-----	-----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	10000	17500
దేవనూరు డీలక్స్	-----	-----
తాలుకాయలు	5000	8600



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ నాని, ఎమ్మెల్యే నసీర్

సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకునే సంక్రాంతి సంబరాలను తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని వెల్ఫేర్ సెంటర్ స్థలంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను మేయర్ కోవెలమూడి రవీంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిని చిట్టిబాబుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను ఈ ఏడాది నుంచి తూర్పు నియోజకవర్గంలోనూ నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. కార్మిక శాఖకు చెందిన వెల్ఫేర్ సెంటర్ స్థలంలో ఈ వేడుకలు నిర్వహించనున్నామన్నారు. స్థానిక కార్పొరేటర్ ఈ స్థలం గురించి పదే పదే తన దృష్టికి తీసుకురావడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, జీజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న వైద్య సేవలను ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో వెల్ఫేర్ సెంటర్‌లో వైద్య భవనాలు నిర్మాణం చేస్తున్నామని, ఇప్పటికే రూ.93 లక్షలతో ప్రహరీ నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.

రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎస్సీ పేటల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చైర్మన్ నసీర్ చెప్పారు. నగరంలోని 50, 51, 53వ డివిజన్లలోని శ్రీనగర్, శారదాకాలనీ ప్రాంతాల్లో రూ.2.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతాలు గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేవని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రతి ప్రాంతంలో సంపూర్ణ అభివృద్ధి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని తెలిపారు. మళ్లీ రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అమలులో నియమాలను సులభతరం చేయాలి

● ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు నాయీబ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ వినతి

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెలూన్లకు ఉచిత విద్యుత్ అమలులో నియమాలను సులభతరం చేయాలని మంగళవారం నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నసీర్‌కు వినతి పత్రం అందజేశారు. సెలూన్లకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం ఈ జీవో ప్రవేశపెట్టిందన్నారు. అధికారులు ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ, విద్యుత్ శాఖ అధికారులు ఇచ్చే సర్టిఫికెట్సలలో జాప్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చినట్టు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన బుజ్జి, అద్దంకి రవి, కిరణ్, సుబ్రహ్మణ్యం, కిరణ్, సాంబయ్య, నాగరాజు, మల్లాది నాగేశ్వరరావు ఉన్నారు.

ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

● జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష కార్యదర్శులతో సహా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి, రాష్ట్ర సంఘ కార్య నిర్వాహక కార్యదర్శి కే.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఘంటసాల శ్రీనివాసరావు (మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్), సహాధ్యక్షులుగా సీహెచ్ రాంబాబు (రిజిస్ట్రేషన్ శాఖ), ఉపాధ్యక్షుడిగా డీడీ నాయక్ (మెడికల్ తుళ్లూరు), కేవీవీ కిషోర్ (ఆర్ అండ్ బి తెనాలి), జీసీహెచ్ కోటేశ్వరరావు (వెటర్నరీ, మంగళగిరి), డి.దుర్గారావు (వార్డు సచివాలయ శాఖ, పలకలూరు), సి.హెచ్ అనిల్ కుమార్ (పశు సంవర్ధక శాఖ), మహిళా ఉపాధ్యక్షురాలిగా వి.శ్రీవాణి (వైద్య ఆరోగ్యశాఖ పొన్నూరు), జిల్లా కార్యదర్శిగా ఏ. శ్యామసుందర్ శ్రీనివాస్ (వ్యవసాయ శాఖ), కార్యనిర్వాహక కార్యదర్శిగా కే.ఎస్ సుకుమార్ (పీహెచ్సీ పెదకాకాని) సంయుక్త కార్యదర్శిలుగా సయ్యద్ జానీబాషా (వాణిజ్య పన్నుల శాఖ), కే విజయ బాబు (పబ్లిక్ హెల్త్) డి. శ్రీనివాస్ (ఖజానా శాఖ) కే.నరసింహారావు (జల వనరులు శాఖ) మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి (సాధారణ బీమా శాఖ), కోశాధికారిగా ఎల్.శ్రీధర్ రెడ్డి (వైద్య ఆరోగ్యశాఖ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెరువులు, ఖాళీ స్థలాల్లో దోమల నివారణకు చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



కల్వర్టులో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో చెరువులు, ఖాళీ స్థలాల్లో దోమలు పెరగకుండా ప్రత్యేకమైన డ్రోన్ల ద్వారా కీమోఫాస్ లిక్విడ్‌ని స్ప్రే చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నల్లచెరువులో యాంటీ లార్వా యాక్టివిటీలో భాగంగా డ్రోన్ ద్వారా చేస్తున్న స్ప్రేయింగ్‌ని మంగళవారం ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో పిన్ పాయింట్‌గా గుర్తించిన ప్రాంతాల్లో స్ప్రే చేయించాలని బయాలజిస్ట్‌ని ఆదేశించారు. అనంతరం నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించి, ట్రాక్ అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలన్నారు. చుట్టుగుంట దగ్గర జరుగుతున్న మేజర్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన జరిగేలా పర్యవేక్షణ చేయాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు జ్యోతి పద్మజ, నిమ్మల వెంకటరమణ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ హనీఫ్, బయాలజిస్ట్ రాజు నాయక్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు

నగరాభివృద్ధిలో రేట్ పేయర్స్ అసోసియేషన్ సూచించే సలహాలు తప్పక పరిగణలోకి తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గుంటూరు రేట్ పేయర్స్ అసోసియేషన్ నూతన కమిటీ మంగళవారం నగరపాలక కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్‌ను గౌరవపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీరు క్వాలిటీగా అందించేందుకు మరింతగా కృషి జరగాలని, పర్యావరణాన్ని పెంచే మొక్కల, చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రాఘవరావు, కార్యదర్శులు వల్లూరి సదాశివరావు, ఆర్ అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులు, టి ధనుంజయ రెడ్డి, కే పావని, సభ్యులు మేడూరి రాజేంద్రప్రసాద్ విన్నకోట మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా సాగిన సంగీత కచేరి

గుంటూరు (తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి 179వ ఆరాధన సంగీత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రధాన కచేరీలలో భాగంగా మంగళవారం ప్రముఖ విద్వాంసురాలు సేలం గాయత్రి వెంకటేశన్ త్యాగరాజ కృతులను తమ గాత్రంతో శ్రావ్యంగా పలికించి సంగీతాభిమానులను అలరించారు. తొలుత జరిగిన గాత్ర కచేరీలో కళాకారులు చక్కటి ప్రతిభ చూపారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజాశంకర్, కార్యదర్శి వి.కృష్ణ కిషోర్ కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతులకు ‘స్వీకారం’

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు (విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు స్వీకారం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లో సంక్షేమ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పి 4 కార్యక్రమం కింద స్వీకారం కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, దాతృత్వ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకుల ఉదార సహకారంతో ఈ కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. పునరుద్ధరణలో భాగంగా హాస్టళ్లలోని వసతి గదులు, వంట, భోజనశాలలు, మరుగుదొడ్లు, స్నాన గదులు, చదువుకునే గదులు, సామూహిక ప్రదేశాలలో మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేస్తారన్నారు. జిల్లా సాంఘిక సంక్షమ అధికారి యు. చెన్నయ్య మాట్లాడుతూ సాంఘిక సంక్షమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు రూపొందించడం జరుగుతోందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంక్షమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజులను సత్కరిస్తున్న డాక్టర్ రామరాజు శ్రీనివాస్ తదితరులు

తెలుగు మహాసభలు విజయవంతంపై అభినందనలు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్రుల రాజధాని అమరావతి కేంద్రంగా నగరంలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావటంపై సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ముఖ్య సమన్వయకర్త పి.రామచంద్రరాజులకు దక్కుతుందని రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాస్ అభినందించారు. ప్రపంచ తెలుగు సభలకు ఎందరో ప్రముఖులను, రాజకీయ నేతలను దేశ, విదేశాల నుంచి భాషా పండితులను, కవులను, కళాకారులను రప్పించి లక్షలాది మందిలో తెలుగు భాషపై చైతన్య స్ఫూర్తి రగిలించిన కార్యక్రమం స్ఫూర్తిదాయకమన్నారు. స్థానిక భారతీయ విద్యాభవన్‌లో మంగళవారం వారిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణకు సైకిల్ యాత్ర

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, దీనిపై ప్రజలను చైతన్య పరచాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా, రావులపాలెంలోని యూనియన్ బ్యాంకులో విధులు నిర్వహించే రామరాజు సంకల్పించారు. వైజాగ్ నుంచి తిరుపతి వరకు ఏపీ అండ్ తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర పేరుతో సైకిల్ యాత్ర చేపట్టారు. మంగళవారం ఈ యాత్ర ఏటుకూరు రోడ్డు ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు రాగా రామరాజుకు ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు బ్యాంకుల ఉద్యోగులు ప్రధాన వీధుల నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి, జీటీ రోడ్డులోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు రామకృష్ణ, వేణుబాబు, పి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను బలహీనపరచే విధానాలకు వ్యతిరేఖంగా, బ్యాంకింగ్ సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని రామరాజు చేస్తున్న ఉద్యమం అభినందనీయమన్నారు. అనంతరం రామరాజును యూనియన్ బ్యాంక్ ఏజీఎం సత్యజిత్ ఘనంగా సత్కరించారు. రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల పరిరక్షణే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రవిచంద్రారెడ్డి, పృథ్వీ, మురళీ షరీఫ్, పావని క్రాంతి, అఖిల తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రామరాజు, ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులు

వెనెజువెలాపై దాడి అప్రజాస్వామికం

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెనెజువెలాలోని సహజ వనరులను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేస్తున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. సీపీఎం నగర కమిటి ఆధ్వర్యంలో మంగళవారం శంకర్ విలాస్ సెంటర్‌లో వెనెజువెలాకు సంఘీభావంగా అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ దాడిని ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేఖిస్తున్నారని, మోదీ మాత్రం ఇరు దేశాలు సామరస్యంగా చర్చలు జరిపి సమస్య పరిష్కరించుకోవాలని ప్రకటించటం ఏమిటని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలలో సహజ సంపదను హస్తగతం చేసుకునేందుకే ఇలాంటి దురాగతాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ నిరసనల్లో కె.నళినీకాంత్, పాశం రామారావు, ఎల్.అరుణ, బి ముత్యాలరావు, వీవీకే సురేష్, వి.లక్ష్మణరెడ్డి, భావన్నారాయణ, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా యూకో బ్యాంక్ 84వ వ్యవస్థాపక దినోత్సవం

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అరండల్‌పేటలో యూకో బ్యాంక్ మిడ్ కార్పొరేట్ బ్రాంచ్‌లో యూకో బ్యాంక్ 84వ ఫౌండేషన్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఫౌండేషన్ డే సందర్భంగా లలిత పీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రెడ్‌క్రాస్, సొసైటీ, మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో బ్రాంచ్ ఆవరణలో కస్టమర్లకు, బ్యాంక్ సిబ్బందికి, నగర వాసులకు ఉచిత కంటి వైద్య శిబిరం, బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూకో బ్యాంక్ ఏజీఎం సయ్యద్ ఇలియాస్ బాషా, చీఫ్ మేనేజర్ ఆశిష్ రాజ్, సీనియర్ మేనేజర్లు సంతోష్‌కుమార్, స్వరూప్ కావూరి, బ్యాంక్ సిబ్బంది హాజరయ్యారు.



వ్యవస్థాపక దినోత్సవంలో ఏజీఎం సయ్యద్ ఇలియాస్ బాషా, చీఫ్ మేనేజర్ ఆశిష్‌రాజ్ తదితరులు

భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, ధార్మిక ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో జరిగింది. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయ పాలకమండలి ఆధ్వర్యంలో 14వ సద్గి కార్యక్రమంలో భాగంగా మంగళవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ లలితాంబ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బుర్ర ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని పలు స్టాల్స్‌లో తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఎంఆర్‌పీ ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు విక్రయించటంపై 'ఆంధ్రజ్యోతి'లో 'బస్టాండ్ స్టాల్స్‌లో ఎమ్మార్పీ ఉల్లంఘన' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి తూనికలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, తనిఖీ అధికారి సునీల్ రాజు నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి మూడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జాయింట్ కంట్రోలర్ మాధురి ఆదేశాల మేరకు స్టాల్స్‌పై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇక నిరంతరం బస్టాండ్ స్టాల్స్‌లో ఎంఆర్‌పీ ధరలపై తనిఖీలు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.



బస్టాండ్‌లోని స్టాల్స్‌లో కేసులు నమోదు చేస్తున్న తూనికలు కొలతల శాఖ సిబ్బంది

ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యం

● ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లోకి ఏ పథకాన్ని తీసుకెళ్లాలన్నా, నూతన లక్ష్యలు రూపొందించాలన్నా, వాటిని నెరవేర్చేందుకు ముందడుగు వేయాలన్నా ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ కీలకమని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీ ఏ కిరణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా సంఘం నూతన కార్యవర్గం తొలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై గొంతెత్తి నినదించేందుకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్ పాల్గొన్నారు.

మారిషస్ అధ్యక్షుడితో దత్తాత్రేయ మర్యాద పూర్వక భేటీ



ధరమ్ బీర్ గోకుల్‌తో బండారు దత్తాత్రేయ

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనేందుకు గుంటూరుకు వచ్చిన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో మాజీ గవర్నర్ మర్యాదపూర్వకంగా భేటీ అయి, పలు అంశాలపై చర్చించుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో బాబురావు మాట్లాడారు. లేబర్ కోడ్‌లపై కార్మికులు ఉద్యమించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి కేటాయించిన వక్ఫ్ భూములను పారిశ్రామిక కారిడార్ పేరుతో సేకరించడం ఆపాలని కోరారు. సమావేశంలో పాశం రామారావు, ఎం.రవి, బూరుగు వెంకటేశ్వర్లు, ఎన్.భావన్నారాయణ, నళినీకాంత్, వి.దుర్గారావు, జవహర్‌లాల్, ఎల్.అరుణ, డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ వేధింపులు ఆపాలి

గుంటూరు(తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ చేస్తున్న వేధింపులు ఆపాలని 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సంస్థ చేస్తున్న అన్యాయాలకు నిరసనగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట కొవ్వొత్తులతో 104 సిబ్బంది ధర్నా చేపట్టారు. ఈ నిరసనల్లో గోరంట్ల సురేష్, శ్రీహర్ష, ఐ.నాగులు, ఏడుకొండలు, సత్యరాజ్, బాలకృష్ణ, సాయిరామ్, హరి, విజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ వహించాలి : ఆర్టీవో



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీవో శ్రీహరి, పాల్గొన్న వైద్యులు

గుంటూరు (తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ వహించాలని ఆర్టీవో శ్రీహరి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక రవాణ శాఖ కార్యాలయంలో మంగళవారం డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సురక్షిత డ్రైవింగ్ చేయగలుగుతారని అన్నారు. కంటి చూపు పట్ల డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలలో మరణిస్తే ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ విషయం దృష్టిలో ఉంచుకొని వాహనాలను జాగ్రత్తతో నడపాలని సూచించారు. అనంతరం డ్రైవర్లకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారి మల్లేశ్వరీ, సిబ్బంది, వాహన యజమానులు పాల్గొన్నారు.

భవానీపురంలో వివాహిత అదృశ్యం



చంద్రకళ(ఫైల్)

గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానీపురంలో పాలడుగు చంద్రకళ (27) అనే వివాహిత అదృశ్యమైంది. ఆమె భర్త నాగార్జున వివరాల మేరకు భవానీపురం 1వ లైనులో నివాసం ఉంటున్నామని, ఈ నెల 4 నుంచి తన భార్య కనిపించటం లేదని, బంధువులకు ఫోన్ చేసి విచారించినా ఆచూకీ తెలియకపోవటంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

కార్యకర్తలే పార్టీకి గుండెకాయ

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

● 66 మంది ఉత్తమ కార్యకర్తలకు సత్కారం

గుంటూరు జనవరి 6(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు గుండెకాయ వంటివారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆమె పార్టీ ఉత్తమ కార్యకర్తలకు సత్కారం చేశారు. 66 మంది ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ టీడీపీలో ఉత్తమ కార్యకర్తలుగా గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమన్నారు. నిర్విరామంగా తెలుగుదేశం జెండాను మోస్తూ, పార్టీ విలువలను కాపాడుకుంటూ సమాజ సేవకు అంకితమై పనిచేస్తున్న ప్రతి నాయకుడికి ఎమ్మెల్యే గళ్లా మాధవి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నుంచి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు దగ్గర నుంచి వచ్చిన ఈ ప్రశంసాపత్రాల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి అధిక సంఖ్యలో రావడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. 'గుంటూరు వెస్ట్ ఇస్ ఆల్వేస్ బెస్ట్' అని గర్వంగా చెప్పారు. ప్రశంసాపత్రాలు అందుకోని వారు ఉత్తమ కార్యకర్తలు కాదనే భావన ఏమాత్రం లేదని స్పష్టం చేశారు.

గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్లా మాధవి మంగళవారం 'మహిళా గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు నేరుగా తనకే సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వచ్చిన ప్రతి సమస్యపై సానుకూల దృక్పథంతో స్పందిస్తూ, సాధ్యమైన పరిష్కారాలు, అవసరమైన ఫాలోఅప్స్ చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. మహిళలు గౌరవంగా, స్వావలంబనతో ముందుకు సాగాలనే సత్సంకల్పంతో ఈ మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి

● ఏపీఐడీసీ చైర్మన్‌కు సీఎం చంద్రబాబు సూచన



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న డేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీఐడీసీ కార్పొరేషన్ పురోగతిని చైర్మన్ డేగల ప్రభాకర్ వివరించారు. ఏపీఐడీసీ ద్వారా పారిశ్రామికవేత్తలకు రుణ సదుపాయం కల్పించి పరిశ్రమలు ఏర్పాటుకు తగిన కృషి చేయాలని చైర్మన్ ప్రభాకర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న వైసీపీ

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి రాజధాని ఉండటం, ప్రజలు సంతోషంగా ఉండటం వైసీపీ నాయకులకు ఇష్టం లేదన్నారు. పౌరుషం అనేది మీసాల్లో ఉండదని, నిజాయితీలో ఉంటుందని, దాన్ని కేతిరెడ్డి గుర్తెరగాలని సూచించారు. రాజధాని అమరావతి రాష్ట్ర ప్రజలందరి హృదయమనీ, రాజధాని అభివృద్ధి ఫలాలు రాష్ట్రం మొత్తం పంపిణీ జరుగుతాయని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్, హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా రాయలసీమకు కృష్ణా జలాలు, ఇండస్ట్రియల్ అండ్ హార్టికల్చర్ హబ్‌ను కూటమి ప్రభుత్వం తీసుకురావటాన్ని వైసీపీ ఓర్వలేకపోతుందన్నారు.

9న టీడీపీ కార్యాలయంలో ముగ్గుల పోటీలు

ఈనెల 9వ తేదీన అరండల్‌పేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే వారు పార్టీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నెంబర్ 7075087057కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారాలు

● జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె

గుంటూరు మెడికల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నా వైసీపీ నాయకులు, ఆ పార్టీకి సంబంధించిన మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వంపై నిందలు వేయడం తగదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు హితవు పలికారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఎమర్జెన్సీ వార్డు దగ్గర మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలుత జీజీహెచ్‌లో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌లో సౌకర్యాలను జనసేన నాయకులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సేవలకు సంబంధించి 104, 108 అంబులెన్స్‌లు రోగులకు చక్కటి సేవలు అందిస్తున్నా, వైసీపీ నాయకులు మాత్రం కళ్లున్న కబోదుల్లా వీటిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే జిల్లావ్యాప్తంగా ఉన్న 108 వాహనాల్లో లోపాలు ఉంటే చూపించాలని గాదె సవాల్ విసిరారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు శిఖా బాలు, కొండూరు కిషోర్, హుస్సేన్, యర్రంశెట్టి రాజేష్, మామిడి రామారావు, మధులాల్ పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో సౌకర్యాలు పరిశీలిస్తున్న గాదె తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా ఆటోనగర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని లారీ స్టాండ్ రోడ్డు, ఎస్‌వీఆర్ కంపెనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దేవాపురం, కొబ్బల్దిపేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.


గొంతెండుతోంది

● కోటప్పకొండలో నీరు లేక వన్యప్రాణుల విలవిల
● నాలుగు నెలలుగా పనిచేయని మోటార్లు
● చోద్యం చూస్తున్న అధికారులు


విదేశీ పక్షుల కోసం ఏర్పాటు చేసిన తొట్టిలో పాచిపట్టిన నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ పుణ్యక్షేత్రం.. ప్రఖ్యాత పర్యాటక కేంద్రం కోటప్పకొండలో నీరులేక వన్యప్రాణులు విలవిలలాడుతున్నాయి. పచ్చదనం.. వన్యప్రాణులు.. మీనాలతో కళకళాడాల్సిన పర్యాటక కేంద్రం వెలవెలబోతోంది. నీరు లేక వన్యప్రాణుల గొంతెండుతోంది. మొక్కలు ఎండిపోతున్నాయి. మనుషులైతే నీటి కోసం పోరాడేవారు. నోరులేని వన్యప్రాణులు వాటి ఆరుపులతో నీటిని అడుగుతున్నా అధికారులకు కనికరం లేదు. కేంద్రంలో నీటి ఎద్దడి త్రీవ స్థాయిలో నెలకొంది. నాలుగు నెలలుగా నీటి సరఫరా నిలిచిపోయింది. నీటి సరఫరాను పునరుద్ధరించడంలో అంతులేని నిర్లక్ష్యాన్ని ఆటవీశాఖ ప్రదర్శిస్తోంది. మోటార్లకు మరమ్మతులు చేపట్టడాన్ని అధికారులు విస్మరించారు. మొక్కలు పూర్తిగా బెట్టకు వచ్చి ఎండిపోతున్నాయి. పర్యాటక కేంద్రంలో వన్య ప్రాణులకే కాదు పర్యాటకులకు గొంతెండుతోంది.


ఘాట్ రోడ్డులో నీరులేక ఎండిపోతున్న మొక్కలు

● నీరు చాలక వన్యప్రాణుల కేకలు

కొండ దిగువ నుంచి మోటార్ల సాయంతో పర్యాటక కేంద్రానికి నీటి సరఫరా చేయాల్సి ఉంది. ఘాట్ రోడ్డులోనూ మొక్కలకు నీటిని అందించాలి. నెలల తరబడి నీటి సరఫరా నిలిచిపోవడంతో కేంద్రంతో పాటు ఘాట్ రోడ్డులోని మొక్కలు ఎండిపోతున్నాయి. జింకలు, పక్షులకు అరకొరగా బిందెలతో అందిస్తున్న నీరు చాలక దాహంతో కేకలు వేస్తున్నాయి.

● కళతప్పిన పర్యాటక కేంద్రం

అధికారుల నిర్లక్ష్యంతో ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రం పూర్తిగా కళతప్పింది. చిన్న పిల్లల పార్కుల్లో ఆట వస్తులు విరిగిపోయాయి. కాళింది మడుగు ఎండిపోయింది. బోట్ షికార్ అటకెక్కింది. పెడల్ బోట్స్ విరిగిపోయాయి. పార్కులో పచ్చదనం ఆవిరైపోతోంది. మీనాలు లేక మీన కేంద్రం వెలవెలబోతోంది. పక్షుల కిలకిలరావాలతో అలరించేవి. పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. కొన్ని చాంబర్‌లు పక్షులు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. కేంద్రాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోటప్పకొండలో తిరునాళ్ల 40 రోజుల్లో జరగనుంది. యాత్రికులు పర్యాటక కేంద్రాన్ని భారీ సంఖ్యలో సందర్శిస్తారు. కేంద్రంలో కనీసం తాగు నీటి వసతి కూడా లేదు. తిరునాళ్ల నాటికి పర్యాటక కేంద్రాన్ని పునరుద్ధరించే దిశగా ఆటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.


పిల్లల పార్కులో విరిగిపోయిన ఆట వస్తువులు


పర్యాటక కేంద్రంలో నీరు రాని కుళాయిలు


విరిగిపోయిన డైనోసార్ బొమ్మ

● పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్న అటవీశాఖ

ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారించాల్సిన ఆటవీశాఖ అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఘాట్ రోడ్డు టోల్ గేట్ ద్వారా నెలకు రూ.లక్షల్లో వచ్చే ఆదాయం పర్యాటక కేంద్రం నిర్వహణకు వెచ్చించాల్సి ఉంది. అప్పట్లో పర్యాటక కేంద్రం నిర్వహణకు నిధులు కొరత లేకుండా నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు ముందు చూపుతో ఘాట్ రోడ్డు టోల్ గేట్ ఆదాయాన్ని ఆటవీశాఖకు అప్పగించారు. నిధులున్నా అభివృద్ధి చేయకపోగా పర్యాటక కేంద్రాన్ని పాడుబెట్టటం అధికారులు బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి కేంద్రంలో సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పర్యాటకులు కోరుతున్నారు.


నాగులవరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న చెరుకు పంట

తీపిగా లాభాలు

● చెరుకు పంటపై ఆసక్తి చూపుతున్న రైతులు
● నష్టాలు వచ్చే అవకాశం లేకపోవడంతో మొగ్గు

వినుకొండటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శరీర ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే చెరుకు పంటను పండించి రైతులు అత్యధిక లాభాలు పొందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని పెట్టుబడికి మించి ఆదాయం వస్తుం డడంతో చెరుకు పంటను పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచంలో బ్రెజిల్ చెరుకు ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంటే భారతదేశం 2వ స్థానంలో ఉంది. దేశం లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా ఈ పంటను సాగు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని నాగుల వరం, అగ్నిగుండాల, నకరికల్లు ప్రాంతాల్లో ఈ పంటను అత్యధికంగా సాగు చేస్తున్నారు.

● తిరునాళ్లలో మంచి డిమాండ్...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడులో అత్యధికంగా తిరునాళ్లు జరుగుతాయి. ఈ నేపథ్యంలో వ్యాపారులు చెన్నై ప్రాంతం నుంచి చెరుకును కొనుగోలు చేసి తిరునాళ్లలో అమ్మకాలు సాగించి అధికలాభాలు పొందుతుం టారు. ఇది గమనించిన నాగులవరం గ్రామ రైతులు మొదటిసారిగా 10 సంవత్సరాల క్రితం ఈ పంటను పండించేందుకు ముందుకొచ్చారు. నేడు సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో పంటను పండిస్తున్నారు. ఇప్పుడు వారు వరి, వాణిజ్య పంటల కంటే చెరుకు పంటను పండించేందుకు ఆసక్తి చూపడం గమనార్హం.

● ఎకరాకు రూ.లక్షన్నర ఆదాయం

ఎండ వేడిమి తట్టుకునేందుకు చెరుకు రసం తాగడం పరిపాటి. ఈ నేపథ్యంలో మంచినీటి వనరు గల ప్రాంతం కావడంతో నాగులవరం గ్రామంలో పండించే చెరుకుకు మంచి డిమాండ్ ఉంది. 8 నెలల కాలవ్యవధిలో కొనుగోలు దారులు ఇష్టపడే విధంగా పొడవాటి గడులు రావడంతో గడి ఒకటికి రూ.100 చొప్పున విక్రయించే అవకాశం ఉండటంతో రైతులకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షలు ఆదాయం సమకూరుతోంది.

శ్రమ తక్కువ ఆదాయం ఎక్కువ



ప్రారంభ దశలో కాస్త కష్టపడితే చాలు కేవలం మూడునాలుగు నెలల వ్యవధిలో పెట్టుబడికి మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పటికీ నష్టాలు వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు చెరుకు పంటపై ఆసక్తి చూపుతున్నారు. నీటివసతి ఉంటే చెరుకు పంటను పండించడం చాలా సులభం. చెరుకు గడులను నాటిన మూడు నెలలకే రైతుల వద్ద నుంచి పొలంలోని పంటను కొనుగోలు చేస్తాం. 5 నెలల పాటు చెరుకు గడులు పెరిగేందుకు అనువైన మందులు పిచికారి చేసి తిరిగి ఎండా కాలంలో అత్యధిక లాభాలకు మారుబేరం కింద అమ్ముతాం. ప్రస్తుతం వాణిజ్య పంటల కంటే చెరుకు పంటకు మంచి డిమాండ్ ఉంది.

● చిలకల సుబ్బారెడ్డి, చెరుకు వ్యాపారి

యార్డును అగ్రపథంలో నిలపాలి

● యార్డు చైర్మన్‌కు మంత్రి నారా లోకేశ్ సూచన


నారాలోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కుర్రా అప్పారావు

గుంటూరు (తూర్పు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులను, వ్యాపారులను సమన్వయం చేసు కుంటూ గుంటూరు, మిర్చి యార్డును దేశంలోనే అగ్ర భాగాన నిలపాలని యార్డు చైర్మన్ కుర్రా అప్పారావుకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సూచించారు. మంగళగిరిలోని లోకేశ్ కార్యాలయంలో కుర్రా అప్పారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించి నందుకు నారాలోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిర్చి రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధికి నిబద్ధతతో బాధ్యతాయుతంగా పని చేస్తానని కుర్రా అప్పారావు లోకేశ్‌కు హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని, అలాగే యార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని కుర్రా అప్పారావు తెలిపారు.

రైల్‌వన్ యాప్‌తో టిక్కెట్లపై 3 శాతం రాయితీ

● జనవరి 14 నుంచి ఆరు నెలల పాటు అమలు

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైల్ వన్ యాప్ ద్వారా బుకింగ్ చేసే అన్ రిజర్వుడు (జనరల్) టిక్కెట్లపై 3 శాతం రాయితీని అమలు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ చెల్లింపులు చేసేటప్పుడే రాయితీ మినహాయింపు పొందుతారని చెప్పారు. ఇది జనవరి 14వ తేదీ నుంచి జూలై 14 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. టిక్కెట్ కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణలో భాగంగా ఈ ప్రోత్సాహకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. రైల్‌వన్ యాప్ ద్వారా రిజర్వుడు, అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం, సీజన్ టిక్కెట్లతో పాటు మరికొన్ని ఇతర సేవలు కూడా పొందొచ్చని సూచించారు. ప్లేస్టోర్‌లో ఈ యాప్ అందుబాటులో ఉందని కావాల్సిన వారు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.



రైల్‌వన్ యాప్ ద్వారా పొందే ప్రయోజనాలు

బైపాస్

భూసేకరణకు మార్గం సుగమం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓడరేవు - నకరికల్లు 167ఏ జాతీయ రహదారి నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. భూములకు చెల్లించే నష్టపరహారం విషయంలో రైతు లు కోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. దీంతో భూసేకరణ అవార్డు అమ లుకు రెవెన్యూ శాఖ చర్యలు వేగవంతం చేసింది. భూసేకరణ ప్రక్రియలో రైతులు, స్థలాల యజమానుల నిర్ధారణ పూర్త యింది. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లతో పాటు వారి బ్యాంకు వివరాలను కూడా ఇప్పటికే అధికారులు సేకరించారు. అవార్డు వంతు మాత్రమే మిగిలింది. కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ప్రక్రియను కూడా వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు సమాయత్తమవుతు న్నారు. రెండు మూడు నెలల వ్యవధిలోనే భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. భూసేకరణకు అనుకూలంగా కోర్టు నుంచి తాజాగా తీర్పు రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టపరిహారాన్ని కూడా జమ చేశారు. తాజాగా బైపాస్ భూసేకరణ వివాదం కోర్టు తీర్పుతో పరిష్కారమైంది.

బియ్యానికి డబ్బులిస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

చుట్టింది. ఆయా రేషన్ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు ర్యాండమ్‌గా ఫోన్ చేసి బియ్యం అందుతున్నాయా లేదా అనే వివరాలు సేకరించింది. ఈ సర్వేలోనే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో విస్తుపోయే వాస్తవాలు వెల్లడైనట్లు తెలు స్తోంది. మూడు జిల్లాల పరిధిలో దాదాపు 9,000 మంది లబ్ధిదారులను ఐవీఆర్ఎస్ సర్వే చేస్తే 50శాతం మంది బియ్యం తీసుకోలేదని చెప్పినట్లు సమాచారం. అయితే ఈ పోస్ యంత్రాల్లో 90 శాతం బియ్యం పంపిణీ జరిగినట్లు నమోదైంది. కేజీకి రూ.పది చొప్పున నేరుగా డీలర్లే లబ్ధిదారులకు నగదు చెల్లించి వారిచేత బయోమెట్రిక్ వేయించుకుని బియ్యాన్ని పక్కదారి పట్టించడం అనేది జరిగే తంతుగా మారింది. కొంతమంది లబ్ధిదారులు ఇష్టపూర్వకంగా నగదు తీసుకుంటే మరి కొంత మంది తీసుకోవడానికి సుముఖంగా ఉన్నా బియ్యం లేవు డబ్బులు తీసుకోవాల్సిందేనని డీలర్లు ఒత్తిడి తెస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యం పంపిణీని నామమాత్రం చేస్తూ, అక్రమార్కుల తరపున వకల్తా పుచ్చుకుని డబ్బులు ఇవ్వడానికి షాపుల నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. కార్డుదారులకు బియ్యం అందించే విషయంలో వీలైనన్ని మార్గాల ద్వారా కొర్రీలు వేస్తూ వాటిని పక్కదారి పట్టించడానికే తాము ఉన్నట్లు డీలర్ల వ్యవహార శైలి ఉండడమే ఆందోళన కలిగించేదిగా ఉంది.

ఇంటింటి పంపిణీ ఉత్తిత్తే..

వృద్ధులకు ఇంటింటి పంపిణీ చేయాలని నిబంధనలు చెబుతున్నా డీలర్లు పట్టించుకోవడం లేదని ఐవీఆర్ఎస్ సర్వేలో బహిర్గతమైంది. అసలు తమ వద్దకు బియ్యం ఇవ్వడానికి ఎవరూ రాలేదని పలువురు వృద్ధులు చెప్పినట్లు సమాచారం. సర్వేలో భాగంగా కొంతమంది లబ్ధిదారులు తమకు డబ్బులు ఇచ్చి వెళ్తున్నారని చెప్పగా, మరికొంతమంది అసలు బియ్యమే అందలేదని చెప్పడం గమనార్హం. బియ్యం పంపిణీకి సంబంధించి వృద్ధుల నుంచి అసంతృప్తి వ్యక్తమైనట్లు సమాచారం. సగటున 50 శాతం మంది తాము బియ్యం తీసుకోవడం లేదని చెప్పగా అక్రమాలు అత్యధికంగా బాపట్ల జిల్లాలోనే ఉన్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది.

నివేదిక ఆధారంగా విచారణ

ఐవీఆర్ఎస్ వివరాలతో కూడిన నివేదికలను జిల్లాకు ఇటీవలే పంపించగా వాటి ఆధారంగా క్షేత్రస్థాయి వాస్తవాలను నిగ్గు తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. సర్వే చేపట్టిన రేషన్ షాపు వివరాలతో పాటు లబ్ధిదారుల డేటా కూడా పంపించినట్లు సమాచారం. సాంకేతికంగా బియ్యం పంపిణీ జరిగినట్లు లెక్కల్లో కనబడినా అక్రమార్కుల గూటికి బియ్యం వెళుతున్నట్లు తేటతెల్లమైంది. ఈ అంశాన్నే సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఏయే దుకాణాల పరిధిలో ఐవీఆర్ఎస్‌కు నెగిటివ్ రిపోర్టు వచ్చిందో వాటి పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా అధికారులు విచారణ జరుపుతున్నారు. అక్రమాలు నిజమేననే తేలితే తొలి వేటు ఆయా డీలర్లపైనే పడనుందని తెలుస్తోంది. క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా ఏకకాలంలో జిల్లాకు 30 మంది రేషన్ డీలర్లపై తొలి విడతలో భాగంగా వేటు వేయడానికి అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

● ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు
● పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం
● వివిధ రాష్ట్రాల కళా వస్తువుల స్టాల్స్ ఏర్పాటు
● ప్రారంభమైన సారస్ ప్రదర్శనలు
● ఈ నెల 18 వరకు నిర్వహణ
● రేపు సీఎం చంద్రబాబు రాక


విక్రయానికి సిద్ధంగా ఏటికొప్పాక బొమ్మలు


చెక్కతో చేసిన వస్తువులు


వినోదాల మేళా సారస్

గుంటూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వివిధ కళాకృతులతో పాటు వినోదాన్ని పంచేందుకు సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ (సారస్) సిద్ధమైంది. మంగళవారం లాంఛనంగా నల్లపాడు రోడ్డు రెడ్డి కాలేజీ ఎదురు ప్రారంభమైన సారస్-అఖిల భారత డ్వాక్రా బజా ర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ, సారస్‌లో ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంట్లో వివిధ రాష్ట్రాల నుంచి సాంస్కృతిక కళాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా స్థలం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు రుచిని పంచేందుకు విభిన్న రాష్ట్రాల ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని, 600 మందికిపైగా చేనేత, హస్త కళాకారులు వస్తున్నారని చెప్పారు. సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగు తుందన్నారు. వివిధ రాష్ట్రాల హస్త కళలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు ఇక్కడ ఏర్పాటు చేస్తారని చెప్పారు. రాష్ట్రం నుంచి 125 ప్రదర్శనశాలలు, ఇతర రాష్ట్రాల నుంచి మరో 125 ప్రదర్శనశాలలు ఉంటాయని తెలిపారు. 50 స్టాల్స్‌లో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వస్తువులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. నాలెడ్జి పెవిలియన్ ఏర్పాటు చేస్తూ ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై ప్రతి రోజు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారస్‌ను సందర్శించనున్నారని కలెక్టర్ చెప్పారు. అనంతరం సారస్ ప్రాంగణంలో మొబైల్ ఏటీయంను కలెక్టర్ ప్రారంభించారు. ఆరుగురు బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్య టనలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవెన్యూ డివిజ నల్ అధికారి శ్రీనివాసరావు, సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయి కుమార్, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత డ్వాక్రా బజార్ సందర్శించేందుకు గురువారం సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అఖిల భారత డ్వాక్రా బజార్ వద్ద భద్రత, బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణంలో వీవీఐపీ, కాన్వాయ్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాంగణంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్బీ సీఐ ఆళహరి శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


భద్రతా ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్


చెక్కతో జీవం పోసుకున్న బుల్లెట్



సారస్‌లో సందర్శకుల తాకిడి

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 7 జనవరి 2026

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ బిస్కెట్లు... టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా, ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ వారి భారత్‌వాసీ అగర్‌బత్తి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3, 4, 5, 6 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. ప్రతి జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు విజేతలిద్దరు.. మొత్తం 30 మందికి జనవరి 10న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. తెలంగాణలోని 33 జిల్లాల విజేతలకు హైదరాబాద్‌లో జనవరి 12న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.2,40,000కు పైగా బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు నవ్య పాఠకుల కోసం..

సంతూర్ - ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు

ఫైనలిస్టులు వీరే


కె. శ్రీదేవి, కర్ణాటక


ఎన్. భవాని, శ్రీకాకుళం


పి. లావణ్య, పార్వతీపురం మన్యం


టి. సింధుజ, విజయనగరం


కె. భార్గవి, తమిళనాడు


కె. నాగమణి, విశాఖపట్నం


బి. లక్ష్మి, అనకాపల్లి


పి.జగదీశ్వరి, అల్లూరి సీతారామరాజు


ఎస్. రమ్య, పోలవరం


పి. దేవి, కాకినాడ


పి. పావని, తూర్పుగోదావరి


మల్లేశ్వరి, కోనసీమ


గిరి అమ్మాజీ, పశ్చిమగోదావరి



జి.దుర్గాభవాని, ఏలూరు


ఎన్. శాంతి, కృష్ణా


విజయలక్ష్మి, ఎన్టీఆర్ విజయవాడ


కె.చందన, గుంటూరు



కె. శ్రావణి, పల్నాడు


టి. నాగలక్ష్మి, బాపట్ల


ఎం. ప్రత్యూష, ప్రకాశం



కె. పద్మజ, మార్కాపురం


బి. అఖిల, నెల్లూరు


జి.ప్రతిభ, తిరుపతి


ఎ.సునీత, చిత్తూరు


పి. ఇందిర, అన్నమయ్య


పి.సుమలత, కడప


ఎ. జయంతి, నంద్యాల


బి. వసంత, కర్నూలు


ఎస్. సునీత, అనంతపురం


కె. ప్రసన్న లక్ష్మి, శ్రీసత్యసాయి

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,820	1,27,250	2,70,000
విజయవాడ	1,41,000	1,29,000	2,51,000
విశాఖపట్నం	1,41,228	1,27,250	2,71,000
రాజమండ్రి	1,38,820	1,27,250	2,43,000
ప్రొద్దుటూరు	1,41,600	1,30,270	2,52,000
ముంబై	1,36,660	1,25,181	2,43,150

టారిఫికర్‌లోనూ తగ్గేదేలే!

ప్రత్యామ్నాయ మార్కెట్లపై భారత్ దృష్టి.. ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల దెబ్బతో బెంబేలెత్తిన భారత ఎగుమతుల మార్కెట్ ఇపుడిప్పుడే కోలుకుంటోంది. ప్రత్యామ్నాయ మార్కెట్లు చూసుకుంటోంది. అమెరికా స్థాయిలో లేకపోయినా.. ప్రస్తుత కష్టకాలంలో ఈ మార్కెట్లు భారత ఎగుమతులను చాలా వరకు ఆదుకుంటున్నాయి. గత ఏడాది సెప్టెంబరు-నవంబరు మధ్య కాలంలో మన మత్స్య ఎగుమతులే ఇందుకు ఉదాహరణ. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే గత ఏడాది సెప్టెంబరు-నవంబరు కాలంలో మత్స్య ఎగుమతులు 16.8 శాతం పెరిగాయి. చైనా, యూరప్ దేశాలపై దృష్టి పెట్టడడం ఇందుకు ప్రధాన కారణం. ఈ కాలంలో దక్షిణ కొరియాకు ఏకంగా 466.6 శాతం పెరగగా బెల్జియంకు 124.4, మలేషియాకు 81 శాతం, జర్మనీ-నెదర్లాండ్‌కు 56 నుంచి 65 శాతం పెరిగాయి. ఇదే సమయంలో చైనాకు జరిగే మత్స్య ఎగుమతులూ 23 శాతం వరకు పెరిగాయి.

రొయ్యల రైతులకు ఊరట

ట్రంప్ సుంకాల పోటు మన రొయ్యల ఎగుమతులపై పెద్దగా పడలేదని తెలుస్తోంది. 50 శాతం సుంకాల భారం ఉన్నా.. క్రిస్మస్, కొత్త ఏడాది గిరాకీని దృష్టిలో ఉంచుకుని అమెరికా ఎగుమతిదారులు పెద్దఎత్తున రొయ్యలు దిగుమతి చేసుకున్నారు. దాంతో ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల రైతులూ కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు. కిలో రొయ్యలకు రైతులకు లభించే ధర కూడా కౌంట్‌ను బట్టి తేడా రూ.20కి మించి తగ్గలేదు. అయితే మార్చి-ఏప్రిల్‌లో చేతికి వచ్చే రొయ్యల ఎగుమతులు, ధరలు ఎలా ఉంటాయనే దానిపై ఆందోళన నెలకొంది. యూరప్, జపాన్, చైనా, ఆస్ట్రేలియాల నుంచి మంచి డిమాండ్ ఉన్నందున వచ్చే సీజన్‌లో కూడా ధరలకు పెద్దగా ఢోకా ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరితే రొయ్యల ఎగుమతులకు అమెరికాపై అధికంగా ఆధారపడడం తగ్గుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

వస్త్ర, నగల పరిశ్రమలకు కష్టాలు

అమెరికా సుంకాలతో మన దేశం నుంచి ఆ దేశానికి జరిగే వస్త్ర, ఆభరణాల పరిశ్రమలు బాగా దెబ్బతిన్నాయి. గత ఏడాది మే-అక్టోబరు మధ్య కాలంలో వీటి ఎగుమతులు 37 శాతం పడిపోయాయి. ముత్యాలు, రత్నాల ఎగుమతులైతే 78.5 శాతం, పసిడి ఆభరణాల ఎగుమతులు 39 శాతం పడిపోయాయి. దీంతో జెమ్స్ అండ్ జువెలరీ పరిశ్రమలో 1.35 లక్షల మంది, వస్త్ర పరిశ్రమలో 1.5 లక్షల మంది రోడ్డున పడ్డారు. అయితే డాలర్‌తో రూపాయి పతనం, బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఆటుపోట్లు ఇపుడిప్పుడే భారత వస్త్ర పరిశ్రమకు కొద్దిగా కలిసి వస్తున్నాయి. యూరప్, జపాన్ దేశాల నుంచి ఆర్డర్లు పుంజుకుంటున్నట్టు ఎగుమతిదారులు చెబుతున్నారు. అయితే ఈ ఆర్డర్లు అమెరికా స్థాయిలో లేవు. దీంతో ఎంత త్వరగా భారత-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందా అని పరిశ్రమ వర్గాలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నాయి.

2025 సెప్టెంబరు-నవంబరు మధ్య కాలంలో అమెరికాకు తగ్గిన వివిధ ఉత్పత్తుల ఎగుమతులు

ఉత్పత్తి	తగ్గిన %
ముత్యాలు, రత్నాలు	78.5
పసిడి, రత్నాభరణాలు	39.4
కాటన్ వస్త్రాలు, దుస్తులు	23.4
ఎలక్ట్రానిక్ పరికరాలు	19.0
మత్స్య ఎగుమతులు	17.3
ఆటోమొబైల్ విడిభాగాలు	8.9
పారిశ్రామిక యంత్రాలు	7.0
రెడీమేడ్ కాటన్ దుస్తులు	4.6
డ్రగ్స్ అండ్ బయోలాజికల్స్	3.5
ఇనుము, స్టీల్ ఉత్పత్తులు	1.6

స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు జంప్

ట్రంప్ సుంకాల పోటు ప్రభావం స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రికల్ మెషినరీ ఎగుమతులపై మాత్రం పెద్దగా లేదు. నిజానికి గత ఏడాది సెప్టెంబరు-నవంబరు నెలల్లో, అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు 237 శాతం పుంజుకున్నాయి. యాపిల్ ఐఫోన్ల ఎగుమతులు ఇందుకు ప్రధాన కారణంగా ఉన్నాయి.

ఫార్మా ఎగుమతులూ షురూ

ఫార్మా, ఐటీ ఎగుమతులపైనా ట్రంప్ సుంకాల ప్రభావం పెద్దగా లేదు. ఈ రెండింటిపై ఎలాంటి సుంకాలు విధించక పోవడమే ఇందుకు కారణం. అమెరికాలో ఔషధ ధరలు, ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయనే భయంతోనే ట్రంప్ ప్రస్తుతానికి ఈ రెండింటిని సుంకాల నుంచి మినహాయించినట్టు భావిస్తున్నారు. అయినా ఎప్పుడు ఎలాంటి పిడుగులాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఈ రెండు రంగాల కంపెనీలు బిక్కుబిక్కుమంటున్నాయి.

టీఏఎస్ఎల్‌కు సైన్యం నుంచి ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుతం సర్వీసులో ఉన్న తొలి తరం పినాక మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్స్ (ఎంఎల్ఆర్ఎస్), బ్యాటరీ కమాండ్ పోస్టల (బీసీపీ) ఓవర్‌హాల్, అప్‌గ్రేడేషన్‌లో సహకరించేందుకు భారత సైన్యం నుంచి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు (టీఏఎస్ఎల్) ఆర్డర్ లభించింది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలోని ఈ డీల్‌కు అనుగుణంగా టీఏఎస్ఎల్ భారత సైన్యానికి చెందిన 510 అడ్వాన్స్‌డ్ బేస్ వర్క్‌షాప్‌ఎకు (ఏబీడబ్ల్యూ) అవసరమైన విడిభాగాలు సరఫరా చేయడంతో పాటు సాంకేతిక సహకారం సైతం అందించాల్సి ఉంటుంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో సరఫరా ఆర్డర్‌ను తమకు అందచేసినట్టు టీఏఎస్ఎల్ తెలిపింది. పినాక సిస్టమ్స్‌కు అవసరమైన విడిభాగాలు ఓఈఎంల ద్వారా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాల్సి వస్తుందని పేర్కొంది. ఈ కార్యక్రమం తొలి దశలో ఉభయ సంస్థలు ఓవర్‌హాల్ కార్యక్రమాలు ఉమ్మడిగా చేపడతాయి. తదుపరి దశలో మిగతా పినాక ఎల్ఎంఆర్ఎస్, బీసీపీలన్నింటినీ 510 ఏబీడబ్ల్యూ దళాలే స్వయంగా సర్వీసింగ్ చేసుకుంటాయి. టీఏఎస్ఎల్ కీలక విడిభాగాలు సరఫరా చేయడంతో పాటు క్వాలిటీ అష్యూరెన్స్, సాంకేతిక మద్దతు అందించాల్సి ఉంటుంది.

డాక్టర్ రెడ్డీస్ హెపటైటిస్-ఈ వ్యాక్సిన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెపటైటిస్ వ్యాధి చికిత్సలో ఉపయోగించే సరికొత్త రీకాంబినెంట్ వ్యాక్సిన్ హెవాగ్జిన్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. 18-65 సంవత్సరాల మధ్య వయస్కులైన పెద్ద వారికి ఇవ్వడానికి అనువైన, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీజీసీఐ) అనుమతి పొందిన ఏకైక వ్యాక్సిన్ ఇదని తెలిపింది.

● రిలయన్స్ రిటైల్‌కు చెందిన ట్రెండ్స్.. సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ట్రెండ్స్ సంక్రాంతి స్పెషల్‌తో పేరుతో తీసుకువచ్చిన ఈ ఆఫర్‌లో భాగంగా రూ.3,499, అంతకు పైబడి షాపింగ్ చేసిన వినియోగదారులకు అద్భుతమైన బహుమతులను అందించనున్నట్లు తెలిపింది. మెట్రో, మినీ మెట్రోలతో పాటు టియర్ 1,2, పట్టణాల్లో గట్టి పట్టును చేజిక్కించుకునే లక్ష్యంతో కంపెనీ ఈ ఆఫర్లను తీసుకువచ్చింది.

● థింక్ గ్యాస్.. నెల్లూరు, తిరుపతి-చిత్తూరు, వైఎస్ఆర్ కడప-అన్నమయ్య, శ్రీసత్యసాయి-అనంతపూర్‌లో పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) ధరలను ప్రతి స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ (ఎస్‌సీఎం)కు రూ.4 తగ్గించినట్లు ప్రకటించింది. పీఎన్‌జీఆర్‌బీ సవరించిన ధరలకు అనుగుణంగా ఈ తగ్గింపును చేపట్టినట్లు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	585
చిత్తూరు	643	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	157
కరీంనగర్	156	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	153
కర్నూలు	156	నెల్లూరు	158
విశాఖపట్నం	143	అనంతపురం	158
గోదావరి	152		

ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ సింగిల్ ప్రీమియం ప్లాన్

న్యూఢిల్లీ: ఎల్ఐసీ సరికొత్త సింగిల్ ప్రీమియం పాలసీ తీసుకొచ్చింది. 'జీవన్ ఉత్సవ్ సింగిల్ ప్రీమియం' పేరుతో ప్రారంభించిన ఈ పాలసీని సంస్థ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి మంగళవారం విడుదల చేశారు. 30 రోజుల నుంచి 65 ఏళ్ల వయసు వ్యక్తులు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు. ఈ పాలసీ కింద కనీసం 5లక్షలకు బీమా రక్షణ లభిస్తుంది. గరిష్ఠ పరిమితి లేదు. అయితే ఈ గరిష్ఠ పరిమితి తమ బోర్డు ఆమోదానికి లోబడి ఉంటుందని ఎల్ఐసీ తెలిపింది. ఈ పాలసీ ద్వారా ప్రతి రూ.1,000 బీమా హామీకి ఏటా రూ.40 చొప్పున హామీతో కూడిన అదనపు మొత్తం జమవుతుంది.



మార్కెట్లోకి మహీంద్రా 7ఎక్స్‌ఓ

» ప్రారంభ ధర రూ.13.66 లక్షలు

జైసల్మేర్: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. మార్కెట్లోకి సరికొత్త ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ తీసుకువచ్చింది. ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.13.66 లక్షలు (ఎక్స్‌షోరూమ్). డావిన్సీ సస్పెన్షన్ సిస్టమ్, ట్రిపుల్ స్క్రీన్, అడాస్ లెవల్ 2తో దీన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది. పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ ఎస్‌యూవీ డెలివరీలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొంది. 2021లో మార్కెట్లోకి తీసుకువచ్చిన ఎక్స్‌యూవీ 700 ఈ విభాగంలో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించగా తాజాగా విడుదల చేసిన 7ఎక్స్‌ఓకు అదే స్థాయిలో స్పందన వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఎం అండ్ ఎం ఈడీ, సీఈఓ రాజేశ్ జెజురికర్ తెలిపారు.

రిలయన్స్ షేర్లు పడేశాయ్..

» సెన్సెక్స్ 376 పాయింట్లు పతనం

» 26,200 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల పెంపు హెచ్చరికల నేపథ్యంలో మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మంగళవారం ఒక దశలో సెన్సెక్స్ 540 పాయింట్ల మేర పతనమై 85,000 కీలక స్థాయిని సైతం కోల్పోయింది. చివర్లో సూచీ కాస్త కోలుకున్నప్పటికీ, 376.28 పాయింట్ల నష్టంతో 85,063.34 వద్ద ముగిసింది. నిఫ్టీ 71.60 పాయింట్లు కోల్పోయి 26,178.70 వద్ద స్థిరపడింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.21 లక్షల కోట్లు తగ్గి రూ.479.59 లక్షల కోట్లకు పడిపోయింది.

ఆర్ఐఎల్‌కు రూ.లక్ష కోట్ల నష్టం


రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు బీఎస్ఈలో ఒక దశలో 5 శాతం క్షీణించి రూ.1,497.05 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లకు పైగా పతనమైంది. గడిచిన 8 నెలలకు పైగా కాలంలో కంపెనీ షేరుకిది అతిపెద్ద ఇంట్రాడే నష్టం. రిలయన్స్ షేరు మళ్లీ కాస్త కోలుకున్నప్పటికీ, చివరికి 4.42 శాతం నష్టంతో రూ.1,507.70 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.94,388.99 కోట్ల తగ్గుదలతో రూ.20.40 లక్షల కోట్లకు పరిమితమైంది. రష్యా నుంచి మూడు నౌకల ముడి చమురు జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి తరలివస్తోందంటూ బ్లూంబర్గ్‌లో వచ్చిన కథనాన్ని సంస్థ ఖండించింది. దాదాపు 3 వారాలుగా రష్యా నుంచి చమురును అందుకోలేదని, ఈ నెలలోనూ అలాంటి అవకాశం లేదని రిలయన్స్ వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, కంపెనీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది.

ఆఫీసులో కనీసం 6 గంటలు తప్పనిసరి

విప్రో ఉద్యోగులకు నిబంధనలు కఠినతరం

బెంగళూరు: దేశీయ ఐటీ కంపెనీ విప్రో తన ఉద్యోగులకు ఆఫీసు నుంచి పని (వర్క్ ఫ్రమ్ ఆఫీస్) నిబంధనలను మరింత కఠినతరం చేసింది. కొద్దికాలం క్రితమే వారంలో మూడు రోజులు ఆఫీసు నుంచి పని చేయడం తప్పనిసరి చేసిన కంపెనీ.. ఈ నెల 1 నుంచి ఆఫీసులో కనీసం 6 గంటలు పని చేయడం తప్పనిసరి చేసింది. ఇందుకు సంబంధించి కంపెనీ మానవ వనరుల (హెచ్‌ఆర్) డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఇప్పటికే ఈ-మెయిల్ పంపినట్లు ఓ ఆంగ్ల మీడియా సంస్థ తన కథనంలో వెల్లడించింది. రోజులో మొత్తం 9.5 గంటలు పనిచేయాల్సి ఉంటుందని, ఆఫీసులో 6 గంటలు పనిచేసిన రోజు మిగతా 3.5 గంటలు అదే రోజు ఇంటి నుంచి పనిచేయాల్సి ఉంటుందని, అప్పగించిన పనిని పూర్తి చేయాల్సి ఉంటుందని ఈ-మెయిల్‌లో కంపెనీ స్పష్టం చేసింది.

స్పోర్ట్స్



ఆయుష్ అదిరెన్!

- ఒలింపిక్ పతక విజేతకు షాకిచ్చిన భారత షట్లర్
- మలేసియా ఓపెన్‌లో లక్ష్య సేన్ ముందంజ

కౌలాలంపూర్: భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి మలేసియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. స్థానిక ఆటగాడు, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జి జియాకు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. మంగళవారం జరిగిన సింగిల్స్ ఆరంభ రౌండ్లో 20 ఏళ్ల ఆయుష్ 21-12, 21-17తో ప్రపంచ మాజీ రెండో ర్యాంకర్ లీ జి జియాను వరుస గేముల్లో చిత్తుచేశాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఆయుష్.. కేవలం అరగంటలోనే ప్రత్యర్థిని ఇంటిబాట పట్టించాడు. మరో భారత స్టార్ లక్ష్య సేన్ 21-16, 15-21, 21-14తో జియా హెంగ్ జాసన్ (సింగపూర్)ను ఓడించాడు. మిగతా భారత షట్లర్లలో సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 11-21, 11-21తో రచనోక్ ఇంటనాన్ (థాయ్‌లాండ్) చేతిలో, పురుషుల డబుల్స్‌లో అర్జున్/హరిహరన్ జోడీ 10-21, 20-22తో జపాన్ జంట హిరోకి/యమషిత చేతిలో ఓటమిపాలై తొలిరౌండ్లోనే వెనుదిరిగారు.

హెడ్, స్మిత్ శతకాలు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 518/7 ● ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్



హెడ్ (163)



స్మిత్ (129)


సిడ్నీ: ట్రావిస్ హెడ్ (163), స్టీవ్ స్మిత్ (129) సెంచరీలతో అదరగొట్టడంతో.. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో, ఆఖరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 134 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. ఆటకు మూడో రోజైన మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 166/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 7 వికెట్లకు 518 పరుగులు చేసింది. కార్స్ మూడు, స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టారు. క్రితం రోజు బ్యాటర్ హెడ్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. కెరీర్‌లో చివరి టెస్ట్ ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా (17) స్వల్ప స్కోరుకే కార్స్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకు ఆలౌటైంది.

బ్యాటే ఆయుధంగా..

రెండో సీజన్‌లో విజేతగా నిలిచిన ఉత్సాహంతో గతేడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగింది. కానీ ఆ సీజన్ స్మృతి మంధాన నేతృత్వంలోని ఆర్‌సీబీకి చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదింటిలో ఓడి.. ప్లేఆఫ్స్‌లో కూడా అడుగుపెట్టలేకపోయింది. అందుకే తాజా నాలుగో సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ కమ్‌బ్యాక్ ఘనంగా ఉండాలనుకుంటోంది.

బరిలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

డబ్ల్యూపీఎల్ 2 రోజుల్లో



బ్యాటింగ్, ఫినిషింగ్ అదుర్స్: ఆర్‌సీబీకి తమ బ్యాటింగ్ ఆర్డర్ ప్రధాన ఆయుధంగా చెప్పవచ్చు. స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు జతగా జార్జియా వాల్ బరిలోకి దిగనుంది. ఇక మిడిలార్డర్ అద్భుత ఫినిషర్లతో పటిష్ఠంగా కనిపిస్తోంది. కీపర్ రిచా ఘోష్ హిట్టింగ్ ఎలా ఉంటుందో అభిమానులకు తెలిసిందే. ఇటీవలి వన్డే వరల్డ్ కప్‌లో ఇప్పటికే నిరూపించుకుంది. అటు గ్రేస్ హ్యారిస్, డిక్లెర్క్ స్ట్రోక్ ప్లేతో బౌలర్లకు కష్టకాలం తప్పదు. వీరికి తోడు స్పిన్ రిజర్వ్ బలం అదనం కానుంది. శ్రేయాంక పాటిల్, ప్రేమ్ రావత్, రాధా యాదవ్, లిన్సే స్మిత్ రూపంలో పరిస్థితులకు తగ్గట్టు బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉండనున్నారు.

ఎలిస్ పెర్రీ దూరంతో..

గత మూడు సీజన్లలో ఆర్‌సీబీ తరఫున ఎలిస్ పెర్రీ అత్యంత కీలకంగా వ్యవహరించింది. నిలకడతో పాటు అవసరమైనప్పుడు దూకుడుగా ఆడేస్తూ జట్టుకు భారీ స్కోర్లు అందించడమే కాకుండా.. పేసర్‌గానూ సేవలందించింది. కానీ ఈ సీజన్‌కు ఆమె వ్యక్తిగత కారణాలతో దూరం కాబోతుండడం జట్టుకు అతిపెద్ద షాక్ అనే భావించాలి. ఇప్పుడు వన్‌డౌన్‌లో పెర్రీ స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. హేమలత, గౌతమీ నాయక్ పోటీలో ఉన్నారు. దీనికితోడు పేసర్ పూజా వస్త్రాకర్ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేకపోవడంతో అరుంధతి రెడ్డిపై అధిక భారం పడనుంది.

జట్టు:
స్వదేశీ: స్మృతి మంధాన (కెప్టెన్), రిచా ఘోష్, సయాలి సత్ఘరే, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, ప్రేమా రావత్, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్, గౌతమి నాయక్, ప్రత్యూష, హేమలత.
విదేశీ: జార్జియా వాల్, నాడిన్ డి క్లెర్క్, లారెన్ బెల్, లిన్సే స్మిత్, గ్రేస్ హ్యారిస్.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జనవరి 9	ముంబై	నవీ ముంబై
జనవరి 12	యూపీ	నవీ ముంబై
జనవరి 16	గుజరాత్	నవీ ముంబై
జనవరి 17	ఢిల్లీ	నవీ ముంబై
జనవరి 19	గుజరాత్	వడోదర
జనవరి 24	ఢిల్లీ	వడోదర
జనవరి 26	ముంబై	వడోదర
జనవరి 29	యూపీ	వడోదర



అమన్ (200 నాటౌట్)

అమన్ డబుల్

బెంగాల్‌పై హైదరాబాద్ విజయం
విజయ్ హజారే ట్రోఫీ

రాజ్‌కోట్: హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావు (154 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్సర్లతో 200 నాటౌట్) అజేయ డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. దీంతో విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా మంగళవారం బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 107 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. కరీంనగర్‌కు చెందిన అమన్‌కు ఇది కేవలం మూడో లిస్ట్-ఎ మ్యాచ్ కాగా, హైదరాబాద్ తరపున ఈ ఫార్మాట్‌లో డబుల్ బాదిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ అమన్ ధాటికి 50 ఓవర్లలో 352/5 స్కోరు సాధించింది. రాహుల్ సింగ్ (65), తిలక్ (34) రాణించారు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అమన్ 108 బంతుల్లో సెంచరీ సాధించగా.. మరో శతకం కేవలం 46 బంతుల్లోనే పూర్తి చేశాడు. ఈక్రమంలో తను ఇన్నింగ్స్ చివరి బంతికి సిక్సర్ బాది అజేయ డబుల్ సెంచరీని పూర్తి చేయడం విశేషం. అలాగే షమి, ముకేశ్, ఆకాశ్ దీప్, షాబాజ్ అహ్మద్ ఓవర్లలో చెలరేగిన అమన్ 120 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాత బెంగాల్ ఛేదనలో పేసర్ సిరాజ్ (4/58) ధాటికి 44.4 ఓవర్లలో 245 పరుగులకు పరిమితమైంది. షాబాజ్ అహ్మద్ (108 నాటౌట్) మాత్రమే రాణించాడు.

భారత క్రీడారంగ దిక్సూచి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు, మంగళవారం కన్నుమూసిన సురేశ్ కల్మాడీ దాదాపు రెండు దశాబ్దాల పాటు భారత క్రీడారంగంపై చెరగని ముద్ర వేశారు. కల్మాడీ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడిగా 1996 నుంచి 2011 వరకు సుదీర్ఘకాలం సేవలందించారు. అంతేకాకుండా ఆయన ఆధ్వర్యంలోనే ఎన్నో అంతర్జాతీయ ఈవెంట్లకు భారత్ ఆతిథ్యమివ్వగలిగింది. 1989, 2013 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్, 2003 ఆఫ్రో-ఆసియన్ గేమ్స్, 2008 కామన్వెల్త్ యూత్ గేమ్స్, 2010 కామన్వెల్త్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. అయితే కామన్వెల్త్ గేమ్స్‌లో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు రావడం ఆయన జీవితంతో మాయని మచ్చగా చెప్పవచ్చు. దీంతో దేశవ్యాప్తంగా కల్మాడీపై విమర్శలు పెరిగాయి. ఇదే కారణంగా అరెస్ట్ కావడంతో అతను 2011లో ఐఓఏ చీఫ్ పదవి నుంచి వైదొలిగారు. కానీ గతేడాది ఏప్రిల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తుది నివేదికలో కల్మాడీకి క్లీన్‌చిట్ ఇచ్చింది. అటు క్రీడా పరిపాలకుడిగా కల్మాడీ చేసిన సేవలు మరువరానివి. జాతీయ క్రీడలను పునరుద్ధరించి వరుస విరామాల్లో దేశంలోని వివిధ నగరాల్లో నిర్వహించారు. అంతేకాకుండా 1987 నుంచి 2006 వరకు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అధ్యక్షుడిగా 19 ఏళ్ల పాటు విశేష సేవలందించారు.



కల్మాడీ సేవలు అమూల్యం: పీటీ ఉష

కల్మాడీ మృతిపై దేశ క్రీడా రంగ ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. భారత్‌లో ఒలింపిక్ ఉద్యమానికి ఇది అతి పెద్ద విఘాతమని వ్యాఖ్యానించారు. 'మాజీ ఐఓఏ అధ్యక్షుడు సురేశ్ కల్మాడీ మృతి విచారకరం. ఏఎఫ్ఐ చీఫ్‌గా దేశంలో అథ్లెటిక్స్ అభివృద్ధికి తోడ్పడ్డారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి' అని ప్రస్తుత ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన షూటర్ అభినవ్ బింద్రా కూడా సంతాపాన్ని వెలిబుచ్చాడు.

కోల్‌కతాలో మంగళవారం జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీ డ్రా కార్యక్రమంలో దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, అర్జున్, ప్రజ్ఞానంద సహా ఇతర ఆటగాళ్లు. ఈ మెగా టోర్నీ బుధవారం మొదలవనుంది.



ఆంధ్రతో హరియాణా మ్యాచ్ టై

- జ్ఞానేశ్వర్ అజేయ శతకం
- రాజుకు 5 వికెట్లు

ఆలూర్ (కర్ణాటక): ఆంధ్ర ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (142 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. హరియాణాతో జరిగిన వన్డే మ్యాచ్ టైగా ముగిసింది. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హరియాణా 49.5 ఓవర్లలో 324 పరుగుల భారీ స్కోరు సాధించింది. హిమాన్షు రాణా (112) శతకం, మయాంక్ శాండిల్య (75) అర్ధసెంచరీ సాధించారు. సత్యనారాయణ రాజుకు ఐదు, రామ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత వెలుతురులేమి కారణంగా వీజేడీ పద్ధతిన ఆంధ్ర ఛేదనను 48 ఓవర్లలో 308 పరుగులుగా నిర్ణయించారు. దీంతో ఓపెనర్లు జ్ఞానేశ్వర్-కేఎస్ భరత్ (70) చెలరేగి తొలి వికెట్‌కు 138 పరుగులు జత చేశారు. చివరి బంతికి స్కోరు 307 పరుగులు కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. అన్షుల్‌కు మూడు, సమంత్‌కు రెండు వికెట్లు దక్కాయి.

రన్నరప్.. అనహత్



బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్

న్యూఢిల్లీ: భారత స్క్వాష్ టీనేజ్ సంచలనం, 17 ఏళ్ల అనహత్ సింగ్ బ్రిటిష్ జూనియర్ ఓపెన్‌లో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. బర్మింగ్‌హామ్‌లో ఆదివారం జరిగిన అండర్-19 మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ లారెన్ బల్తయాన్ (ఫ్రాన్స్) 11-9, 7-11, 11-3, 11-9తో టాప్‌సీడ్ అనహత్‌ను ఓడించి విజేతగా నిలిచింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతకు రూ. 25 కోట్లు

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీని భారీగా పెంచారు. పురుషులు, మహిళల విజేతలకు చెరి రూ. 25.14 కోట్ల నగదు బహుమతి దక్కనుంది. గతేడాదితో పోల్చితే ఇది 19 శాతం అదనం. కాగా, ఓవరాల్‌గా ప్రైజ్‌మనీని 2025 కంటే 16 శాతం మేర పెంచినట్టు నిర్వాహకులు తెలిపారు. గతేడాది ప్రైజ్‌పూల్ సుమారు రూ. 584 కోట్లు కాగా.. ఈ సీజన్‌లో అది రూ. 675 కోట్లకు చేరింది. టోర్నీ ఈ నెల 18 నుంచి జరగనుంది.

యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టండి

- అంటువ్యాధుల నివారణకు టాస్క్‌ఫోర్స్ సూచనలు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వా, యాంటీ అడల్ట్ ఆపరేషన్లను చేపట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా.అనురాధ సూచించారు. రాష్ట్రంలో అంటువ్యాధుల (డెంగీ, మలేరియా, టైఫాయిడ్) నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనల కోసం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ తొలి సమావేశం మంగళవారం వర్చువల్‌గా జరిగింది. టాస్క్‌ఫోర్స్ సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. డా.అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కుక్కకాట్ల వల్ల జరిగిన మరణాలపై అధ్యయనం చేయాలన్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డా.రంగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వసతి గృహాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. కర్ణాటకలోని కస్తూర్బా మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ చిరంజయ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందుగానే గ్రామాల్లో ప్రత్యేకంగా ఫీవర్ క్లినిక్‌లు నిర్వహించాలన్నారు. ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ నిపుణుల సూచనపై దృష్టిపెట్టి, నాలుగు వారాల్లో చర్యలు తీసుకుంటామన్నారు.

220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో 220 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మెడికల్ సర్వీసెస్ నియామకాల బోర్డు సెక్రటరీ శేషారెడ్డి నోటిఫికేషన్ జారీచేశారు. బోధనాసుపత్రుల్లో అవసరమైన క్లినికల్, నాన్-క్లినికల్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. రెగ్యులర్ ప్రాతిపదికనే ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

16న బ్యాంకులకు సెలవు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని బ్యాంకులు, బ్యాంక్ అనుబంధ సంస్థలకు ఈనెల 16న సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం బ్యాంకులకు ఇచ్చిన సెలవుల జాబితాలో జనవరి 16 లేదు. బ్యాంకు సంఘాల విన్నపం మేరకు ప్రభుత్వం తాజాగా కనుమ రోజు సెలవుగా ప్రకటించింది.

కునిటిమల్లారెడ్డి కాదు... కుంటిమల్లారెడ్డి

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతికి (ఈబీసీ) చెందిన కునిటిమల్లారెడ్డి కులం పేరును కుంటిమల్లారెడ్డిగా మారుస్తూ ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈబీసీలోని 308 కులాల మాస్టర్ జాబితాలో 153వ కులంగా కునిటిమల్లారెడ్డి కులం నమోదైంది. కుంటిమల్లారెడ్డి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కత్తి వెంకటసుబ్బారెడ్డి విజ్ఞప్తి మేరకు కుంటిమల్లారెడ్డి కులానికి సంబంధించి స్పెల్లింగ్ తప్పుగా పడిందని, దానిని సవరించాలని ఈబీసీ ఎండీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆమేరకు సవరణ చేస్తూ ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ ఉత్తర్వు జారీ చేసింది.

ఎస్సీ కమిషన్ సభ్యుల నియామకం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి జవహర్‌ను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కమిషన్ సభ్యులుగా ఐదుగురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీతారాం రవడ(పాలకొండ నియోజకవర్గం), డాక్టర్ బాబు శ్రీపతి(సూళ్లూరుపేట), బిక్షం మేకల(మాచర్ల), డాక్టర్ పాకంటి గౌతమ్‌రాజ్(ఎర్రగొండపాలెం), రామాంజనమ్మ(హిందూపూర్)లను నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

కనకమేడలకు కేంద్ర మంత్రి రామ్మోహన్ అభినందనలు

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఇటీవల నియమితులైన కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందనలు తెలిపారు. మంగళవారం, ఈ మేరకు కనకమేడలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

50% పచ్చపచ్చగా!

తీరానికి హరిత హారం

- సమీప ప్రాంతాలకు రక్షణ ఛత్రం
- గ్రేట్ గ్రీన్ వాల్, గ్రీన్ కవర్‌కు నెలాఖరులోగా రూట్ మ్యాప్
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు


అటవీ శాఖ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్, అధికారులు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తీర ప్రాంతాలు హరిత వనాలుగా మారనున్నాయి. ఇవి సమీప ప్రాంతాలకు ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కూడా కల్పించనున్నాయి. ఈ నేపథ్యంలో తీర ప్రాంత అడవుల రక్షణ, ఆక్రమణల నిరోధానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ, 50% గ్రీన్ కవర్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని నిర్దేశించారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, ఈ నెలాఖరులోగా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో అటవీశాఖ లక్ష్యాలు, పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. తీర ప్రాంతంలో మొక్కల భద్రత, అటవీ భూముల సంరక్షణ బాధ్యతను సమీపంలో నివసించే వారికి అప్పగించాలన్నారు. 974 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని విపత్తుల నుంచి రక్షించడంతో పాటు రాష్ట్రాన్ని 50% పచ్చదనంతో నింపాలని సీఎం చంద్రబాబు చేసిన నిర్దేశం మేరకు 'గ్రీన్ కవర్' ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలన్నారు. "అన్ని ప్రభుత్వ శాఖలతో కలసి టాస్క్‌ఫోర్స్ పని చేయాలి. తీర ప్రాంతంలో 5 కిలోమీటర్ల వెడల్పున మడ, సరుగుడు, తాటి చెట్లతో పచ్చదనం ఉండేలా చూడాలి. ఇప్పటికే 420 కిలోమీటర్ల పరిధిలో 500 మీటర్ల వెడల్పున అటవీశాఖ మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు చేపడుతోంది. మిగిలిన భూముల్లో.. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలో ఉన్న భూమి ఎంత? అటవీశాఖ పరిధిలో ఎంత ఉంది? ప్రైవేట్ సంస్థలు, వ్యక్తుల చేతుల్లో ఎంత భూమి ఉందో అధ్యయనం చేయాలి. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌ను మూడు దశల్లో ముందుకు తీసుకెళ్లాలి." అని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

దశల వారీగా..

మొదటి దశలో కోస్తా ప్రాంతాన్ని ఆనుకుని ఉండే మొత్తం విస్తీర్ణంలో మొక్కలు పెంచాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రెండో దశలో తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న కాలువలు, రోడ్లు, డొంకల వెంట మొక్కలు నాటాలన్నారు. చివరి దశలో వ్యవసాయ భూముల్లోనూ రైతులకు ఉపయోగపడేలా మొక్కలు పెంచాలని సూచించారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్, సీఎస్ఆర్, వీబీ జీ-రామ్‌జీ పథకం నిధులతో మొక్కలు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో స్థానికులను భాగస్వామ్యం చేయాలన్నారు. 50% గ్రీన్ కవర్ ప్రాజెక్టులో మొక్కలు నాటేందుకు అనుకూల ప్రాంతాలను గుర్తించాలని, దీనికోసం జిల్లాల వారీగా సంబంధిత శాఖలను కలెక్టర్లు సమన్వయం చేయాలని సూచించారు. గ్రేట్ గ్రీన్ వాల్, గ్రీన్ కవర్ పనుల్లో కచ్చితమైన పురోగతి కనిపించాలన్నారు. "రాష్ట్రంలో 10 వేల ఎకరాల్లో నోటిఫై కాని మడ అడవులు ఉన్నట్లు శాటిలైట్ చిత్రాలతో గుర్తించాం. ఈ మొత్తాన్నీ నోటిఫై చేసి, అటవీశాఖకు అప్పగించే చర్యలు తీసుకుంటాం. ముందుగా ఆ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి. మడ అడవుల రక్షణ, గ్రేట్ గ్రీన్ వాల్, గ్రీన్ కవర్‌పై తీర ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక అవగాహన కల్పించాలి. శాఖల వారీగా సమీక్షలు జరపాలి. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలి." అని పవన్ నిర్దేశించారు. ఈ సమీక్షలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సలహాదారు మల్లికార్జునరావు, పీసీసీఎఫ్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల్లో తప్పులు జగన్ పాపమే!

- ఇప్పటికీ అవి వెంటాడుతున్నాయి
- నయానో, భయానో సిబ్బందిని అనుకూలంగా మార్చుకుని ఇష్టానుసారం రీసర్వే
- అన్ని సమస్యలనూ పరిష్కరిస్తున్నాం
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో రీ సర్వేను తప్పులతడకగా నిర్వహించడమే నేడు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు ప్రధాన కారణమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. భూముల సర్వే సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తలు... క్షేత్రస్థాయి సిబ్బందిని నయానో, భయానో తమకు అనుకూలంగా మార్చుకొన్నారని, దానివల్లే రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ హయాంలో జరిగిన రీ సర్వేపై 6,688 గ్రామాల్లో సభలు పెడితే తమ సమస్యలు పరిష్కరించాలని 7.50 లక్షల మంది రైతులు పిటిషన్లు ఇచ్చారని అనగాని తెలిపారు. గ్రామసభల అనంతరం కూడా రీ సర్వే తప్పులపై ప్రభుత్వానికి రైతుల నుంచి అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ పిటిషన్లన్నీ పరిష్కరిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి అనగాని ఓ ప్రకటనలో భరోసా ఇచ్చారు. పాస్ పుస్తకాల్లో తప్పులు, రీ సర్వేపై రైతుల ఆందోళన వంటి అంశాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు వెలువరిస్తున్న నేపథ్యంలో ఆయన పలు అంశాలను ఆ ప్రకటనలో ప్రస్తావించారు. "రీ సర్వే సమయంలో రైతులకు ముందుగా సమాచారం ఇవ్వలేదు. రైతుల సమక్షంలో భూమిని కొలవలేదు. సర్వేను సమగ్రంగా చేపట్టకపోవడంతో పాటు, డేటా ఎంట్రీ కూడా శాస్త్రీయంగా చేయలేదు. సరిహద్దు రైతులను భాగస్వాములను చేయలేదు. ఆ రీ సర్వే ఆధారంగా 4,783 గ్రామాల్లో పంపిణీ చేసిన భూ హక్కుపత్రాల్లో అనేక తప్పులు దొర్లాయి" అన్నారు.

తేడాలొస్తే మళ్లీ సర్వే కోరవచ్చు

కూటమి ప్రభుత్వం రీ సర్వే 2.0ను పకడ్బందీగా నిర్వహిస్తోందని మంత్రి అనగాని వివరించారు. "గ్రామంలో రైతులకు నోటీసు ఇచ్చి, వారి సమక్షంలోనే భూముల సర్వే జరుగుతోంది. రైతులు అందుబాటులో లేకుంటే వీడియో కాల్ ద్వారా వివరాలు తీసుకోవడం, సమాచారం ఇవ్వడం జరుగుతోంది" అని వివరించారు. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, సరిగ్గా కొలతలు వేయలేదని భావించినా, మరోసారి సర్వే చేయాలని తిరిగి దరఖాస్తు చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. దశాబ్దాలుగా రెవెన్యూవ్యవస్థ అనేక చిక్కుముడులతో ఉందని, జగన్ పాలన దాన్ని మరింత సంక్లిష్టం చేసిందని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తోందని, ఇప్పటికే అనేక సంస్కరణలను అమలుచేసిందని వివరించారు. జగన్ చేసిన పాపాలు రెవెన్యూవ్యవస్థను ఇంకా వెంటాడుతున్నాయని మంత్రి తెలిపారు.

నేటి పరిస్థితికి కేంద్ర కమిటీ వైఫల్యమే కారణం

- సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదు
- ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలోనూ విఫలమే
- గణపతి, తిరుపతి ఎక్కడున్నారో నాకు తెలియదు
- నేను లొంగిపోలేదు.. పోలీసులు పట్టుకున్నారు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పీఎల్‌జీఏ కమాండర్ బడ్సే దేవా

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రస్తుత పరిస్థితికి సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్ర కమిటీ వైఫల్యమే అంతిమ కారణంగా తాను భావిస్తున్నానని తెలంగాణ పోలీసుల ముందు ఇటీవల లొంగిపోయిన పీఎల్‌జీఏ కమాండర్ బడ్సే దేవా వ్యాఖ్యానించారు. "ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం భీకరమైన పోరాటం ప్రారంభించిన తర్వాత తదుపరి ఏం చేయాలన్న విషయమై పార్టీలో వివిధ స్థాయుల్లో చర్చ జరిగింది. ఆపరేషన్ కగార్‌తో ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు పెరిగాయి. నేటి పరిస్థితికి అదొక కారణం. ఉద్యమాన్ని ముందుకు తీసుకుని వెళ్లడంతో పార్టీ కేంద్ర కమిటీ విఫలమైందని నేను భావిస్తున్నాను" అని ఆయన చెప్పారు. ఇటీవల లొంగిపోయిన ఆయన 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి'కి సోమవారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైన గణపతి, దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతిని తానీ మధ్య కలవలేదని, వారెక్కడ ఉన్నారో కూడా తనకు తెలియదని తెలిపారు. మావోయిస్టు పార్టీలో బతికి ఉన్నవారు తమ నిర్ణయం తాము తీసుకుంటారని, ఆశన్న, సోనూ లొంగుబాటుపై తానేమీ మాట్లాడనని అన్నారు. "మావోయిస్టు పార్టీలోకి నన్నెవ్వరూ తీసుకుని రాలేదు. నేనే స్వయంగా వచ్చాను. హిడ్మాది, నాది ఒకటే గ్రామం. గతేడాది అక్టోబరు 27వ తేదీ వరకు నేను, హిడ్మా, ఇతర దళ సభ్యులు తెలంగాణ, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోనే ఉన్నాం. తర్వాత హిడ్మా వేరే పనిమీద వెళ్లిపోయారు. కొన్నాళ్లకు హిడ్మా మరణ వార్తను రేడియో, పత్రికల ద్వారా తెలుసుకున్నాను" అని దేవా తెలిపారు. హిడ్మా ఎందుకు వెళ్లాడు? ఎక్కడ పోలీసులకు పట్టుబడ్డాడు? ఏం జరిగిందనే విషయం తనకేమాత్రం తెలియదని చెప్పారు. హిడ్మాతో కలిసున్న సమయంలో తమ మధ్య సరెండర్లకు సంబంధించిన చర్చ జరగలేదన్నారు. "నేను ఓ పనిమీద బొలేరో వాహనంలో వెళ్తున్నప్పుడు పోలీసులు పట్టుకున్నారు. ఆ తర్వాత పరిస్థితులను పోలీసులు వివరించడంతో నేను మనసు మార్చుకుని లొంగిపోయాను" అని వివరించారు. అంతే తప్ప తనంతట తాను లొంగిపోలేదని తెలిపారు. తన వద్ద ఉన్న డైరీలో డంప్‌కు సంబంధించిన సమాచారం ఉందని, దాని ఆధారంగానే టవర్, తదితర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. టవర్ ఆయుధాన్ని 2014లో పోలీసులపై జరిగిన దాడిలో తాము స్వాధీనం చేసుకున్నామని, హెలికాప్టర్ షాట్స్ తమ టెక్నికల్ టీం తయారు చేసిందని, వాటిని తానెప్పుడు వాడలేదని స్పష్టం చేశారు. తన లొంగుబాటు గురించి పార్టీకి తన నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వలేకపోయానని అంగీకరించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

హైకోర్టుకు 'జన నాయగన్' సెన్సార్ పంచాయితీ



విజయ్ - పూజా హెగ్డే జంటగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన 'జన నాయగన్' చిత్రంలోని కొన్ని దృశ్యాలకు సెన్సార్‌బోర్డు అభ్యంతరం తెలపడంతో నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగనుంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే, ఈ మూవీని చూసిన సెన్సార్ కమిటీ.. కొన్ని సన్నివేశాలను తొలగించాలని, మూవీలోని రాజకీయ డైలాగులను మ్యూట్ చేయాలని షరతు విధించింది. ఈ మార్పులు చేసి సమర్పించినప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ జారీలో జాప్యమవుతోంది. ఈ పిటిషన్‌ను మంగళవారం స్వీకరించిన కోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. దీంతో కోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



అరుదైన ఘనత

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ఓ అరుదైన ఘనత సాధించింది. ఇటీవలె పారిస్‌లోని ప్రఖ్యాత లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఇక్కడ ప్రదర్శించడం గమనార్హం. అయితే విడుదలకు ముందే ఓ భారతీయ సినిమా గ్లింప్స్‌ను ఈ థియేటర్‌లో ప్రదర్శించడం మాత్రం ఇదే ప్రథమం. ఈ టీజర్‌కు విశేషమైన ఆదరణ దక్కిందని ఆ థియేటర్ యాజమాన్యం తన సోషల్ మీడియా ఖాతాలో సంబంధిత విజువల్స్‌ను షేర్ చేసింది. కాగా ఇప్పటికే శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 9న శ్రీరామనవమి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపు 120 దేశాల్లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఇందులో రుద్ర అనే శక్తిమంతమైన పాత్రలో మహేశ్ కనిపించనున్నారు. ఈ చిత్రం కోసం ఆయన ప్రత్యేకంగా కలరిపయట్టు అనే ప్రాచీన భారతీయ యుద్ధకళలో తర్ఫీదు పొందారు. ప్రియాంక చోప్రా మందాకినిగా, పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభగా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ. 1300 కోట్ల భారీ బడ్జెట్‌తో కె.ఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పక్కా సంక్రాంతి సినిమా

- సుస్మిత కొణిదెల, సాహు గారపాటి



"మన శంకర వరప్రసాద్ చిత్రంలో ప్రేక్షకులు వింటేజ్ మెగాస్టార్‌ను చూస్తారు. ఇది పిల్లలు, పెద్దలు కలసి చూసే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చిరంజీవి-వెంకటేశ్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి" అని నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి అన్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన చిత్రమిది. వెంకటేశ్ కీలకపాత్ర పోషించారు. నయనతార కథానాయిక. ఈ నెల 12న విడుదలవుతోన్న సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించారు. సుస్మిత కొణిదెల మాట్లాడుతూ 'నిర్మాతగా ఇది నా కెరీర్‌లో మైలురాయి లాంటి ప్రాజెక్ట్. నాన్న గారితో ఇలాంటి మంచి సినిమా చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమాతో నాన్నగారు (చిరంజీవి) తనలోని ఒక కొత్త టాలెంట్ బాక్స్‌ను ఓపెన్ చేసినట్లుగా అనిపించింది. 'రౌడీ అల్లుడు' సినిమాలో చూసినట్లుగా ఆ వింటేజ్ ఛార్మ్‌ని గుర్తు చేస్తూనే, ఇందులో ఆయన నటన చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఈ పాత్ర కోసం ఆయన బరువు తగ్గి ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టారు. చిరంజీవి గారిని ఒక కొత్త స్టైల్‌లో చూపించాలనే విజన్‌తో అనిల్ రావిపూడి పనిచేశారు. చిరంజీవి గారికి చిన్న సర్జరీ జరిగిదంటూ జరుగుతున్న ప్రచారం గురించి నాకు తెలియదు. ఆయన కొన్ని రోజులుగా సినిమా ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు' అని చెప్పారు సాహు గారపాటి మాట్లాడుతూ 'తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి సినిమాలంటే ఇష్టం. ఆయనకు తప్పకుండా మా సినిమా చూపిస్తాం. టికెట్ ధరల పెంపు విషయంలో చట్టం పరిధికి లోబడి ప్రభుత్వం చేయాల్సినంత చేస్తోంది. ఈ సినిమాలో చిరంజీవి గారు కొత్త ఎనర్జీతో కనిపిస్తారు. అలాగే వెంకటేశ్ గారి పాత్ర చాలా కీలకం. ఇది పక్కా సంక్రాంతి సినిమా. చాలా రిచ్‌గా, వినోదాత్మకంగా ఉంటుంది. కుటుంబంతో కలసి చూసేలా ఉందని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు' అని పేర్కొన్నారు.

మాస్ హీరోయిన్ గుర్తింపు ఆనందాన్నిచ్చింది



కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మార్క్' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమై, తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు నటి దీప్షిక చంద్రన్. ఈ చిత్రం విజయవంతమైన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సినిమాలో తన పాత్రకు ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ప్రశంసలకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కెరీర్ ప్రారంభంలోనే తనకు 'మాస్ హీరోయిన్' గుర్తింపు రావడం సంతోషాన్నిచ్చిందని తెలిపారు. తన పాత్రను పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తూ నటించాననీ, భవిష్యత్‌లోనూ నటనకు సవాల్ విసిరే వైవిధ్యమైన పాత్రలు పోషించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రేమకథలతో పాటు బలమైన నాయిక ప్రాధాన్య పాత్రలు చేయాలనుకుంటున్నాను అని దీప్షిక చెప్పారు.

నటుడు సురేశ్‌కుమార్ ఆకస్మిక మరణం



పలు భాషా చిత్రాల్లో నటించిన సురేశ్‌కుమార్ గుండెపోటుతో ముంబైలో కన్ను మూశారు. యుక్త వయసు నుండి పలు నాటకాల్లో నటించిన ఆయన టీవీ, సినిమాల్లో కూడా విభిన్న పాత్రలు పోషించారు. తెలుగులో 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు', 'మహానటి', 'గోల్కొండ హై స్కూల్' తదితర చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు'లో పి.వి.నరసింహారావు పాత్ర పోషించారు. అమితాబ్ సహా పలువురు బాలీవుడ్ తారల చిత్రాల్లో నటించారు. బ్యాంకింగ్ రంగ నిపుణుడైన సురేశ్‌కుమార్ 'హిందూ' దినపత్రికకు కల్చరల్ రిపోర్టర్‌గా కూడా పని చేశారు. కొంతకాలంగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి ముంబైలో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు బయలుదేరుతున్న సమయంలో గుండె పోటు రావడంతో కన్ను మూశారు. సురేశ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు.

టికెట్ ధరలు పెంచుకునే అవకాశం ఇవ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన 'మన శంకరవరప్రసాద్' నిర్మాణ సంస్థ

చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా టికెట్ ధరలు పెంచుకోవడానికి అవకాశం ఇవ్వాలని.. ఈ మేరకు తమ విజ్ఞప్తిని చట్టప్రకారం పరిశీలించేలా హోంశాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీచేయాలని పేర్కొంటూ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ ఎల్ఎల్‌పీ హైకోర్టులో రిట్ అప్పీల్ దాఖలు చేసింది. ఇది భారీ బడ్జెట్‌తో నిర్మించిన సినిమా అయినందున టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వకపోతే నిర్మాతలతోపాటు సినీపరిశ్రమ, ఇతర కార్మికులకు సైతం భారీ నష్టం కలుగుతుందని నిర్మాణ సంస్థ పేర్కొంది. టికెట్ ధర పెంపు, బెనిఫిట్ షోకు అనుమతి ఇవ్వాలని ఇప్పటికే హోంశాఖ ముఖ్యకార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరింది. అలాగే టికెట్ ధరలు పెంచడానికి వీల్లేకుండా ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేయాలని కోరింది. ఈ మేరకు ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని నిర్మాణ సంస్థ తరపు న్యాయవాదులు జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట మంగళవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌లను బుధవారం విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. బుధవారం ఈ పిటిషన్‌లు విచారణకు రానున్నాయి. మరోవైపు ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు సైతం పెంచాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నామని.. దానిని సైతం పరిశీలించేలా ఆదేశాలు జారీచేయాలని నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సైతం పిటిషన్ దాఖలు చేసింది. ఈ అప్పీల్ పిటిషన్లన్నీ బుధవారం విచారణకు రానున్నాయి.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

విభిన్నమైన అనుభూతినిచ్చేలా...



'తుంబాడ్' చిత్రంతో సంచలన విజయం సాధించి సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'మయసభ'. జావేద్ జాఫేరి ప్రధాన పాత్రధారిగా జిర్కాన్ ఫిల్మ్స్ నిర్మించింది. తాజాగా ఈ చిత్రం విడుదల గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 30న సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ రాహి బార్వే మాట్లాడుతూ 'ఇది మానవ సంబంధాలను, వారి ఆలోచనా తీరును లోతుగా స్పృశిస్తుంది. ఇందులోని సన్నివేశాలు, భావోద్వేగాలు ప్రేక్షకులకు కచ్చితంగా ఓ విభిన్నమైన అనుభూతిని పంచుతాయి' అని అన్నారు.

ఆక్సిజన్, పల్స్ రేట్ చెప్పే గ్లౌజ్..!

» ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల ఆవిష్కరణ

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శరీరంలో ఆక్సిజన్ స్థాయి, పల్స్ రేట్‌ను గుర్తించేందుకు ప్రత్యేకమైన పరికరాలు కావాలి. అయితే.. వాటితో పనిలేకుండా ఆక్సిజన్, పల్స్ రేటుతోపాటు ఎన్ని క్యాలరీలు ఖర్చయ్యాయి అని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు కొత్త గ్లౌవ్స్‌ను డిజైన్ చేశారు. ఫైనల్ ఇయర్ ప్రాజెక్టులో భాగంగా అలర్టింగ్ సిస్టమ్‌తో కూడిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత గ్లౌవ్స్‌ను ఆవిష్కరించారు. ఈ గ్లౌవ్స్ ధరించిన వ్యక్తి ఆక్సిజన్ స్థాయి, పల్స్‌రేటును ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. మొబైల్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించవచ్చు. వారి కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌ను దీనికి అనుసంధానం చేయవచ్చని విద్యార్థినులు పేర్కొన్నారు. ఈఈఈ ఫైనలియర్ చదువుతున్న కె. శివచంద్రిక, మోనాలిసా సేథి, ఎస్.తనూజ ఈ కొత్త గ్లౌవ్స్‌ను ఆవిష్కరించారు. సుమారు రూ.5 వేల ఖర్చుతో 45 రోజులపాటు శ్రమించి దీన్ని డిజైన్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరవింద శిల్ప సహకారం అందించారు. వీరి ఆవిష్కరణను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లి పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ఈ గ్లౌవ్స్‌ను ఈఎస్‌పీ32 మైక్రో కంట్రోలర్ ఆధారంగా అభివృద్ధి చేశారు. వీటికి వేరబుల్ హెల్త్ గ్లౌవ్స్ అని పేరుపెట్టారు. మాక్స్ 30102, ఎంపీయూ 6050తోపాటు మరికొన్ని సెన్సర్లను వినియోగించారు. ఆక్సిజన్ స్థాయి, హార్ట్ బీట్, పల్స్ రేటు, కేలరీల ఖర్చు, శరీర ఉష్ణోగ్రతతోపాటు ఒత్తిడిని గుర్తించేలా దీన్ని డిజైన్ చేశారు. ఈ సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో చూడవచ్చు.



ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో శివచంద్రిక, మోనాలిసా సేథి, తనూజ



ఏయూ విద్యార్థినులు డిజైన్ చేసిన గ్లౌవ్

దశ సహస్ర సువాసినీ పూజ గిన్నిస్ రికార్డు



తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో మంగళవారం శ్రీశక్తిపీఠం ఆధ్వర్యంలో పీఠాధీశ్వరి రమ్యానంద భారతి 40వ జన్మదినం సందర్భంగా నిర్వహించిన దశ సహస్ర సువాసినీ పూజ గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. ఈ పూజలో పదివేల మందికిపైగా పాల్గొన్న మహిళలు ఒకేసారి దీపాలను వెలిగించడం ద్వారా రికార్డు సృష్టించారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ అధికారి స్వపనీల్ ధ్రువీకరణ పత్రాన్ని రమ్యానంద భారతికి అందించారు. - తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి



వాట్సాప్ కాల్‌తో కోటిన్నర కొట్టేశారు!

అనకాపల్లి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల పేరుతో వాట్సాప్ కాల్ ద్వారా మోసం చేసిన అపరిచితులపై పోలీసులకు ఫిర్యాదు అందింది. అనకాపల్లి పట్టణ ఎస్ఐ డి.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గవరపాలేనికి చెందిన శరగడం మహేంద్ర సూర్యకుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. గత ఏడాది అక్టోబరు 7న గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. తాను చెప్పిన గ్రూపులో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని ఆశ చూపాడు. దీంతో సూర్యకుమార్ తొలుత రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టారు. కొద్దిరోజుల్లోనే ఆయన ఖాతాలోకి 2.2 లక్షలు జమయ్యాయి. మరో రెండుసార్లు ఇదేవిధంగా పది శాతం చొప్పున లాభం జమయింది. నాటినుంచి గత నెల 26వరకు దఫదఫాలుగా గుర్తు తెలియని వ్యక్తి ఖాతాకు రూ.1,63,97,750 జమ చేశారు. 27 నుంచి ఆ వ్యక్తి నుంచి సమాధానం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాజశేఖర్ | సురేంద్ర

పొగ మంచు దెబ్బకు పోయిన ప్రాణాలు

ప్యాపిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొగమంచు ఇద్దరి యువకులను బలిగొంది. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని ఎన్.రంగాపురానికి చెందిన రాజశేఖర్(23), సురేంద్ర(27) ఉడుములపాడు దగ్గర ఉన్న ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 5.30 సమయంలో ద్విచక్ర వాహనంపై ఉడుములపాడుకు బయలు దేరారు. కాసేపటికే ఎదురుగా వస్తున్న ఆటో.. పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు బలమైన గాయలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సురేంద్రను డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న సురేంద్ర కుమార్‌కు గాయాలయ్యాయి. సురేంద్రకు భార్య, కూతురు ఉన్నారు. రాజశేఖర్‌కు ఇంకా వివాహం కాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి చెప్పారు.

- సముద్రం ఒడ్డున..పచ్చని అందాల చెంతన..
- ఆధునిక హంగులు 'భోగాపురం' సొంతం
- అలల మీదుగా ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్
- ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభూతి
- తుఫాన్ల తాకిడిని తట్టుకునేలా నిర్మాణాలు
- 18 విమానాలు నిలిపేలా పార్కింగ్ సామర్థ్యం
- అంతర్గత నిర్మాణాల డిజైన్లలో తెలుగుదనం
- ప్రపంచంతో ఉత్తరాంధ్రకు నేరుగా బంధం
- ఆర్థిక కేంద్రంగా విశాఖకు మరింత వన్నె



మత్స్య ఆకారంలో టెర్మినల్

వై'భోగ'మే!

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర సముద్రం ఒడ్డున.. పచ్చని అందాల చెంతన.. ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభూతిని పంచేలా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సిద్ధం చేశారు. తీర ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో తుఫాన్ల తాకిడిని తట్టుకునేలా ఈ ఎయిర్‌పోర్టును రూపొందించారు. గంటకు 275 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులను, ఏకంగా 27 సెంటీమీటర్ల వర్షపాతాన్ని సైతం తట్టుకునేలా సిద్ధం చేశారు. ఎయిర్‌పోర్టులో చుక్క నీరు నిలబడకుండా పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థను నెలకొల్పారు. రాత్రిపూట 18 విమానాలను నిలపగల పార్కింగ్ సామర్థ్యం దీని సొంతం. మొత్తం 14 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు 200 విమానాలు దిగే సామర్థ్యం దీని సొంతం. టెక్నికల్ బిల్డింగ్ విస్తీర్ణం 81 వేల చదరపు మీటర్లు. విమానాశ్రయం అంతర్గత అంశాలన్నీ ప్రత్యేకమే. ఏ మార్గంలో వచ్చినా.. ఒకవైపు తీరం అందాలు.. మరోవైపు మన్యంలో చూడచక్కని ప్రదేశాలు వీక్షిస్తూ ప్రయాణం చేయవచ్చు.

జంట నగరాలుగా విశాఖ-విజయనగరం

ఎయిర్‌పోర్టు నిర్మాణంతో విశాఖ- విజయనగరం జంట నగరాలుగా అవతరించనున్నాయి. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి జిల్లాలను కలుపుతూ 15 రహదారులను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, దక్షిణ ఒడిశాలోని కోరాపుట్, గంజాం, గజపతి, మల్కాన్‌గిరి, రాయగడ జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు విమాన సదుపాయం అందుబాటులోకి రానుంది. విశాఖ మరింతగా ఆర్థిక కేంద్రం కానుంది. ఏటా 20 వేల టన్నుల సరుకుల ఎగుమతులకు అవకాశం కలగనుంది. అందుబాటులోకి వచ్చిన తొలి ఏడాది 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చు. ఇప్పటివరకూ ఉత్తరాంధ్ర ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే అటు హైదరాబాద్, ఇటు బెంగళూరు, లేదంటే ముంబాయి, ఢిల్లీ వెళ్లాల్సి వచ్చేది. కానీ ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే అన్ని దేశాలకు, ప్రాంతాలకు విమాన మోక్షం కలగనుంది. భోగాపురం-హైదరాబాద్- అమెరికా నేరుగా వెళ్లే ప్రత్యేక విమాన ప్రతిపాదనలు సైతం ఉన్నాయని టెస్ట్ డ్రైవ్ సందర్భంగా మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు.

ఉత్తరాంధ్ర సొబగులతో..

ఎయిర్ పోర్టును సముద్రం పక్కనే ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు, మత్స్యకారుల సెంటిమెంట్‌ను గౌరవించేలా నిర్మాణం చేపట్టారు. టెర్మినల్‌ను మత్స్య ఆకారంలో చేపట్టారు. నేషనల్ హైవే నుంచి ఎయిర్ పోర్టుకు చేరుకునేందుకు సుమారు మూడు కిలోమీటర్ల విశాలవంతమైన రోడ్లను నిర్మించారు. ఈ రోడ్డుకు ఇరువైపులా..పచ్చని చెట్లు స్వాగతం పలుకుతాయి. ఈ మార్గంలో కొబ్బరి తోటలు కనువిందు చేస్తాయి. ఎయిర్‌పోర్టు ట్రయల్ రన్ కూడా విజయవంతం కావడంతో పెండింగ్‌లో ఉన్న నాలుగు శాతం పనులను రెట్టింపు ఉత్సాహంతో పూర్తిచేసే పనిలో ఉంది జీఎంఆర్ సంస్థ. ఈ ఏడాది జూన్ 26న ప్రారంభానికి సిద్ధమవుతోంది. జూలై నుంచి విమాన రాకపోకలు మొదలు కానున్నాయి.

బీచ్ ప్రత్యేక ఆకర్షణ

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలోనే ఉంటుంది సముద్ర తీర ప్రాంతం. ఏదైనా విమానం గగనతలం నుంచి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ కావాలంటే గాలికి ఎదురుగా వెళ్తేనే ఫ్లైట్ స్పీడ్ కొంత కంట్రోల్ అవుతుంది. అందుకు కొంత సమయం పడుతుంది. వేగాన్ని నియంత్రించుకుంటూ టేకాఫ్ అవుతుంది. సాధారణ ల్యాండింగ్‌లో విమాన వేగం గంటకు 240 నుంచి 300 కిలోమీటర్లు ఉంటుంది. ఎక్కువ వేగంతో ల్యాండింగ్ చేసేందుకు కుదరదు. అందుకే గగనతలంలో తిరుగుతూ ల్యాండ్ చేయాల్సి ఉంటుంది. విమానం వేగం నెమ్మదించేలా ల్యాండింగ్ ఎప్పుడూ గాలికి వ్యతిరేకంగానే ఉంటుంది. విమానాశ్రయానికి వెలుపల సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. విమానం ల్యాండింగ్ అయిన క్రమంలో తీర ప్రాంత అందాలను వీక్షించవచ్చు. మరోవైపు ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే విమానాలు అరకు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అందమైన మన్యం ప్రాంతాలను తిలకించవచ్చు. ఢిల్లీ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు 1,600 కిలోమీటర్ల దూరం ఉంది. ఈనెల 4న ట్రయల్ రన్‌లో అక్కడినుంచి ఇక్కడకు గంటన్నర వ్యవధిలో చేరుకున్నారు. అద్భుత విమాన ప్రయాణం చేశామని.. అరకు అందాలు, తీర ప్రాంత సోయగాలు చూశామని స్వయంగా పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

ఆంధ్రా ఊటీ అందాలు..



ల్యాండ్ అవుతున్న విమానం (ఫైల్)

ప్రయాణికులను కట్టిపడేసే దృశ్యాలు 'భోగాపురం' సొంతం. ఇతర ప్రాంతాల నుంచి భోగాపురం అల్లూరి సీతారామరాజు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాలంటే..అరకు మీదుగా రావల్సి ఉంటుందని చెబుతున్నారు. అరకు వరకు వచ్చేసరికి విమానం కొంత స్పీడ్ తగ్గిస్తారు. దీంతో అరకు అందాలు గగనతలం నుంచే చూసే అవకాశం విహంగ ప్రయాణికులకు ఉంటుంది. ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన అరకు అందాలు ప్రయాణికులను అబ్బుర పరచనున్నాయి.

పుస్తకం లేని ఉద్యమం లేదు

చారిత్రక పరిణామాలకు అదే మూలం: సిసోడియా

విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో భాగంగా రచయితలతో పుస్తక పాదయాత్ర



పుస్తక పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, యాత్రలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్, మాజీ ఎంపీలు ఉండవల్లి, వై.లక్ష్మీప్రసాద్, ఎమెస్కో విజయకుమార్ తదితరులు

విజయవాడ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "పుస్తకం లేకుండా ఏ ధర్మమూ పుట్టలేదు. ఏ ఉద్యమమూ సాగలేదు. ఉద్యమాలకు పుస్తకమే మూలం" అని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా 5వ రోజు, మంగళవారం పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించారు. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు జరిగిన యాత్రను ఆర్పీ సిసోడియా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వేగంగా మారుతున్న సాంకేతికత వల్ల పుస్తకాల తయారీ, ప్రచురణ, పంపిణీ, పఠనాల స్వరూప స్వభావాలే మారిపోతున్నాయన్నారు. ప్రపంచాన్ని రూపొందించిన చారిత్రక, ఆధ్యాత్మిక పరిణామాలన్నిటికీ పుస్తకాలే మూలమన్నారు. 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... పుట్టుకతో ఎలక్ట్రానిక్ తెరలకు పరిచయమవుతున్న నేటి తరానికి అచ్చు పుస్తకం చదవడంలో ఉండే ఆనందాన్ని పరిచయం చేయడానికి ప్రచురణకర్తలు, పుస్తక ప్రియులంతా కలిసి ఒక కార్యాచరణను రూపొందించి, అమలు చేయాలని సూచించారు. కొత్త తరానికి పుస్తకాన్ని పరిచయం చేసేందుకు పుస్తక ప్రదర్శనలు కొంతవరకు ఉపయోగపడతాయన్నారు. కాగా, పాదయాత్ర అనంతరం సభను మాజీ విద్యాశాఖ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సభగా నిర్వహించారు. మండలి జీవితంపై రూపొందించిన 'దివిసీమ గాంధీ' పుస్తకాన్ని సాహిత్య అకాడమీ పురస్కార విజేత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించి, మాట్లాడారు. రాజకీయ విభేదాలకు, పరిపాలనా వ్యవహారాలకు, భాషాప్రేమకు మధ్య స్పష్టమైన అంతరాన్ని పాటిస్తూ, అన్ని రంగాలలోనూ అందరినీ మెప్పించిన ఘనత కృష్ణారావుదేనని కొనియాడారు. ఎమెస్కో విజయకుమార్ మాట్లాడుతూ... ప్రామాణికమైన తెలుగు మీద పట్టుండేలా భావితరాలలో కొందరినైనా తయారుచేసే బాధ్యత నేటి తరపు తెలుగు ప్రేమికులదేనన్నారు. 'తానా' సాహిత్యవేదిక అధ్యక్షులు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ... మండలి వెంకట కృష్ణారావు జీవితాన్ని పాఠశాల స్థాయిలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని సూచించారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... నాగరికత, సాంకేతికత ఎంత పెరిగినా పుస్తకం విలువ, పుస్తకం ద్వారా వచ్చే జ్ఞానం విలువ మారవన్నారు. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ...మాతృభాషలో చదవడం వల్ల బుద్ధి సహజంగా వికసిస్తుందని, దానివల్లనే శాస్త్ర సాంకేతిక రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు సాధ్యమవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... పుస్తక మహోత్సవం పుస్తకాలను పాఠకులకు చేర్చేందుకు పరిమితం కాకుండా.. అనేక మంది చదువరులు, ఆలోచనాపరులు ఒకరితో మరొకరు కలిసేందుకు, చర్చించేందుకు సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. సీపీఎం మాజీ ఎంపీ మధు మాట్లాడుతూ, ప్రజా సేవ, భాషాసేవ రెండూ నిర్వహించిన సవ్యసాచి మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ... దివిసీమ ఉప్పెన సమయంలో మండలి వెంకట కృష్ణారావు సేవలను శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, హైదరాబాద్ పుస్తక మహోత్సవ కార్యదర్శి వాసు, వెబ్ జర్నలిస్టు కిరణ్ ప్రభ, తెలుగు ఎన్నారై డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజా, విజయవాడ పుస్తక మహోత్సవ సంఘ బాధ్యులు మనోహర నాయుడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రలో.. 'మాదక ద్రవ్యాలు వద్దు - పుస్తకాలే ముద్దు' అనే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు.



బెజవాడలో రేపటి నుంచి 3 రోజుల పాటు నిర్వహణ

ప్రారంభం ఇలా..

8వ తేదీ సాయంత్రం 5గంటలకు తోలుబొమ్మలాట, డ్రమ్స్ ప్రదర్శనతో కూడిన ప్రారంభోత్సవ ఊరేగింపుతో ఆవకాయ్ ఫెస్టివల్ ప్రారంభమవుతుంది. జమ్మర్స్ సంగీత ప్రదర్శన, పున్నమిఘాట్ దగ్గర హారతి, శంఖం, నగారా, డ్రమ్స్, ఒమాజియా పెర్ఫార్మింగ్ కంపెనీ ద్వారా 'హర్ ఫ్రేమ్స్, హర్ ఫైర్' కార్యక్రమాలు ఉంటాయి.

'ఆవ కాయ్' పిలుస్తోంది.. రారండోయ్!

విజయవాడ/అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని చాటిచెప్పేలా విజయవాడ వేదికగా అమరావతి ఆవకాయ్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏపీ పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకూ మూడు రోజుల పాటు పున్నమి ఘాట్, భవానీ ఐల్యాండ్‌లో వైభవంగా ఈ వేడుకలు నిర్వహించనున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజెప్పటంతో పాటు మన భాషలోని గొప్పదనం, ఘనమైన సాహిత్యం, తెలుగు ప్రజలను ప్రభావితం చేసిన సినిమాల గురించి ఈ సందర్భంగా చర్చించనున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఆవకాయ్ ఫెస్టివల్‌కు రూపకల్పన చేశారు. నవలల నుంచి వెండితెర వరకు తెలుగు రచనల గుబాళింపులపై ఉద్దండులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ యుగంలో తెలుగు సినిమా భవిష్యత్తుతో పాటు బుర్రకథలు, కూచిపూడి నాట్యం వంటి వాటిపైనా చర్చలు జరుగుతాయి. రచయితలు, చిత్ర నిర్మాతలు, సంగీతకారులు, కళాకారులతో ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయి. వీటితో పాటు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. 8వ తేదీ రాత్రి 7.50 గంటల నుంచి 8.20 గంటల వరకు కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ దగ్గర జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, యూరోపియన్ యూనియన్ రాయబారి హెచ్‌ఈ హెర్వే డెల్ఫిన్ పాల్గొంటారు.

రెండో రోజు షెడ్యూల్...

9వ తేదీ ఉదయం 11గంటలకు 'ప్యూర్ ఈవిల్: సినిమాల్లో ప్రతినాయకులు' అంశంపై బాలీవుడ్ రైటర్ బాలాజీ విట్టల్‌తో ఎస్ హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్రా సంభాషణ. మధ్యాహ్నం 12- 12.50గంటల వరకు కథ చెప్పే విధానంలో పరిణామం: భారతీయ పురాణాల ప్రయాణంపై బ్నిం, కస్తూరి మురళీకృష్ణ, సంజీవ్ పస్రిచా, మొతాలీ అనురాధ సంభాషణ. మధ్యాహ్నం 1- 1.50 వరకు కథా కాలక్షేపం: స్టోరీ అవర్.. యూకే బృందం సంగీతం, మాటలతో సార్వత్రిక కథలు మధ్యాహ్నం 2.30- 3.20 వరకు 'ఓటీటీ యుగంలో సినిమా'పై లీనా యాదవ్, శుభాశిష్ సర్కార్, సౌగుట ముఖర్జీ, సుప్రియ యార్లగడ్డ, సునీల్ చైనాన్ని, శ్రీరూపా మిత్ర సమావేశం. మధ్యాహ్నం 3.20- 4.20వరకు 'అభిలాష-నవల నుంచి సినిమా వరకు'.. వల్లి పద్మాంజలితో యండమూరి వీరేంద్రనాథ్, ఎ. కోదండ రామిరెడ్డి సంభాషణ. సాయంత్రం 5గంటలకు చందన బాల కల్యాణ్ కర్నాటిక్- ఆధ్యాత్మిక సంగీత కచేరీ. సాయంత్రం 6.15 నుంచి 6.45 వరకు నాటకీ కథలు- 'రస'ఐక్యం.. వనశ్రీ రావు కూచిపూడి నృత్యం. సాయంత్రం 7- 7.50వరకు కథల శబ్దం: సినిమాలలో సంగీతం, కవిత్వం శ్యామ్ రక్షంద్ జలీల్‌తో ప్రియా సారయ్య, శేఖర్ రావ్జాని, కాసర్ల సంభాషణ. రాత్రి 8- 9.45 గంటల వరకూకు మెహ్ఫిల్ ఏ సుఖాన్: అనుభూతినిచ్చే ముషైరా, రాత్రి 10- 11.30గంటల వరకు ఆజ్ రంగ్ హై ఏజీవీ- నిజామీ బంధు సంగీత విభావరి.

సాహిత్య, కళల వైభవాన్ని చాటుదాం..

తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటి చెప్పేలా, తెలుగువారి సంప్రదాయానికి, రుచికి నిలువుటద్దమైన ఆవకాయను విశ్వవ్యాప్తం చేస్తూ పర్యాటక శాఖ నిర్వహించే 'అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్'కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. సాంస్కృతిక మార్పిడికి, కళాత్మకమైన భాగస్వామ్యానికి ఒక శక్తిమంతమైన గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దే క్రమంలో మూడు రోజుల సాంస్కృతిక కార్యక్రమాలు, రుచికరమైన వంటకాల ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలవనున్నాయని చెప్పారు. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, మన సంస్కృతిని ప్రతిబింబించే చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ వేడుకను విజయవంతం చేయాలని ఆమ్రపాలి కోరారు.



మూడో రోజు..

10వ తేదీ ఉదయం 11గంటలకు కథా కాలక్షేపం- స్టోరీ అవర్, యూకే సంగీతం, మాటలతో సార్వత్రిక కథలు. మధ్యాహ్నం 12- 12.50 వరకు 'నీటిపై రాతలు- తెలుగులో కథ చెప్పే కళ'పై శ్రీకరుణతో బ్నిం, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి సంభాషణ. మధ్యాహ్నం 1- 1.50 వరకు 'శుక్రవారం విడుదల సినిమా- పాత్రికేయవృత్తి'పై చల్లా భాగ్యలక్ష్మితో వర ముళ్ళపూడి, వడ్డి ఓంప్రకాశ్ నారాయణ సంభాషణ. మధ్యాహ్నం 2.30 నుంచి 3.20 వరకు 'సుందరమైన తెలుగు- సాహిత్యం- సినిమా వైభవం'పై మొతాలీ అనురాధతో కస్తూరి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, మౌనశ్రీ మల్లిక్ శ్రీపతిశర్మ వేదాంతంల సంభాషణ. మధ్యాహ్నం 3.30నుంచి 'అనువాద కళ: పదాలకు సరిహద్దులు లేవు' అంశంపై కె.శ్రీనివాసరావు, ఆచార్య జయప్రద, ఆచార్య తడకమళ్ళ విజయ్‌కుమార్, మరియా పూరి సంభాషణ. సాయంత్రం 5.45కు 'నటసార్వభౌమ ఎన్టీఆర్: నట విశ్వరూపానికి నివాళులు'. రాత్రి 8గంటలకు ఉత్సవ ముగింపు.



పండక్కి బస్సుల్లేవ్..!

సంక్రాంతి ప్రయాణికులకు ఏపీఎస్ఆర్టీసీ షాక్

హైదరాబాద్ నుంచి కేవలం 240 బస్సులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈ సంక్రాంతికి పొరుగు రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ఏపీ వాసులకు ఆర్టీసీ షాక్ ఇవ్వనుంది! హైదరాబాద్ నుంచి వచ్చేవారి కోసం కేవలం 240 బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించడాన్ని బట్టి ప్రయాణికులకు ఇక్కట్లు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సంక్రాంతి సమయంలో పల్లెలకు.. శివరాత్రికి శైవ క్షేత్రాలకు.. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుపతికి.. ప్రత్యేక బస్సులు నడపడం ఆర్టీసీలో ఆనవాయితీ. అయితే గత రెండేళ్లుగా దిక్కులేనిదైన ఏపీఎస్ఆర్టీసీ తన ప్రయాణికుల్ని తాను కాపాడుకోలేక పోతోంది. సంక్రాంతికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఈడీ(ఆపరేషన్స్) అప్పలరాజు పేరుతో మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సంక్రాంతి ముందు 3,857 సర్వీసులు.. తర్వాత వెనుదిరిగే ప్రయాణికుల కోసం 4,575 సర్వీసులు కలిపి మొత్తం 8,432 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చేవారి కోసం 357 బస్సులు మాత్రమే నడుపుతున్నట్లు వాస్తవం బయటపెట్టింది. ఇందులో హైదరాబాద్ నుంచి విజయవాడ, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు సంక్రాంతికి వచ్చేవారి కోసం 240 బస్సులు మాత్రమే వేశారు. మిగిలినవాటిలో బెంగుళూరు నుంచి 102, చెన్నై నుంచి 15బస్సులు మాత్రమే ఉన్నాయి. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు 1,800, బెంగుళూరుకు 200, చెన్నైకి 75 బస్సులు నడుపుతున్నట్లు ఈడీ తెలిపారు. గతంలో ప్రతి సంక్రాంతికి 3, 4వేల బస్సులు నడిపిన చరిత్ర ఆర్టీసీ సొంతం. అలాంటిది కేవలం 240 బస్సులతో సరిపెట్టడాన్ని బట్టి పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. కొత్త బస్సులు రాకపోవడం, యాజమాన్యం పట్టించుకోకపోవడం, స్వప్రయోజనాలకే అధికారులు ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ దుస్థితి దాపురించింది. ఆర్టీసీ టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్‌చేసే ప్రైవేటు ఏజెన్సీ చక్రం తిప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు పోలవరానికి సీఎం

» ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా

పోలవరం/అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పోలవరం ప్రాజెక్టు రానున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన ప్రాజెక్టు పరిశీలనకు రావడం ఇది మూడోసారి. లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా.. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుంటారు. పనుల వేగిరంపై వారికి, కాంట్రాక్టు సంస్థకు దిశా నిర్దేశం చేయనున్నారు. బుధవారం ఉదయం 10.20 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 11.10 గంటలకు ప్రాజెక్టు హిల్‌వ్యూ ప్రాంతానికి చేరుకుంటారు. తొలుత ప్రజా ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం ప్రాజెక్టులో ఎగువ, దిగువ కాపర్ డ్యాంలు, బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్, గ్యాప్ 1, 2, ఈసీఆర్ఎఫ్ డ్యాం, కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలిస్తారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో తిరుగుపయనమవుతారు. సీఎం పర్యటనకు ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇద్దరు ఏఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 34 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 900 మంది పోలీసులు, 150 మంది ప్రత్యేక పోలీసు సిబ్బందిని మోహరించారు. కాగా, కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో పోలవరం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పనుల్లో 13 శాతం పురోగతి ఉంది. మొత్తంగా ఇప్పటివరకు 87.8 శాతం పనులు పూర్తయ్యాయి.

నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళుతున్నారు. బుధవారం పోలవరం పర్యటన అనంతరం అక్కడి నుంచి నేరుగా ఢిల్లీ వెళతారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో చంద్రబాబు భేటీ అయ్యే అవకాశం ఉంది. అనంతరం బుధవారం రాత్రే ఢిల్లీ నుంచి బయలుదేరి అమరావతి చేరుకుంటారు.

భోగాపురంపై వైసీపీది క్రెడిట్ చోరీ రాజకీయం

» బాబుది డెవలప్‌మెంట్ రికార్డు.. జగన్‌ది క్రిమినల్ రికార్డు: పట్టాభి

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి క్రెడిట్‌ను నిస్సిగ్గుగా వైసీపీ తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. భోగాపురంపై వైసీపీ క్రెడిట్ చోరీ రాజకీయాలు చేస్తోంది' అని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'భోగాపురం నిర్మాణానికి అంకురార్పణ నుంచి ప్రారంభం వరకు అంతా చేసింది సీఎం చంద్రబాబే. ఒక్క ఆధారం కూడా లేకుండా నిసిగ్గుగా చెప్పడం క్రెడిట్ చోరీకి పరాకాష్ఠ. 2015, ఫిబ్రవరి 19న బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ ఎయిర్ షోలో నాటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు, కేంద్ర మంత్రి సుజనా చౌదరి సమక్షంలో భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రత్యేక సంస్థ(ఎస్పీవీ) ఏర్పాటు చేసింది చంద్రబాబే. 2015 అక్టోబరు 14న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కార్పొరేషన్ ఎండీగా ఎం.వెంకటేశ్వర్లును నియమించిందీ చంద్రబాబే. 2016లో కేంద్రం సైట్ క్లియరెన్సు ఇస్తూ అధికారిక లేఖ ఇచ్చింది. అదే ఏడాది ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చిన రైతులు నష్టపోకుండా అత్యధిక నష్టపరిహార ప్యాకేజీ ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. 2017లో కేంద్ర పర్యావరణ శాఖ అధికారికంగా క్లియరెన్సు లెటర్ జారీ చేసింది. ఇన్ని స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ అన్ని అనుమతులు మేమే తెచ్చామని వైసీపీ చెప్పడం అసలైన క్రెడిట్ చోరీ. చంద్రబాబుది డెవలప్‌మెంట్ రికార్డు. జగన్‌ది మాత్రం క్రిమినల్ రికార్డే' అని ఎద్దేవా చేశారు.

సామాజిక సంక్షేమ బోర్డును మూసేసిన ఘనుడు జగన్: బాలకోటయ్య

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత వైసీపీ పాలనలో సామాజిక సంక్షేమ బోర్డు పేరు కానీ, బోర్డు కానీ రాష్ట్రంలో ఎక్కడా వినిపించిన దాఖలాలు లేవు. నా ఎస్సీ, నా ఎస్టీ అని అరిచి వారికి సంబంధించిన బోరు మూసేసిన ఘనత జగన్‌దే. వైసీపీ హయాంలో కేవలం 2 నెలలే సామాజిక సంక్షేమ బోర్డు పనిచేసింది' అని బాలకోటయ్య చెప్పారు.

2029 ఎన్నికల్లో పోటీ చేయను

» ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకొంటా: ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి తరపున బీజేపీ నుంచి గెలుపొందిన కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తన రాజకీయ భవిష్యత్తుపై ఓ ప్రకటన చేశారు. మంగళవారం ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. '2029 ఎన్నికల్లో నేను కానీ, నా కుటుంబ సభ్యులు కానీ పోటీ చేయం. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాను. గతంలోనే రాజకీయాల నుంచి విరమించుకోవాలనుకున్నా. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చింది. నన్ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలు సంతృప్తి చెందేలా, అవినీతి లేకుండా నా హయాంలో అభివృద్ధి పనులతో ప్రజల రుణం తీర్చుకుంటా' అని చెప్పారు.

రాజధానిలోనే రిపబ్లిక్ డే వేడుకలు

» ముమ్మరంగా ఏర్పాట్లు.. భద్రత కట్టుదిట్టం

తుళ్లూరు, గుంటూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే వేడుకలు ఈ దఫా రాజధాని అమరావతిలోనే నిర్వహించనున్నారు. ఇందుకోసం చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా పరిశీలించి సిబ్బందికి, అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఈ వేడుకలకు.. ప్రధాన వేదికను రాయపూడిలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి హైకోర్టు వైపు వెళ్లే రహదారి కుడి వైపున సిద్ధం చేస్తున్నారు. వేడుకల నిర్వహణ ప్రదేశాన్ని చిత్ర పటం (లేఅవుట్) ఆధారంగా సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తులకు బ్రాండింగ్ !

» అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ జరగాలి: సీఎం

» సెర్ప్, మెప్మా విభాగాలపై సమీక్ష

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు తయారు చేస్తున్న 23 వేలకు పైగా ఉత్పత్తులను దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు బ్రాండ్ బాగా ఉపకరిస్తుందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సెర్ఫ్, మెప్మా విభాగాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఈ ఉత్పత్తులు విక్రయానికి వినూత్నంగా, విభిన్నంగా బ్రాండింగ్ ఉండాలి. అరకు కాఫీ తరహాలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో బ్రాండ్ రూపొందిస్తే.. ఉత్పత్తులకు మరింత విలువ పెరుగుతుంది. ఈ విధానం ద్వారా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. స్వయం సహాయక సంఘాలు, మైక్రో ఎంట్రప్రెన్యూర్స్‌కు ఆర్థిక సుస్థిరత వచ్చేలా ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్ జరగాలి' అని సీఎం స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

» వాయుగుండంగా మారుతుందని అంచనా

విశాఖపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఉన్న అల్పపీడనం మంగళవారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో వాయుగుండంగా మారనుంది. ఇది తుఫాన్‌గా మారుతుందా, లేదా అనేది వాతావరణ శాఖ ప్రకటించలేదు. వాయుగుండంగా మారిన తర్వాత తమిళనాడులో వర్షాలు కురుస్తాయని, ఈ నెల 10, 11 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం మంచు ప్రభావం కొనసాగింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో మంచు ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

విద్వేష విషం చిమ్మితే కోరలు పీకేస్తాం

» సోషల్ మీడియాలో అసభ్య పోస్టులకు తావులేదు: లోకేశ్

» సైబర్ కేసుల్లో నెలలో చార్జిషీట్: హోంమంత్రి అనిత

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా విద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై సద్విమర్శలను స్వాగతిస్తామని, కుట్రపూరితంగా దురుద్దేశంతో విషం చిమ్మితే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. 'సోషల్ మీడియా జవాబుదారీతనం- పౌరుల రక్షణ' అంశంపై మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రుల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కొందరు పనిగట్టుకుని ఆర్గనైజ్డ్‌గా సోషల్ మీడియాలో అసభ్యకర, వివాదాస్పద పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం



విశాఖపట్నంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్, పక్కన పల్లా

చేశారు. ఏఐ ఆధారిత డీప్ ఫేక్ కంటెంట్‌ను సృష్టించి మొబైల్ ఫోన్లలోకి వదులుతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడానికి కేంద్రం ప్రవేశపెట్టిన సహయోగ్ ఇంటిగ్రేషన్ పోర్టల్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. సోషల్ మీడియా కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేయడానికి సమయం పడుతోందని, సైబర్ క్రైమ్ బిల్డింగ్ ఏర్పాటు చేసి నెల రోజుల్లోగా చార్జిషీట్ వేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా.. మహిళల రక్షణ కోసం ప్రజ్వల ఫౌండేషన్ ద్వారా పోరాటం చేస్తున్న సామాజిక కార్యకర్త సునీతా కృష్ణన్ సచివాలయంలో మంత్రి అనితతో భేటీ అయ్యారు.

నేడు కోర్టుకు మంత్రి లోకేశ్

విశాఖపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ బుధవారం విశాఖపట్నం కోర్టుకు హాజరుకానున్నారు. జగన్ పత్రిక తనపై ప్రచురించిన కథనంపై ఆయన గతంలో పరువునష్టం కేసు వేశారు. విశాఖలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో కేసు విచారణ జరుగుతోంది.

సమష్టి కృషితో సత్ఫలితాలు!

బ్రాండ్ ఇమేజ్ పునరుద్ధరించుకున్నాం: సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత ఏడాది సమష్టి కృషితో పనిచేయడం వల్లే పెట్టుబడుల ఆకర్షణలో సత్ఫలితాలు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో, ఉత్సాహంతో ఈ ఏడాది కూడా పనిచేయాలని అధికారులకు కర్తవ్య బోధ చేశారు. సక్సెస్ ఇచ్చే 'కిక్' అద్భుతంగా ఉంటుందని.. దాని కోసం అందరూ పనిచేయాలని సూచించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఆయన అధ్యక్షతన 14వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఈ సందర్భంగా ఆమోదం తెలిపారు. ఇవి సాకారమైతే 11,753 మందికి ఉద్యోగాలు లభించే అవకాశముంది. దీంతో ఇప్పటివరకూ రూ.8,74,705 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం లభించగా.. 8,35,675 మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఉంది. సమావేశం ప్రారంభం కాగానే.. ముఖ్యమంత్రికి మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల అధిపతులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2025లో రాష్ట్రం కోసం అందరూ బాగా పనిచేశారని.. పెట్టుబడులను భారీగా రాబట్టారని అధికారులను ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పోయిన బ్రాండ్ ఇమేజ్‌ను పునరుద్ధరించుకోగలిగామని అన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని.. గూగుల్, రిలయన్స్, అదానీ, టాటా, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. ఏ చిన్న పొరపాటుకూ తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. దావోస్ సదస్సుకు హాజరై రాష్ట్ర బ్రాండ్‌ను ప్రమోట్ చేశామని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ తీసుకురావడానికి మంత్రి లోకేశ్ కృషి చేశారన్నారు.

ప్రజలపై భారం తగ్గింపు..

విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశామని చంద్రబాబు చెప్పారు. యూనిట్‌కు 13 పైసల చొప్పున భారం తగ్గించామని గుర్తుచేశారు. అలాగే రూ.4,500 కోట్ల ట్రూఅప్ భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వం భరించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ట్రూడౌన్‌కు నాంది పలికామని తెలిపారు. కరెంటు కొనుగోలు ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు అమలు చేయనున్నట్లు చెప్పారు.

ఐలాండ్ టూరిజం అభివృద్ధిపై ఫోకస్..: 'సూర్యలంక అత్యంత సురక్షితమైన బీచ్ ప్రాంతం. దీనికి మాస్టర్‌ప్లాన్ తయారు చేయండి. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ బ్రాండింగ్ చేయండి. 15 కిలోమీటర్ల మేర బీచ్ ఫ్రంట్ ఉండాలి. అది కాలుష్య రహిత ప్రాంతంగా ఉండాలి. సూర్యలంకతో పాటు సమీపంలోని దీవులను కూడా బీచ్ టూరిజం కింద అభివృద్ధి చేయాలి' అని సీఎం చెప్పారు. మాల్దీవుల తరహాలో ఐలండ్ టూరిజం అభివృద్ధి చేయవచ్చన్నారు. 25 వేల గదులు నిర్మించగలిగితే పర్యాటకులను ఆకర్షించవచ్చని తెలిపారు. సూర్యలంక ఏపీటీడీసీ రేటింగ్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆవకాయ ఫెస్టివల్, ఫ్లెమింగ్ ఫెస్టివల్, గండికోట ఉత్సవాలు, విశాఖ-అరకు ఉత్సవ్, సీ టూ స్కై, ఏపీ ట్రావెల్ మార్ట్‌లను ఘనంగా నిర్వహించాలి' అని ఆదేశించారు. 'ఏపీ ఐటీ ఇన్‌ఫ్రా కనెక్ట్' పోర్టల్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఎస్ఐపీబీ ఆమోదించిన పెట్టుబడులివీ..

- బాపట్ల జిల్లాలో అర్థకోస్టల్ రిసార్ట్స్ రూ.187.58 కోట్ల పెట్టుబడి.. 250 ఉద్యోగాలు
- ఇదే జిల్లాలో సివాన్ యానిపై కన్సార్షియం-రూ.183.87 కోట్ల పెట్టుబడి.. 196 ఉద్యోగాలు.
- బాపట్ల జిల్లాలోనే శుభం ఇంద్రనీల్ కన్సార్షియం-రూ.64.44 కోట్ల పెట్టుబడి.. 100 ఉద్యోగాలు
- శ్రీసత్యసాయి జిల్లాలో ఇస్కాన్-రూ.425.20 కోట్ల పెట్టుబడి.. 1,035 ఉద్యోగాలు



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ తదితరులు

- అనంతపురం జిల్లాలో సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్-రూ.200.82 కోట్ల పెట్టుబడి.. 245 ఉద్యోగాలు
- తిరుపతి జిల్లాలో నవ ఫుడ్ సెంటర్-రూ.44.22 కోట్ల పెట్టుబడి.. 500 ఉద్యోగాలు
- నాయుడుపేటలో వెబ్‌సోల్ రెన్యువబుల్-రూ.3,538 కోట్ల పెట్టుబడి.. 1,980 ఉద్యోగాలు
- నెల్లూరు జిల్లాలో టాటా పవర్-రూ.66.75 కోట్ల పెట్టుబడి.. 1,000 మందికి ఉద్యోగాలు
- నంద్యాలలో రామ్‌కో సిమెంట్స్-రూ.1,500 కోట్ల పెట్టుబడి.. 300 మందికి ఉద్యోగాలు
- కడప జిల్లాలో షిర్డిసాయి ఎలక్ట్రికల్స్-రూ.5,571 కోట్ల పెట్టుబడి.. 5,000 ఉద్యోగాలు
- తిరుపతిజిల్లాలో ఏథరియల్ ఎక్స్‌ప్లొరేషన్ గిల్ట్-రూ.578కోట్ల పెట్టుబడి-382మందికి ఉద్యోగాలు
- విజయనగరం జిల్లాలో రాధికా వెజిటబుల్స్ ఆయిల్స్-రూ.234కోట్ల పెట్టుబడి..165 మందికి ఉద్యోగాలు
- అనకాపల్లి జిల్లాలో రిలయన్స్ కన్స్యూమర్స్-రూ.30 కోట్ల పెట్టుబడి.

అమరావతికి పర్యాటక శోభ!

» కృష్ణా తీరంలో మెరీనా వాటర్ ఫ్రంట్ అభివృద్ధి

» సీఆర్డీఏ సమావేశంలో సీఎం ఆదేశాలు

రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ తీరాన్ని మెరీనా వాటర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేసి, సరికొత్త పర్యాటక హంగులు అద్దాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధ్యక్షతన 57వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. మెరీనా వాటర్ ఫ్రంట్‌లో భాగంగా జెట్టీలు, టూరిజం లీజర్ బోట్లు, ఫుడ్ ప్లాజాలు, ల్యాండ్ స్కేప్ పనులను చేపట్టేందుకు పీపీపీ విధానంలో టెండర్లు పిలవాలని అధికారులకు సీఎం సూచించారు. రివర్ ఫ్రంట్‌తో పాటు జల క్రీడల (వాటర్ స్పోర్ట్స్) కార్యకలాపాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా అంతర్గత కాలువల నిర్మాణం, సుందరీకరణ పనులు వేగంగా జరగాలని ఆదేశించారు. కృష్ణా నదికి ఇరువైపులా అద్భుతమైన వాటర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకోవడంతో పాటు నదిలో ఉన్న ద్వీపాలను పర్యాటకపరంగా మరింతగా ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో పరిశీలించాలని సూచించారు. స్పోర్ట్స్ సిటీ వంటి ప్రాజెక్టుల కోసం ఖతార్ మోడళ్లను పరిశీలించాలన్నారు. కృష్ణా మెరీనా రివర్ ఫ్రంట్ కోసం టూరిజం పాలసీ కింద ఎకరం భూమి ఇచ్చేలా అథారిటీ నిర్ణయం తీసుకుందని మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్ స్కీంలో భాగంగా రాజధానిలో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ పింఛను తీసుకుంటున్న తల్లిదండ్రులు చనిపోయి.. అనాథలైన ఏడుగురు పిల్లలకు నెలకు రూ.5 వేల పెన్షన్ మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది.

సీమ ఎత్తిపోతలను ఆపింది జగనే!

» స్వీయ ప్రయోజనాల కోసమే ఈ స్కీంకు డిజైన్: నిమ్మల

» పర్యావరణ అనుమతుల్లేకుండానే డీపీఆర్ తయారీ పేరిట పనులు

» 990 కోట్ల ప్రజాధనం వృథా

» ప్రభుత్వంపై 750 కోట్ల రుణభారం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి హోదాలో 2020లోనే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆపేశారని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తేల్చి చెప్పారు. స్వీయ ప్రయోజనాల కోసమే ఈ పథకానికి డిజైన్ చేశారని.. 2020 మే 5న రూ.3,825 కోట్లతో పాలనానుమతులు ఇచ్చి, పనులు ప్రారంభించారని.. ఇది జరిగిన 15 రోజులకే.. మే 20న పర్యావరణ అనుమతులు లేనందున ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేయాలంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశించిందని తెలిపారు. అంటే చేపట్టిన 15 రోజుల్లోనే జగన్ దీనిని నిలిపివేశారని ధ్వజమెత్తారు. వెలగపూడి సచివాలయంలో మీడియా సమక్షంలో మంగళవారం ఈ అంశంపై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీమ ఎత్తిపోతలను సీఎం చంద్రబాబుతో మాట్లాడి తానే ఆపేయించానంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను విలేకరులు ఈ సందర్భంగా ప్రస్తావించగా.. తెలంగాణలో రాజకీయ ఎత్తుగడల నేపథ్యంలో పరస్పర ఆరోపణలు, విమర్శలున్నాయని చెప్పారు. అయితే ఆ రాష్ట్ర రాజకీయాలను ఆంధ్రప్రదేశ్‌కు ఆపాదిస్తూ జగన్ అవినీతి పత్రిక నాలుగు రోజులుగా అబద్ధాలను పుంఖానుపుంఖాలుగా రాస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు కౌంటర్ ఇస్తూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తామే ఆపేయించామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 'అసలీ పథకాన్ని తానే ఆపేసి.. జగన్ రాయలసీమలో చిచ్చుపెట్టేందుకు విషప్రచారం చేస్తున్నారు. ప్రాజెక్టును ఆపేయాలని ఎన్‌జీటీయే ఆదేశాలిచ్చాక వేరెవరో ఆపేయాల్సిన అవసరం ఏముంది? జగన్ పర్యావరణ అనుమతులు



లేకుండా డీపీఆర్ పేరుతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. దీంతో ఎన్‌జీటీ షోకాజ్ నోటీసులిచ్చింది. రూ.2.65 కోట్ల అపరాధ రుసుం వసూలు చేసింది. ఈ ప్రాజెక్టు పేరిట రూ.990 కోట్ల ప్రజాధనాన్ని జగన్ వృధా చేశారు. ప్రభుత్వంపై రూ.750 కోట్ల రుణ భారం కూడా పడింది. ఈ చెల్లింపులపై విచారణకు ఆదేశిస్తాం. శ్రీశైలం రిజర్వాయరులో 841 అడుగుల నుంచి 800 అడుగుల మధ్య అందుబాటులోని 34.3 టీఎంసీలను ఎత్తిపోయడమే ఈ పథకం లక్ష్యమైతే.. అందులో రాష్ట్ర వాటా 22.6 టీఎంసీలు మాత్రమే. ఈ నీళ్లను రోజుకు మూడు టీఎంసీల చొప్పున వారం రోజుల్లోనే పంపింగ్ చేసుకునే వీలుంది. ఇందుకోసం ఎత్తిపోతల పథకం పేరిట రూ.3,825 కోట్లు వ్యయం చేయడం అవసరమో కాదో మేధావులు, సాగునీటి నిపుణులు, జర్నలిస్టులు మాత్రమే చెప్పాలి' అని అన్నారు.

పెద్దిరెడ్డి కంపెనీకి అక్రమంగా 1,067 కోట్లు!

» గాలేరు-నగరి, హంద్రీ-నీవా పనుల పేరిట చెల్లించారు: నిమ్మల

గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా లింక్ కెనాల్ అంటూ 2020 ఆగస్టు 26న రూ.5,036 కోట్లతో పనులకు నాటి సీఎం జగన్ పరిపాలనా అనుమతి ఇచ్చారని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ పనులను తన ప్రభుత్వంలోని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీ పీఎల్ఆర్‌కు అప్పగించారని తెలిపారు. 'ఆ కంపెనీ మెత్తటి మట్టి ఉన్న చోట తవ్వకాలు చేపట్టి.. రాళ్లు తగిలే చోట వదిలేసింది. పైపులను కలుపకపోయినా.. దానికి జగన్ రూ.1,067.84 కోట్లను చెల్లించారు. అనంతరం ఈ డబ్బులు బ్యాంకు ఖాతాల నుంచి మళ్లిపోయాయి. భూసేకరణ చేయకుండా.. నిర్వాసితులకు డబ్బులు ఇవ్వకుండానే భూములు లాక్కున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండానే 2,144 కోట్లతో ముదివేడ, నేతిగుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్లు చేపట్టి.. పీఎల్ఆర్‌కు ఇంకో రూ.690 కోట్లు చెల్లించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రిజర్వాయర్లపై సమీక్షిస్తే.. పనులేవీ కనిపించలేదు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఈ రిజర్వాయర్లకు ఎన్‌జీటీ రూ.100 కోట్ల పెనాల్టీ విధించింది. ఇందులో రూ.25 కోట్లను కూటమి ప్రభుత్వం కట్టాల్సి వచ్చింది. పైగా ఈ పనులు నిలిపివేయాలని కూడా ఎన్‌జీటీ ఆదేశించింది. వీటి నిర్మాణానికి భూసేకరణ కింద రూ.191 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉంటే ఒక్క పైసా కూడా జగన్ చెల్లించలేదు. ఈ పనులపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది' అని చెప్పారు.

సీమ లిఫ్టును ఆపింది ఎన్‌జీటీయే!

» జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం వెల్లడి



హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపింది మేమంటే మేమని తెలంగాణలోని అధికార, విపక్షాలు వాదులాడుకుంటున్న తరుణంలో.. కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారు, ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వ అడ్వయిజర్‌గా ఉన్న బీజేపీ నేత వెదిరె శ్రీరాం దీనిపై స్పందించారు. ఈ పథకాన్ని ఎవరూ ఆపలేదని.. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆపిందని తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో కృష్ణా, గోదావరి జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ పై వ్యాఖ్యలు చేశారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకానికి సంబంధించి ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను మాత్రమే ఏపీ ప్రభుత్వం కేంద్ర జలసంఘానికి ఇచ్చిందని.. డీపీఆర్ కాదని స్పష్టం చేశారు. ఏ సాగునీటి ప్రాజెక్టుకైనా హైడ్రాలిక్, పర్యావరణ అనుమతులు కీలకమని.. కానీ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఈ రెండు క్లియరెన్సులూ రాలేదన్నారు. కానీ సీఎస్ఎంఆర్ఎస్, గిరిజన శాఖ, కేంద్ర భూగర్భ జలాల బోర్డు (సీజీడబ్ల్యూబీ), సీఈఏ వంటి క్లియరెన్సులు సాధించినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేసుకుందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం తిరస్కరించలేదని.. కచ్చితమైన వివరాలు మాత్రమే కోరిందని.. వాటని అందిస్తే డీపీఆర్‌కు ఆమోదం లభిస్తుందని చెప్పారు.

స్మార్ట్ మైక్రో ఇరిగేషన్‌తో ఉద్యాన రైతుకు లాభం

» ఆటోమేషన్‌ను ప్రారంభించిన మంత్రి అచ్చెన్న



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్న

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు, నీటి వనరుల తగ్గుదల, సాగు ఖర్చుల పెరుగుదల వంటి సవాళ్లను అధిగమించి, సుస్థిర వ్యవసాయానికి సాంకేతికతను రైతులు విరివిగా వినియోగించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మంగళవారం విజయవాడలోని రైతు శిక్షణ కేంద్రంలో మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "ఉద్యాన పంటలకు వాడే మైక్రో ఇరిగేషన్‌లో ఆటోమేషన్ గేమ్ చేంజర్ అవుతుంది. ఇప్పటికే ఉన్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమేషన్ అమర్చుకుంటే.. 20-30% నీరు ఆదా కావడంతో పాటు కూలీల ఖర్చు, విద్యుత్ వినియోగం తగ్గుతుంది. పంట నాణ్యత, దిగుబడి పెరుగుతుంది" అని చెప్పారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు.

జగన్ మానసిక స్థితి బాలేదు

» రాష్ట్రాన్ని తానే అభివృద్ధి చేసినట్లు భ్రమలో ఉన్నారు : మంత్రి సవిత



రాజముద్రతో కూటమి ప్రభుత్వం, జగన్ బొమ్మతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలను చూపుతున్న సవిత

కడప, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'జగన్ మానసిక పరిస్థితి బాలేదు. లండన్ మందులు వాడినా ఉపయోగం లేదు. రాష్ట్రాన్ని తానే అభివృద్ధి చేసినట్లు భ్రమపడుతున్నారు' అని కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత విమర్శించారు. మంగళవారం జిల్లాలోని వీరపునాయునిపల్లెలో, నందలూరులో పర్యటించారు. వీరపునాయునిపల్లెలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి జిల్లాలోని ఉల్లి రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున రూ.28.40 కోట్ల పరిహారాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, విశాఖకు డేటా సెంటరు క్రెడిట్ తనదేనని చెప్పుకోవడం చూస్తే జగన్ మానసికస్థితి అర్థమవుతుందని అన్నారు. ఇక్కడి రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేశారు.

ఈ ఏడాది మిర్చి రైతుకు పండగే!

» సాగు తగ్గినా.. ధర పెరిగే అవకాశం

» 1.08 లక్షల హెక్టార్లలోనే సాగు

» నేడు గుంటూరులో మంత్రి అచ్చెన్న సమీక్ష

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా తగ్గింది. అయితే మిర్చి ధర పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మన మిర్చిని దిగుమతి చేసుకునే దేశాల్లో బంగ్లాదేశ్ ఒకటి. ప్రస్తుతం ఆ దేశంలోని పరిస్థితుల వల్ల 10% మించి ఎగుమతులయ్యే అవకాశం కనిపించడం లేదు. భారత్ నుంచి ఏటా 2లక్షల టన్నుల తేజ రకం మిర్చి చైనాకు ఎగుమతి అవుతుండగా, నిరుడు 3 లక్షల టన్నులు ఎగుమతి అయింది. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత చైనాకు మిర్చి ఎగుమతులు జరుగుతాయని అధికారులు చెప్తున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాలు, అలాగే, అన్నమయ్య, ఎన్టీఆర్, నంద్యాల, గుంటూరు, బాపట్ల, ఇతర జిల్లాల్లోనూ మిర్చి సాగవుతోంది. 2024-25లో 1.88లక్షల మంది రైతులు 1.96లక్షల హెక్టార్లలో మిర్చి పండించగా, 2025-26లో లక్షన్నర మంది రైతులు 1.08లక్షల హెక్టార్లలోనే మిర్చి సాగు చేస్తున్నారు. నిరుడు 11.67లక్షల టన్నుల ఉత్పత్తి రాగా, ఈ ఏడాది 5.85 లక్షల టన్నులు మాత్రమే వస్తుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది ప్రారంభంలో మిర్చికి మంచి ధరే లభించినా, తర్వాత ధర పతనం కావడంతో సీఎం కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాత క్వింటాకు కనీస జోక్యం ధర(ఎంఐపీ) రూ.11,781గా కేంద్రం ప్రకటించింది. అయినా నాణ్యమైన రకాలకు తప్ప.. ఈ ధర అందరికీ దక్కలేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం గుంటూరులో మిర్చి రైతులు, ట్రేడర్లు, ఎగుమతిదారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో ధరలపై చర్చించనున్నారు.

ఏడుకొండలపై ఏమిటిది?

- టీటీడీ బోర్డు మరో అడ్డగోలు తీర్మానం
- పాలకమండలి సభ్యుడు జంగాపై కొండంత ప్రేమ
- కొత్త అతిథి గృహం నిర్మాణానికి స్థలం కేటాయింపు

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

టీటీడీలో అసలేం జరుగుతోంది? సొంత నిబంధనలు, తీర్మానాలనే ఎందుకు తుంగలో తొక్కుతున్నారు. మొన్నటికి మొన్న.. 'ఇకపై ప్రైవేటు ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోరాదు' అనే నిబంధనను బుట్టదాఖలు చేశారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడి ఊరిలోని ఆలయాన్ని టేకోవర్ చేశారు. ఇప్పుడు... 'తిరుమలలో కొత్తగా అతిథి గృహాల నిర్మాణానికి స్థలాలు కేటాయించరాదు' అనే తీర్మానాన్ని పక్కన పెట్టేశారు. నిబంధనలనూ, నైతిక విలువలనూ చెత్తబుట్టలో పడేసి.. టీటీడీ బోర్డు సభ్యుడైన జంగా కృష్ణమూర్తి సూచించిన ట్రస్టుకు స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం చేశారు. టీడీపీ హయాంలో కొండమీద అంతా సవ్యంగా సాగుతుందని, నిబంధనలు పక్కాగా అమలవుతాయని భావిస్తున్న వారు తాజా పరిణామాలతో విస్తుపోతున్నారు.

పట్టువదలని 'జంగా'

ఆయన పేరు జంగా కృష్ణమూర్తి! ఆయన.. కాంగ్రెస్ హయాం లో, ఆ తర్వాత వైసీపీ హయాంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. టీడీపీలో చేరి, కూటమి సర్కారులో మరోసారి టీటీడీ బోర్డు సభ్యుడయ్యారు. ఇదే కృష్ణమూర్తికి మరో ప్రత్యేకత కూడా ఉంది. కొండమీద అతిథి గృహం నిర్మించాలన్నది ఆయన లక్ష్యం! దీనికోసం 2005 నుంచీ ఆయన పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నారు. 2005లో కాటేజీ డొనేషన్ స్కీమ్ కింద ఆయన వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 2005 జూలై 31న టీటీడీ బోర్డు స్థలం కేటాయించింది. అయితే, ఈ పథకం కింద అప్పటి దాకా ఉన్న రూ.10 లక్షల డొనేషన్‌ను రూ.50 లక్షలకు పెంచుతూ తీర్మానం చేసింది. అయితే, గడువులోగా డొనేషన్ చెల్లించకపోవడంతో 2006 జూలై 27న అప్పటి టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ జంగా పేరిట చేసిన స్థల కేటాయింపును రద్దు చేసింది. అయినా కృష్ణమూర్తి తన ప్రయత్నాలు ఆపలేదు. అందుకు అప్పటి వైఎస్ ప్రభుత్వం కూడా సహకరించింది. 'ప్రత్యేక కేసు'గా పరిగణించి ఆయన పేరిట స్థలాన్ని కేటాయించాలంటూ 2008 అక్టోబరులో దేవదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ టీటీడీ ఆయనకు స్థలం కేటాయించలేదు. తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆ పార్టీలోనే ఉన్న జంగా కృష్ణమూర్తి మరోసారి తన ప్రయత్నాలు ప్రారంభించారు. జంగా వినతి మేరకు తిరుమలలో స్థలం కేటాయింపును పునరుద్ధరిస్తూ 2021 డిసెంబరు 11న, అలాగే 2022 సెప్టెంబరు 24న టీటీడీ బోర్డు తీర్మానాలు చేసింది. అయితే.. అప్పటికి కాటేజీ డొనేషన్ స్కీమ్ కింద డొనేషన్ మొత్తం రూ.కోటికి చేరింది. ఆ మొత్తం వెంటనే చెల్లించి స్థలం స్వాధీనం చేసుకోవాలని టీటీడీ కోరగా ఆయన రూ.10 లక్షలు మాత్రమే చెల్లించారు. అది కూడా గడువు దాటిపోయాక! ఇక్కడ ఆయన ఇంకో మెలిక పెట్టారు. స్థలాన్ని తన పేరిట కాకుండా 'ఓంశ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు' పేరిట కేటాయించాలని కోరుతూ 2023 జనవరి 4న టీటీడీకి లేఖ రాశారు. అలాగే, డొనేషన్ చెల్లింపునకు నెల గడువు కావాలని జంగా కోరారు. ఆ గడువు కూడా దాటిపోయిన తర్వాత 2023 మార్చి 1న రూ.50 లక్షలు మాత్రమే టీటీడీకి చెల్లించారు. దీనిపై 2023 ఏప్రిల్ 15న జంగా కృష్ణమూర్తికి స్థల కేటాయింపును పునరుద్ధరిస్తూ ఇచ్చిన గత ఉత్తర్వులు రద్దు చేసింది. పైగా డొనేషన్ మొత్తాన్ని 2023 మే 20న వాపస్ చేసేసింది. ఇంత జరిగినా జంగా వదల్లేదు. స్థలం కేటాయించాలని కోరుతూ 2023 అక్టోబరు 19న మరోసారి టీటీడీని కోరారు. 'కుదరదు' అని టీటీడీ తేల్చి చెప్పింది. అంతేకాదు.. ట్రస్టు పేరిట స్థలం కేటాయించడం దేవస్థానం విధానాలకు విరుద్ధమని కూడా స్పష్టం చేసింది. ఇదంతా వైసీపీ ప్రభుత్వంలోనే జరిగింది.

ఇప్పుడు పనైపోయింది..

2024లో కూటమి ప్రభుత్వం వచ్చింది. జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. మూడోసారి బోర్డు సభ్యుడు అయ్యారు. మరోసారి 'స్థల కేటాయింపు' ప్రయత్నాలు మొదలుపెట్టారు. తిరుమలలో అతిథిగృహం నిర్మాణానికి తను సూచిస్తున్న ట్రస్టుకు స్థలం కేటాయించాలంటూ 2025 జూన్‌లో టీటీడీని కోరారు. అనేక మంది అభ్యర్థనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన టీటీడీ జంగా పట్ల ప్రేమ చూపించింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి పంపుతూ 2025 జూలై 22న జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించింది. అయితే... 'స్థలం ఇవ్వాలనుకుంటున్నారా... వద్దనుకుంటున్నారా! మీ సిఫారసు ఏమిటో స్పష్టంగా చెప్పండి' అని 2025 సెప్టెంబరు 18న దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి టీటీడీకి లేఖ రాశారు. ఇక... 2025 అక్టోబరు 28న బోర్డు సమావేశమై, తిరుమలలో స్థలాల కేటాయింపు విషయం లో కఠిన నిబంధనలు అమల్లో ఉన్నాయని చెబుతూనే జంగా కోరిన మేరకు ఓం శ్రీ నమో వెంకటేశాయ ట్రస్టు పేరిట స్థలం కేటాయిస్తూ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపింది.

నైతికత... నియమాలు... లేవా?

- ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం... తిరుమలలో కొత్తగా అతిథి గృహాల నిర్మాణానికి స్థలాలు కేటాయించడం కుదరదు. అయితే... పాతవైపోయిన అతిథి గృహాల స్థానంలో, అక్కడే పునరుద్ధరణకు మాత్రం 'వేలం' ద్వారా అవకాశమిస్తారు. అంటే.. టీటీడీకి అత్యధిక విరాళం చెల్లించేందుకు ముందుకు వచ్చే వారికి రెనొవేషన్ అవకాశం లభిస్తుంది.
- జంగా సూచించిన ట్రస్టుకు నిబంధనలకు విరుద్ధంగా... తిరుమల బాలాజీనగర్‌లోని రెండో ప్లాటును కేటాయించారు. అదే స్థలానికి ఇపుడు వేలం వేస్తే రూ.15 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకూ చెల్లించేందుకు అనేకమంది దాతలు సిద్ధంగా ఉన్నారు. కానీ... జంగా కృష్ణమూర్తి కోరిక మేరకు రూ.కోటికే ఆ స్థలం కట్టబెట్టారు.
- టీటీడీ బోర్డు సభ్యుడుగా ఉన్న వ్యక్తి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తనకు లబ్ధి కలిగే పనులను ప్రతిపాదించడం, దానికి అనుకూలంగా తీర్మానాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అలా చేస్తే వారి సభ్యత్వం సైతం రద్దయ్యే అవకాశముంది. ఈ నిబంధనను కూడా జంగా కృష్ణమూర్తి పట్టించుకోలేదు.
- టీటీడీ ఆస్తులు, స్థలాలు, భూములపై కీలక నిర్ణయం తీసుకునే ఎస్టేట్స్ కమిటీలో జంగా సభ్యుడిగా పనిచేశారు. ఆ హోదాలో ఆయన తన సొంత ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం. అంటే... ఆయన టీటీడీ నిబంధనలతోపాటు నైతిక నియమాలనూ ఉల్లంఘించారు.

ఇంత అడ్డగోలుగానా?

తిరుమలలో అతిథి గృహాల నిర్మానానికి కొత్తగా స్థలాలు కేటాయించరాదంటూ 2006లో టీటీడీ పాలకమండలి తీర్మానం చేసింది. కొత్త నిర్మాణాల పట్ల కఠిన వైఖరి తీసుకోవాలని హైకోర్టు కూడా పలు సందర్భాలలో వ్యాఖ్యానించింది. ఎన్నో ప్రసిద్ధ సంస్థలు, ఎందరో పారిశ్రామిక వేత్తలు అభ్యర్థించినా 'కుదరదు' అని సూటిగా చెప్పేస్తున్నారు. తమ శాఖల తరపున అతిథి గృహాలు నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు కోరినా టీటీడీ 'నో' చెప్పింది. అలాంటిది... జంగా కృష్ణమూర్తికి మాత్రం 'ఎస్' చెప్పేసింది.

ఎవరిది ఆ ట్రస్టు??

తిరుమలలో అతిథి గృహ నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ టీటీడీ రెండుసార్లు ఇచ్చిన అవకాశాన్ని జంగా కృష్ణమూర్తి సద్వినియోగం చేసుకోలేదు. ఇక... మరో రెండుసార్లు టీటీడీ ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. 'ట్రస్టు పేరిట స్థల కేటాయింపు కుదరదు' అని వైసీపీ హయాంలోనే టీటీడీ బోర్డు తేల్చి చెప్పింది. ఇప్పుడు... కూటమి సర్కారు హయాంలో ఆయన అనుకున్నది సాధించారు. 'ఓం శ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు' వివరాలేవీ తెలియడంలేదు. ఆ ట్రస్టు కార్యకలాపాల గురించీ ఎవరికీ తెలియదు. వెరసి... కేవలం కొండ మీద స్థలం పొందేందుకే దీనిని సృష్టించారని తెలుస్తోంది. తనకు కాకుండా ట్రస్టు పేరిట స్థలం కేటాయించేలా తెరవెనుక చక్రం తిప్పారు. దీనివెనుక బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక ఆసక్తి కనబరిచారనే అనుమానాలూ ఉన్నాయి. 2025 అక్టోబరు 28న ఈ అంశం బోర్డు ముందుకు వచ్చేదాకా చాలామంది సభ్యులకు తెలియదు. బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి ఒక్కరే స్థల కేటాయింపును అడ్డుకునేందుకు యత్నించారు. స్థల కేటాయింపు నిబంధనలకు విరుద్ధమని ఆయన వాదించారు. మిగిలిన వాళ్లు మౌనంగా ఉండిపోయారు.

అచ్చం అలాగే

ప్రైవేటు ఆలయాలను టేకోవర్ చేసుకోకూడదంటూ చేసిన తీర్మానాలు, ఈ విషయంలో తలెత్తే పరిపాలన, న్యాయపరమైన, ఇతర సమస్యలన్నీ తీర్మానంలో ప్రస్తావిస్తూనే... యనమల రామకృష్ణుడుకు చెందిన ఆలయాన్ని టీటీడీ బోర్డు టేకోవర్ చేసేసుకుంది. జంగాకు స్థలం కేటాయింపులోనూ అదే జరిగింది. తిరుమలను 'కాం క్రీట్ జంగిల్' చేయకూడదన్న హైకోర్టు ఉత్తర్వులు... పేర్కొంటూనే 'ప్రత్యేక కేసు'గా పేర్కొంటూ జంగా కృష్ణమూర్తి సూచించిన ట్రస్టుకు స్థలం కట్టబెట్టారు.



బ్లో ఔట్ బావి వద్ద మంటల తీవ్రతను తగ్గించేందుకు వాటర్ అంబ్రెల్లా ద్వారా నీటిని వెదజల్లుతున్న ప్రత్యేక బృందాలు

అదుపులోకి బ్లో ఔట్..!

- మూడు వైపుల నుంచి నీళ్లు వెదజల్లడంతో తగ్గుముఖం పడుతున్న మంటలు

అమలాపురం, రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోనసీమలో చెలరేగిన 'బ్లో ఔట్' మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఓఎన్జీసీ సిబ్బంది, అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని ఓఎన్జీసీ సైట్ వద్ద సోమవారం ఉవ్వెత్తున ఎగసిపడిన మంటల తీవ్రత మంగళవారానికి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అగ్నికీలలపై 3 వైపుల నుంచి తీవ్ర ఒత్తిడితో కూడి వాటర్ అంబ్రెల్లా ప్రక్రియతో నీటిని వెదజల్లుతుండడంతో మంటలు అదుపులోకి వస్తున్నాయి.

నిపుణుల బృందాల రాక

ఢిల్లీ నుంచి డైరెక్టర్ టెక్నాలజీ అండ్ ఫీల్డ్ సర్వీసెస్‌కు చెందిన విక్రమ్ సక్సేనాతో సహా ఓఎన్జీసీ సీనియర్ మేనేజ్‌మెంట్, క్రైసిస్ మేనేజ్‌మెంట్(సీఎంటీ) బృందాలు ఓఎన్జీసీ మోరి-5 బావి వద్ద నియంత్రణ పనులు ప్రారంభించాయి. సమీపంలోని పంటకాల్వల నుంచి తాత్కాలికంగా కాల్వను తవ్వడం ద్వారా నీటిని సైట్ వద్దకు మళ్లిస్తున్నారు. సైట్ చుట్టూ చెరువుల మాదిరిగా తవ్వి అందులో అధిక సామర్థ్యం గల వాటర్ పంపులతో నీటిని మంటలపైకి వెదజల్లుతున్నారు. నిపుణుల బృందాలు బ్లో ఔట్ ప్రాంతం వద్ద 600 మీటర్ల పరిధిలో పర్యావరణ ప్రభావాన్ని తగ్గించారు. మంటలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో శబ్ద కాలుష్యం కూడా తగ్గింది. ఇరుసుమండ, చింతలపల్లి, లక్కవరం, గుబ్బలవారిపాలెం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. దీంతో పునరావాస కేంద్రంలో ఉన్నవారు ఇళ్లకు చేరుతున్నారు. ఈ బ్లో ఔట్ రిగ్ వద్ద కాలిపోయిన శకలాల(డెబ్రిషన్)ను తొలగించడానికి ప్రత్యేక రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

మరో వారం రోజులు పట్టే అవకాశం

శకలాలు తొలగింపు తర్వాత బావి ముఖద్వారాన్ని శాండ్ కట్టర్ ద్వారా కట్ చేసి వెల్ క్యాపింగ్ ప్రక్రియ చేపడతారు. మంటల నియంత్రణకు 4 రోజులు పడుతుందని, వెల్ క్యాపింగ్ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం రాత్రి వెల్లడించారు.

ప్రణాళిక సిద్ధం: న్యూఢిల్లీలోని ఓఎన్జీసీ టెక్నికల్ అండ్ ఫీల్డ్ సర్వీసెస్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనాతోపాటు ఓఎన్జీసీ సీనియర్ మేనేజ్‌మెంట్, ముంబై, డెహ్రాడూన్‌ల నుంచి క్రైసిస్ మేనేజ్మెంట్ టీమ్(సీఎంటీ) నిపుణులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఒకేసారి మంటలను అదుపు చేయడం వల్ల శాస్త్రీయంగా, పర్యావరణపరంగా ఇబ్బందులు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున గ్యాస్ లీక్ నియంత్రణ టీమ్‌ల సూచనల మేరకు క్రమంగా మంటలు అదుపుచేసే ప్రక్రియ నాలుగు రోజుల్లో పూర్తిచేయనున్నారు.

బాధితులు ఇబ్బంది పడకుండా చూడాలి

- బ్లో ఔట్ పరిస్థితిపై సమీక్షలో సీఎం చంద్రబాబు

కోనసీమ జిల్లా ఇరుసుమండలో సంభవించిన బ్లో ఔట్ ప్రమాదంపై సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్షించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఇళ్లు, ఊళ్లు వదిలినవారు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని సూచించారు. మంటల వల్ల కొబ్బరిచెట్లు, పంట నష్టం జరిగిన వారికి పరిహారం అందించాలన్నారు. మంటలు అదుపు చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవసరమైన ఏజెన్సీల సహాయాన్ని తీసుకుని త్వరితగతిన సాధారణ పరిస్థితులు నెలకొనేలా ఓఎన్జీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామనే భరోసా ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



మంటల తాకిడికి కాలిపోయిన కొబ్బరిచెట్లు

ఏ డీపీఆర్‌నూ పరిశీలించం

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. జూరాల ప్రాజెక్టు కేంద్రంగా 247 టీఎంసీల సామర్థ్యంతో 16 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం గత సెప్టెంబరులో జీవో 34 జారీ చేసింది. దానిని, ఆయా ప్రాజెక్టుల సూక్ష్మ సమాచారాన్ని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2)కు అందించింది. ఇప్పటికే తెలంగాణలో శ్రీశైలం కేంద్రంగా ప్రస్తుతం 40టీఎంసీలతో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ), 90టీఎంసీలతో పాలమూరు-రంగారెడ్డి, మరో 30 టీఎంసీలతో డిండి ఎత్తిపోతల పథకం పనులు జరుగుతుండగా.. జూరాల కేంద్రంగా 247 టీఎంసీల ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించడంపై కేంద్రానికి ఏపీ ఫిర్యాదు చేసింది. దీనిపై కేంద్ర జలశక్తి శాఖలోని జలవనరుల విభాగం సీనియర్ జాయింట్ కమిషనర్‌కు కృష్ణా బోర్డు మంగళవారం లేఖ రాసింది. '2014 జూన్ 2నాటికి అప్పటికే పూర్తయిన లేదా చేపట్టిన ప్రాజెక్టుల నీటి లభ్యతపై ప్రతికూల ప్రభావం చూపకుండా పర్యవేక్షించే బాధ్యత మాత్రమే బోర్డుకు ఉంటుంది. జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ రాష్ట్రాలు/ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేసేదాకా కృష్ణా ట్రైబ్యునల్-1 (బచావత్) తీర్పు మాత్రమే అమల్లో ఉంటుంది. 2021లో కేంద్రం జారీ చేసిన గెజిట్ ప్రకారం.. అనుమతి లేని ప్రాజెక్టులన్నీ ఏడాదిలోపు క్లియరెన్స్ పొందకపోతే వాటిని పక్కనపెట్టాల్సి ఉంటుంది. నీటి కేటాయింపులు లేకపోవడం, కేంద్ర జలసంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అందని డీపీఆర్‌లను పరిశీలించే అవకాశాలు లేవు' అని అందులో స్పష్టం చేసింది.

రవికుమార్‌తో పోలీసుల కుమ్మక్కు!

- కేసును బలహీనపరచడంలో భాగస్వామ్యం
- వారిపై శాఖాపరమైన చర్యల అవసరం ఉంది
- 'పరకామణి' కేసులో హైకోర్టు

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీకి సంబంధించి నమోదైన కేసును బలహీనపరిచే కుట్రలో భాగస్వాములైన పోలీసు అధికారుల పై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. సీఐడీ, ఏసీబీ దాఖలు చేసిన నివేదికలను పరిశీలిస్తే, నిందితుడు రవికుమార్ తదితరులతో కొందరు పోలీసు అధికారులు కుమ్మక్కయ్యారని స్పష్టమౌతుందని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగానే సరైన సెక్షన్లు నమోదు చేయలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవడం మినహా సరైన సెక్షన్లు నమోదు చేయకపోవడం, ఇతర అంశాల పై చట్ట ప్రకారం ముందుకెళ్లవచ్చని పేర్కొంది. ఆదాయానికి మించి నిందితుడు రవికుమార్, కుటుంబ సభ్యులు సంపాదించిన ఆస్తుల వ్యవహారంపై చట్ట ప్రకారం ముందుకెళ్లే స్వేచ్ఛ సీఐడీ, ఏసీబీకి ఉందని తెలిపింది. మరోవైపు హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టనున్న సంస్కరణలకు సంబంధించి టీటీడీ ఈవో సమర్పించిన నివేదికపై తాము సంతృప్తిగా లేమని వ్యాఖ్యానించింది. పరకామణి సేవ కోసం స్వచ్ఛందంగా వచ్చే భక్తులను అమానవీయ పద్ధతిలో తనిఖీలు చేసే విధానాన్ని తప్పించి, ప్రత్యామ్నాయ పద్ధతిని తీసుకొచ్చే విషయమై, నివేదికలో ప్రస్తావన లేదని తెలిపింది. తనిఖీ చేయడంపై తమకు అభ్యంతరం లేదని భక్తులు చెప్పినప్పటికీ, ఇది మనిషి గౌరవానికి సంబంధించిందని గుర్తు చేసింది. ఈ వ్యవహారం రాజ్యాంగంలోని అధికరణ 21 పరిధిలోకి వస్తున్నందున, భక్తులు సైతం ఆ హక్కును వదులుకోలేరని తేల్చిచెప్పింది. అమానవీయ విధానంలో తనిఖీలు చేయడం నిలిపివేయలేని పరిస్థితి ఉంటే, పరకామణిలో భక్తుల సేవలను నిలిపివేస్తూ ఉత్తర్వులిస్తామని టీటీడీని హెచ్చరించింది. కానుకల లెక్కింపు కోసం టేబుళ్లు ఏర్పాటు చేయాలని కోర్టు చేసిన సూచనల విషయంలో, నివేదికలో ఎలాంటి ప్రస్తావన లేదని గుర్తు చేసింది. ఈ రెండు అంశాల పై స్పష్టత తీసుకొని, కోర్టు ముందుకు రావాలని టీటీడీ తరఫు న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

కేసు నేపథ్యం...: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణిలో జరిగిన చోరీకి సంబంధించి (వైసీపీ హయాంలో) నమోదైన కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్... నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబసభ్యుల స్థిర-చర ఆస్తుల పై లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా, పరకామణిలో సంస్కరణలకు సంబంధించి తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని టీటీడీని నిర్దేశించింది. సేవ పేరుతో కానుకల లెక్కింపునకు భక్తులను టీటీడీ ఆహ్వానిస్తోందని, వచ్చిన భక్తుల లుంగీలు ఊడదీసి డ్రాయర్ల పై సోదాలు నిర్వహించడం అమానవీయ విధానమని పేర్కొంది. స్వామి వారికి వచ్చే కానుకలను అంచులు ఉన్న టేబుళ్లపై పోసి, లెక్కించే విధానాన్ని తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది.

కానుకలు పరకామణికి తరలింపు, వాటిని వేరు చేసి లెక్కించే విధానాన్ని ఆధునికీకరించే విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని టీటీడీని ఆదేశించింది. ఈ పిటిషన్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. పరకామణిలో చేపట్టనున్న తక్షణ సంస్కరణల పై టీటీడీ ఈవో సమర్పించిన నివేదికను పరిశీలించామని, తాము చేసిన సూచనలను టీటీడీ పరిగణనలోకి తీసుకోలేదని న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. టీటీడీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ శ్రీనివాస బాబా స్పందిస్తూ... కోర్టు చేసిన సూచనలను టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లి ఆయనతో చర్చిస్తానన్నారు. ఆ వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టులో నకిలీ నెయ్యి కేసు నిందితుడు చిన్నఅప్పన్న పిటిషన్

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అప్పటి పీఏ చిన్నఅప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన కోర్టు ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సిట్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు.

బెయిల్ కోసం జోగి సోదరుల పిటిషన్లు

విజయవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్ సోదరులు బెయిల్ కోసం రెండోసారి పిటిషన్లు దాఖలు చేశారు. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము బెయిల్ కోరుతూ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును మంగళవారం ఆశ్రయించారు. వారిద్దరూ నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉండగా గతంలో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వారికి బెయిల్‌ను తిరస్కరిస్తూ కోర్టు తీర్పును ఇచ్చింది. ఇప్పుడు మరోసారి బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

రోణక్, అనిల్‌చోఖ్రాలను కస్టడీకి ఇవ్వండి

- ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్

విజయవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న అనిల్‌చోఖ్రా, రోణక్ కుమార్‌లను కస్టడీకి ఇవ్వాలని సిట్ పోలీసులు విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, తనకు బెయిల్ మంజూరు చేయాలని రోణక్ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు.

పిన్నెల్లి సోదరుల బెయిల్ పిటిషన్లు కొట్టివేత

పిడుగురాళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత ఏడాది పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో జరిగిన జంట హత్యల కేసులో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి(ఏ7), కండ్లకుంట ప్రస్తుత సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి(ఏ8)ల బెయిల్ పిటిషన్లను గురజాల 10వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి జి.ప్రియదర్శిని కొట్టివేశారు. ఈ పిటిషన్లకు సంబంధించి మంగళవారం సుదీర్ఘ వాదనల అనంతరం ప్రాసిక్యూషన్ వాదనతో న్యాయాధికారి ఏకీభవించి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు.

నకిలీ మద్యం కేసులో కస్టడీకి ఇద్దరు నిందితులు

ములకలచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులను 2 రోజులు కస్టడీకి ఇస్తూ అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నకిలీ మద్యం తయారీకి హైదరాబాదు నుంచి బాటిళ్ల మూతలు సరఫరా చేసిన నకిరికంటి రవి(ఏ16), ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం సూరంపల్లెలో ప్లాస్టిక్ పరిశ్రమ నిర్వహిస్తూ నకిలీ మద్యం కోసం ప్లాస్టిక్ సీసాలు సరఫరా చేసిన శ్రీనివాసులు రెడ్డి(ఏ23)లను రెండు రోజులు(బుధ, గురువారం) కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి ఉమర్ ఫరూక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ రిఫైనరీపై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విశాఖలోని హిందుస్తాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'అవశేషాల ఉన్నతీకరణ సదుపాయం'(ఆర్ యూఫ్) విజయవంతంగా ప్రారంభమైంది. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ప్లాంట్ ప్రారంభం మాత్రమే కాదని, ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ వేస్తున్న వడివడి అడుగులకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

అన్ని తప్పులా?

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి దీనిపై రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ, ఇతర అధికారులతో ఆకస్మికంగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రీసర్వేలో లోపాలు, రైతులెదుర్కొంటున్న సమస్యలు, పాస్ పుస్తకాల ముద్రణలో నెలకొన్న అంశాలపై ఆయన అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అద్భుతంగా చేస్తున్నాం' అని చెబుతున్నా మౌలిక అంశాల్లో సమస్యలెందుకొస్తున్నాయని ప్రశ్నించారు. రీ సర్వేలో లోపాలు, పాస్ పుస్తకాల్లో తప్పులపై రైతుల్లో నెలకొన్న సందేహాలు, సమస్యలకు రెవెన్యూ శాఖ కార్యాచరణతో కూడిన స్పష్టత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం చివ్వరంలో జరిగిన రీసర్వేలో వచ్చిన తప్పులు, రైతుల ఆందోళనలను వివరిస్తూ 'మళ్లీ అవే తప్పులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. పాస్ పుస్తకాల్లోని తప్పులు, సీఎం సొంత జిల్లాల్లోనే రైతులు ఎదుర్కొంటున్న చిక్కులపై 'పాస్‌కాని పుస్తకాలు' శీర్షికతో మరో వార్తను ప్రచురించింది. రైతుల్లో నెలకొన్న ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. మంగళవారం నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు ఈ అంశాలపైనే దృష్టి సారించారు.

రీ సర్వే... సంగతేమిటి?

"మీరు చెబుతున్న దాని ప్రకారం, మీ నివేదికల ప్రకారం... అంతా పక్కాగా రైతుల సమక్షంలోనే రీసర్వే జరుగుతుంటే తప్పులు ఎందుకు వస్తున్నాయి? రైతులకు నోటీసులు ఇచ్చే సర్వే చేస్తున్నారా? సర్వేలో రైతులను భాగస్వాములను చేస్తున్నారా?" అని సీఎం ప్రశ్నించారు. సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం వ్యవహరిస్తున్నామని, రైతుల సమక్షంలోనే కొలతలు వేస్తున్నామని అధికారులు నివేదించారు. అదే నిజమైతే రైతులు ఎందుకు ఆందోళనగా ఉన్నారని సీఎం ప్రశ్నించారు. "క్షేత్రస్థాయి తనిఖీలు చేశారా? రైతులతో మాట్లాడుతున్నారా?" అని ఆరా తీసినట్లు సమాచారం. సర్వే ముగిసిన తర్వాత రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించాలని ఆదేశించారు. రైతుల విన్నపాలు కచ్చితంగా పరిశీలన చేయాలని... కోర్టు కేసులు, కుటుంబ తగాదాలున్నవి మినహా చట్ట పరిధిలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాలకు వెళ్లి స్వీయ పరిశీలన చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షణ చేయాలన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేయడానికి కొత్తగా రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు ఎందుకు వచ్చాయని సీఎం ప్రశ్నించారు. "ఈ తప్పులకు కారణాలు ఏమిటి? రైతుల పేర్లు, ఫొటోలు, ఇతర వివరాలు ఎందుకు తప్పుగా వచ్చాయి? ముద్రణకు ముందే రైతుల డేటాను పునఃపరిశీలించలేదా? గ్రామ సభలు నిర్వహించలేదా?" అని సీఎం ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకొని, గత జూన్ డేటా ఆధారంగా పాసుపుస్తకాల ముద్రణ జరిగిందని వివరించారు. వీటిని గత ఆగస్టులోనే ఇద్దామనుకున్నామని, కానీ, జాప్యంవల్ల ఈ సమస్యలు వచ్చాయని వివరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ రికార్డులను తాజాపరిచిన తర్వాతే కొత్త పాస్ పుస్తకాలు అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వం ఇచ్చే పాస్‌పుస్తకాల ద్వారా రైతుల్లో నమ్మకం, భరోసా పెరగాలి. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్ది ఇవ్వాలి. కొత్త పాస్‌పుస్తకాలు ముద్రించే ముందుగానే గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి నిర్ధారణ చేసుకోవాలి. ఆ తర్వాతే ముద్రించాలి. రికార్డులను తారుమారు చేయడానికి ఆస్కారం లేకుండా తీర్చిదిద్దాం. ఎవరైనా ట్యాంపర్ చేయాలని ప్రయత్నించినా దొరికిపోతారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుందో రైతులకు వివరంగా చెప్పాలి. రికార్డుల్లో చేసే మార్పులకు రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలి. నోటీసులు ఇవ్వాలి" అని సీఎం ఆదేశించారు. రైతులు, భూయజమానుల సమస్యల పరిష్కారంలో జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. "ఇది రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం. రీ సర్వే, పాసుపుస్తకాల జారీలో రైతుల సంతృప్తిస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందన్నదే కీలకం. దానికి అనుగుణంగానే మీరూ పని చేయాలి" అని తేల్చి చెప్పారు.

జైభారత్, జై తెలుగుతల్లి నినాదాలు

పట్టాదారు పాస్‌పుస్తకాల్లో రాజముద్ర, క్యూఆర్‌కోడ్ తోపాటు 'మీ భూమి- మీ హక్కు, జై భారత్, జై తెలుగు తల్లి' అనే నినాదాలు ముద్రించాలని సీఎం ఆదేశించారు. తదుపరి పుస్తకాల్లో ఇవి ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీలో భాగంగా సీఎం చంద్రబాబు ఈ నెల 9న మండ పేట ప్రాంతానికి వెళ్లనున్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం రైతులకు పాస్‌పుస్తకాలు అందించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.